ఆంధ్రపత్రిక

సచిత్ర వార పత్రిక



4 అణాలు
20-4-55

ANDHRA PATRIKA ILLUSTRATED WEEKLY

సంవత్సర చందా
రు. 12_0_0
విడిప్రతి 4 అ.


ఆంధ్రపత్రిక

సచిత్రవారపత్రిక

Founder : K. NAGESWARA RAO

సంపుటము 48
సంచిక 33
20.4-55

మన్మథ చైత్ర బహుళ త్రయోదశి బుధవారం



కాశ్మీరు లోయ

సంచికలోని కాశ్మీర్ దృశ్యాల ఫొటోలు పంపినవారు: తుమ్మలపల్లి సూర్యనారాయణమూర్తి—శివ్వర.

విషయానుక్రమణిక

ఎదురింటివాడు

కొడవటిగంటి కుటుంబరావు

రంగం 1

నాగేశ్వరం ఇల్లు: ఉదయం

కాంతయ్య: మొత్తానికి భలేపని చేశావులే, నాగేశ్వరం. ఇల్లు మరొకరికి పోనివ్వొద్దని నెల్లాళ్ళుగా చెబుతుంటినిగదా, ఎలా చెయిజారి పోనిచ్చావురా?

నాగేశ్వరం: నన్నేంచేయమన్నావురా, కాంతం? ఆయింటాయినేమో ఊళ్ళో ఉండేవాడు కాడాయె. ఏ అమావాస్యకో, పౌర్ణమికో వచ్చి, వచ్చినప్పుడన్నా రెండు నిమిషాలు నిలిచి మాట్లాడ్డాయె. ఆయనతో మాట్లాడాలంటే నడుస్తూ మాట్లాడాలిసిందేనా? నీకుమాత్రం తెలీదూ? అప్పటికీ, వారంరోజులకిందట కనిపించినప్పుడుకూడా నాతో చెప్పకుండా ఇల్లెవరికీ ఇవ్వనని మాట యిచ్చాడు మరి. ఇంతలోనే ఇట్లా చేస్తాడని కలగన్నానా?

కాం: పోనిస్తూ, ఎడ్వాన్సుదగ్గిర ఏదో పేచీ ఉండిఉంటుంది. అది నువు సరిగా అడిగి తెలుసుకోలేదు; ఇల్లు కాస్తాపోయింది. యాభైరూపాయలకు దివ్యమైనయిల్లు! ఆఫీసుకుదగ్గిర, బజారుకుదగ్గిర. దక్షిణపుగాలి ధారాళంగా వస్తుంది. ఇంకో అయిదు పెట్టమన్నా పెట్టేవాణ్ణే చెప్పొద్దూ! ఎక్కడో మారుమూల అఘోరిస్తున్నాం.

నాగే: పోనీ ఆ అయిదురూపాయ లెక్కువిస్తానని నాతో మాటమాత్రం చెప్పావా?

కాం: ఎట్లా చెప్పనూ? పొరబోసేందుకు నాదగ్గిరమటుకు డబ్బుంటేడిసింది? అంతగా తప్పనిసరయితే ఇచ్చేవాణ్ణేనూ అని నీతో మాటవరసకన్నా. ఈయిల్లు తప్పకుండా దొరుకుతుంది, ఒకరికొకరం ఎదురుగా పడి ఉంటాం, ఒకరింటికి ఒకరు రావాలంటే మైలున్నర రానక్కర్లేదుగదా అని ఎంతో ఆశపడ్డా. ఏంలాభం?...ఎవరదీ?

నాగే: (గొంతెత్తి) మాధవరావుగారా, దయచెయ్యండి, దయచెయ్యండి... వెయ్యేళ్లు! మీమాటే అనుకుంటున్నాం.

మాధవరావు: (వస్తూ) కూచునే వ్యవధిలేదండీ. తిరుగుబండికి వెళ్ళిపోవాలి. కొత్తవారింట్లో ప్రవేశించిందీ, లేందీ చూసిపోదామని వచ్చా.

నాగే: సరేకానీండి, నాతో చెప్పకుండా యిల్లెవరికీ ఇవ్వనంటిరిగదా, మాటమాత్రం చెప్పకుండా ఇచ్చేశారే?

మాధ: అబ్బే, వీరు నెలరోజులేవండీ ఉంటారూ! అందుకనియిచ్చా. పెద్దమనిషి నన్ను వెతుక్కుంటూవచ్చి, వందరూపాయిల నోటు వద్దంటున్నా చేతిలో పెట్టి, ఒక్క నెలపాటుంటానని చెబుతుంటే ఎలా కాదనేదీ?

కాంత: నెలకే వందా?

నాగే: వారి కంత గండగత్తెర ఏమొచ్చిందబ్బా?

మాధ: ఏమోనండీ. అదంతా మనకు తెలీదు. ఆయన నన్ను అద్దెంతనికూడా అడగలేదు - నమ్మతారో నమ్మరో. ఇల్లు ఖాళీ అవుతున్నదని తెలిసిందిట. ఖాళీ కాగానే ప్రవేశిస్తానన్నారు. ఆయన తొందరా, మంచితనమూ చూసి ఒప్పుకున్నా.

నాగే: ఆయన పేరేమిటన్నారూ?

మాధ: ఏదో చిత్రమైన పేరండీ...ఆఁ! సార్వభౌమరావు! .... అబ్బో అప్పుడే తొమ్మిదిన్నర అయిందే? నేను వెళ్ళాలి. శెలవిప్పిస్తారా?

నాగే: ఒక్కమాట వినిపోండి. ఇదిగో ఇతను నా స్నేహితుడు. పేరు కాంతయ్య. ఇతనికి -

మాధ: (వెళ్ళిపోతూ) నేను మళ్ళీ ఎల్లుండి వస్తున్నా. సావకాశంగామాట్లాడుకుందాం.

నాగే: వెళ్ళాడు ... ఇదేవరస! నూరురూపాయల నోటు చేత పెట్టేసరికి ఇల్లు కాస్తా ఇచ్చేసి కూచున్నాడు. ఈ సార్వభౌమరావు నెలరోజులుండి పోతాడంటావా?

కాంత: నాకేం నమ్మకంలేదు. రాబోయేది వేసవి. చుట్టూ చల్లగా చెట్లూ, రాత్రిళ్లు దక్షిణపు గాలీ మరిగాక ఆ యిల్లు వచ్చినా వదల్రు. నాకా యిల్లు దక్కే గీత లేదింతకూ...ఈ మాధవరావు డబ్బుకు బోల్తా పడతాడని మాటమాత్రం తెలిసుంటే ఆ నూరురూపాయల నోటు నేనే ఆయన మొహాన జండా ఊపినట్టు ఊపి ఉందును.

నాగే: నీయిల్లు పాడుగాను - యిల్లుమాట అట్లా ఉండనీ. ఈ సార్వభౌమరావు విషయం కనుక్కోందే నాకు నిద్రపట్టేటట్టు లేదే. ఈయనెవరు? ఏవూరు? ఏ అర్జంటు పనిమీద ఈ ఊరొచ్చాడు? నెల్లాళ్లలో ఈయన చేసే పనేమిటి?

కాంత: నీదంతా ఓ గోల. వాడెవడైతే మనకేం? చాతయితే, ఆయనగారు నెలాఖరుకు కొంప ఖాళీచేస్తాడేమో, అది కొత్త కనిపెట్టుండు...రండి అక్కగారూ. నేనే లెండి.

సీతమ్మ: (వస్తూ) ఇంకెవరిగొంతో కూడా వినిపిస్తేనూ—

కాంత: ఆయన ఎదిరింటాయనలెండి.

సీత: (ఆశ్చర్యంగా) వచ్చాడా? ఏమండీ బాగా పెద్దవాడేటగా? ఆ సూటూ, టోపీ, హడావుడీ అంతా చూసి చిన్నవాడేమో అనుకున్నా.

నాగే: ఇక్కడికొచ్చి నాయన మాధవరావు. ఎదటింటోకి అద్దెకొచ్చి నాయన అనుకుంటున్నావు గావాలు.

సీత: మాధవరావా?...కొత్తాయనేమో, ఎందుకొచ్చాడా అనుకున్నా.

నాగే: ఇంకా రాలేదుగా? వచ్చినప్పుడడుగుదాంలే.

సీత: మీ రడిగిదేమిటి? నేనే అడుగుతాను. మన పనిమనిషిని కాజేశారు, తెలుసా?

నాగే: (ఆశ్చర్యంగా) ఎదటింటివాళ్లే?

సీత: ఆహా...ఇంకా వస్తుందింకా వస్తుందని ఏడున్నరదాకా చూసి ఇంటెడు పనీ నేనే చేసుకున్నా. ఇంతకుముందు చూస్తును గదా, వాళ్ళింటోనించి వస్తున్నదీ! ఏమిటే, ముండా అంటే, కొత్త ఇల్లు బాగుచేసి పొమ్మన్నారన్నది. నిలవదీసి అడిగితే నెలకు పదిరూపాయలిచ్చి పెట్టుకున్నారని ఒప్పుకుంది. పది రూపాయలు! నాలుగు రూపాయలకు అడవా చాకిరీ చేసే దానికెంత దశపట్టిందో! నిన్ననేగా జీతం ఇచ్చేశానూ, ఈపూట అక్కడ చేరిందీ!...అసలీ పనివాళ్లకేకోశానన్నా కృతజ్ఞతంటూ ఉందీ?

నాగే: నువు చెప్పేది మరీ బాగుంది. పది రూపాయలు వొదులుకుని అది నీ దగ్గిర నాలుగు రూపాయలకు పనిచేస్తే కృతజ్ఞత ఉన్నట్టూ, లేకపోతే లేనట్టూనా?

సీత: ఇట్లా మాట్లాడితేనే పనివాళ్లు నెత్తినెక్కేది. దానిసంగతి పోనీండి - ఏదో గడ్డితిన్నది. ఆ పెద్దమనిషికేం పొయ్యేకాలం? ఊళ్లో ఇంతమంది పనివాళ్లుంటే మన మనిషినే కాజెయ్యాలీ?

కాంత: నాగేశ్వరం, ఈయనెవరో తమాషా మనిషల్లే ఉన్నాడ్రా! డబ్బుతో మనుషుల్ని కొనటంలో గట్టివాడే. మాధవరావును కొనేసి నా కిల్లులేకుండా చేశాడా,

★ ఎదురింటివాడు ★

మీ పనిమనిషిని కొనేసి మీకు పనిమనిషి లేకుండా చేశాడు. ఆఁ?

నాగే. బాగా డబ్బున్నవాడల్లే ఉంది. కాని ఈ డబ్బుతో మన గుండెలమీద ఎందు కెక్కి కూచున్నాడని?

సీత: ఎందుకో? నా దుంప తెంచటానికి! ...ఏమండీ, వదినెగారు బొత్తిగా ఇటు కేసి రావటమే లేదే?

కాంత: ఏదీ, మీరు రానిస్తేగా? ఎద టిల్లు తీసుకుంటే దగ్గిరిగా ఉంటాంగదా అనుకున్నా. గద్ద తన్నుకుపోయినట్టు తన్నుకుపోయాడు మానవుడు!

సీత అమ్మాయికి సమ్మంధాలేవన్నా చూస్తున్నారా?

కాంత అడక్కండి, అక్కగారూ. ఇక సంబంధాలు వెతికటం, చెయ్యటం పెట్టు కోలా. నాలుగు రూపాల కవర్లుకొని ఇంట్లో పడేశా. పత్రికలో వధువు కావాలని కని పించే ప్రకటనకల్లా జవాబు రాసిపడెయ్యమని రుక్మిణికీ, మా ఆవిడకూ చెప్పా. రోజూ ఉదయం పత్రిక చూడగానే మా కిదేపని అనుకోండీ ..మా అమ్మాయి కూడా చెప్పేసింది - అరవైలో పడ్డవాడు ఎన్నో పెళ్ళివాడైనా, ఏ కులంవాడైనా చేసు కుంటానన్నది

సీత: (నవ్వుతూ) మీ కెప్పుడూ చమ త్కారంగానే మాట్లాడుతారు లెండి

కాంత: (సీరియస్‌గా) చమత్కారం కాదు, నిజంగానే! ఏమిటండీ లేకపోతే? ప్రాణం విసికిపోతుంటేనూ!

సీత: నిజమేలెండి. మా పెద్దన్నయ్య పెద్దదాని కట్లాగో ముడిపెట్టేశాడు రెండో దానికి ఇరవై రెండేళ్లు. ఇంతవరకు పెళ్ళి పెటాకులూ లేదు. రాసిపెట్టిఉన్నప్పుడవు తుంది లెమ్మని పోరాయించి కూచు న్నాడు.

కాంత: ఎవరైనా అంతకన్న చేసేదిలేదు లెండి.

సీత: మరి మీకు సమాధానాలు రావటంలా?

కాంత: రాకేం? ఒక్కటీ సరిపోకుండా ఉంది. కాకపోయినా, మేం అడ్డమైన ప్రకటనలకూ వేస్తున్నాంలెండి. ఎందుకూ? ఇవాళ ఒక సంబంధానికి వేశాం. లక్ష రూపాయల ఆస్తిగల కుర్రాట్ట. వ్యాపా రంలో ప్రవేశించాట్ట. ఆధునిక పద్ధతులు తెలిసిన పిల్ల, అందగత్తె కావాలన్నారు. రాసి పడేశాం. నాకు తెలీదూ? సమాధానం కూడా రాదు. కాని వేడా డబ్బులకు లోపించటం దేనికీ?

సీత: అంతే లెండి ..క్షణంలో కాఫీ తెస్తున్నా, చెప్పకుండా వెళ్ళిపొయ్యేరు? (పోతుంది).

కాంత ఎందుకమ్మా, ఇంకాస్సేపట్లో భోంచెయ్యబోతుంటేనూ?

నాగే: ఫరవాలేదులేరా! (రామారావు వస్తాడు) ఏంరా, రామూ? ఇంకా కాలే జీకి వెళ్ళే యత్నంలేదా?

రామూ నాన్నా, నాన్నా, ఒక్క అయిదు రూపాయలుంటే ఇయ్యి నాన్నా.

నాగే. దేనికిరా?

రామూ. ఫొటోలు తీయించుకోటానికి.

నాగే: దేనికిరా?

రామూ ఎవరికో పంపించాల్లే, నాన్నా.

నాగే: దేనికిరా?

రామూ: పనికొచ్చేవాళ్లకి సినిమాలో వేషాలిస్తారుట, నాన్నా.

నాగే: (ఆశ్చర్యంగా) సినిమాల్లో వేషా లిస్తావుట్రా?

రామూ చాలా డబ్బొస్తుంది, నాన్నా.

నాగే: ఎవరు చెప్పారు?

రామూ సినిమా స్టార్లంతా లక్షలు సంపా దిస్తున్నారు, తెలుసా?

నాగే: అదికాదురా, బాబూ! ఫొటోలు పంపిస్తే వేష మిస్తామని నీతో ఎవర న్నారూ?

రామూ: ఇవాళ పత్రికలో ఉంది.

నాగే: ఒరే, కాంతం. ఇంటికి పత్రిక తెప్పించటం ముప్పయింది.

కాంత అది నే చెప్పబోను. పత్రిక రానిరోజు మాకు చిన్నబోయినట్టుంటుంది.

నాగే. ఎవరి గొడవ వాళ్లదీ...ఊఁ. ఫొటోలతోపాటు అయిదు రూపాయలు పంపుతావూ? అది కాస్తా వాళ్లు మింగి కూచుంటారు. ఓ పదిరూపాయలు ప్రకటన కింద తగలేసి నేనే ఈ పనిచేస్తే బాగుం డునే, బోలెడంత డబ్బొస్తుంది?

రామూ అయిదు రూపాయలూ ఫొటోలు తీయించుకోటానికే, నాన్నా. వాళ్లకేమీ పంపించనక్కర్లా

నాగే: ఉద్ధరించారు.. రేపో యెల్లుండో చూద్దాంలే.

రామూ: రేపిచ్చేది ఇప్పుడిస్తే ఏం పోయింది, నాన్నా?

నాగే: కాంతం, నీ సలహా ఏమిటి?

కాంత మాట్లాడకుండా ఇచ్చెయ్యి! మనం పిల్లలకు మల్లా, మాన్యాలూ ఇచ్చేది లేనేలేదు. వాళ్ల అదృష్టం చూసుకోవటాని కైనా సహాయపడకపోతే ఎట్లా?

నాగే: వీడి మొహానికి సినిమాలో వెయ్యట మేమిట్రా?

కాంత. అదే పొరబాటు. మన తరం వాళ్లం ఒక్కళ్లమూ అనుకోని పనులుచేసి యాడవలేదు. కాని ఈ తరంవాళ్లు చేస్తు న్నారు. సుదర్శనంగా రబ్బాయి, చూడూ, క్షణంలో గొప్ప కథకుడై కూచున్నాడు. వాణ్ణి ప్రోత్సహించటానికి బాగా రాస్తున్నా డంటున్నారు కాబోలనుకున్నా. తీరా విచారిస్తే, చాలా బాగా రాస్తాట్టా!

నాగే ఇంకేం? ఆ బల్లమీది పర్సులో అయిదు రూపాయలు తీసుకుని నీ యిష్టం వచ్చినట్టు తగలెయ్. సినిమా స్టారువి కాక పోవాలి—అప్పుడు చెబుతా నీపని

రామూ: అవుతాలే నాన్నా. ప్రతాప రుద్రీయంలో పడవలాగేవాడి వేషం ఎంత బాగా చేశానూ?

నాగే. ఏడిశావు, కుంకా (రామారావు నవ్వి వెళ్ళిపోతాడు)

కాంత: అదేమిట్రా?

నాగే చిన్నతనంలో నేను ప్రతాపరుద్రీ యంలో పడవలాగే సీనులో ఓ చిన్న వేషం వేశాలే. అందుకు నన్ను వెటకారం చేస్తు న్నాడు ఆ రోజుల్లోనే వీడు రంగారా యుడి కొడుకువేషం వేశాడు. తాను గొప్ప నటుడనీ, నేను కాననీ వాడి ఉద్దేశం.

కాంత వాడికేం రాని క్షేపమంటివాడు! శరీరపుష్టి లేదు, వరహీనమవుతుందని చూస్తు న్నా గాని, లేకపోతే మా రుక్మిణి నిచ్చి చేసేపనే!

నాగే వాళ్లిద్దరికీ మూడు నెల్లేగా తేడా? పైగా అది ఈ రెండేళ్ళలో చప్పున ఒడ్డూ పొడుగూ తేరికూచుంది. మా వా డిప్పుడు దానిపక్కన తమ్ముడల్లేఉంటాడు.

కాంత. కనక నేగా నాకీ అవస్థా?

సీత (వస్తూ) ఇదుగోనండీ కాఫీ...... వీ మండోయ్, విన్నారా? (గొంతు తగ్గించి) ఆ పనిచేసే ముండ చెప్పింది— రాత్రి మొయిలుకు ఇద్దరాడవాళ్లు దిగా రుట—ఒళ్లంతా కనిపిస్తూ చీరెలూ, మెలి కలు తిప్పుకున్న జుట్టూ వాళ్ళూనూ. అది వాళ్లని వర్ణిస్తుంటే నాకు ఒళ్లంతా గరి పొడిచింది

నాగే ఈసార్వభౌమరావెవడో ఉద్ధంచ పిండంలాగున్నాడే?

కాంత: ఇటువంటివాళ్లు పొరుగున చేరితే మీరింకా సంసారా లేంచేస్తారూ? ఈ పచ్చికలి ఏమిటి అంట!

నాగే అలా కాదులే. ఈయన్ని పొంద లాగే వెళ్లగొట్టాలిసిందే. సబిన్‌స్పెక్టర్ పట్టాభితో సూచనగా అంటా. మిగతా పని అతనే చూస్తాడు

కాంత. ఆయన్ను వెళ్లగొట్టడం ఒకటే ఇదు నా కాయిల్లు వచ్చేట్టు కూడా చూడు, నీకు పుణ్యం ఉంటుంది.

నాగే: ఈసారి పోనిస్తావా?

కాంత: అయితే నేను వెళ్లిరానా? ఆఫీసుకు టయమవుతున్నది.

నాగే: సరేలే. మళ్లీ కలుద్దాం. (లోపలికి పోతూ) స్నానం చెయ్యొచ్చులే!...

రంగం 2.

సీతమ్మ: అబ్బ! ఇవా ళెంత ఉక్కగా ఉందో! మంచాలు బయట వెయ్యనా?

నాగే: రామూ, అమ్మకు తోడు వెళ్ళి మంచాలు బయటికి చేర్చరా.

రామూ: (ఉత్సాహంగా) ఫొటో లివాళ పోస్టు చేశా, నాన్నా

నాగే: చేస్తే చేశావులే, లోపలికి వెళ్లి మంచాలు లాక్కురా..... వరండాలో కూచున్నా పెట్టెలో ఉన్నట్టే ఉంది.

సీత: ఇంత ఉక్కలో కూడా ఎదటింటి వాళ్లు, చూశారా, కిటికీలుకూడా తెరవరు! అసలింట్లో ఎవరూ ఉన్న అలికిడే లేదు. వాళ్లంతా ఏం చేస్తూంటారండీ?

నాగే నే మాత్రం చూశానుటే? నాకేమైనా దివ్యదృష్టి ఉందా?

సీత: కాకపోయినా వాళ్లతో నేను పడే బాధ మీకేం తెలుస్తుందీ?

నాగే: (ఆత్రంగా) నీకా యింటోవాళ్లు కనిపించారా ఏం?

సీత: కనపడకుండానే కాల్చుకు తింటున్నారు. పొద్దున కూరలది వీధిలోకి వస్తే కేకేశా. నాకన్న ముందు వాళ్లు కేవశారుట. అక్కడే ఇచ్చివస్తానని వెళ్ళింది. వెళ్లేటప్పుడు దాని తట్టలో చక్కని వంకాయలున్నాయి. అందులో సగం వాళ్లు కొనేశారుట! అది తిరిగి వచ్చేప్పటికి నాకు కుక్కమూతి పిందెలూ, పుచ్చులూ, చచ్చులూ మిగిలాయి ఎట్లా ఇచ్చావే అంటే వీశె ముప్పావలా అన్నది. కావలిస్తే, ఎదటింటివాళ్ళు కొన్నారు, అడగమన్నది ఇటువంటివాళ్లు మన పొరుగున దాపరిస్తే ఇంకేం బతికేట్టూ? వంకాయలు వీశె ముప్పావలా ఏమిటండీ? ఎవరన్నా వింటే నవ్విపోతారూ!

నాగే: పట్టాభితో ఒక్క మాట చెబుదామంటే పడకుండా ఉంది వీళ్లె అంతు అతనైతే తేల్చును. (కాంతయ్య వస్తాడు) రా, కాంతం. భోజనమయిందా?

కాంత: ఆహా!.. ఇవాళ గాలి బొత్తిగా బిగదీసింది. మా కొంప తెలుసుగా? అన్నం తింటున్నంతసేపు ఎప్పుడు బయట పడదామా అనే! బయటనన్నా కాస్త చల్లగా ఉంటుందేమోనని షికారుగావచ్చా.

నాగే: అట్లా మంచాలమీద కూచుందాం... మనం ఉక్కకి ఇంతగా ఉడికిపోతున్నామా? ఆ ఎదటింటివాళ్లు, చూడూ, పగలయేది, రాత్రయేది ఆ కిటికీలు తెరిస్తే ఒట్టూ!

కాంత. ఆయింటికేం? రాజాయిల్లూ! చల్లగా ఉంటుంది – ఎంత వేసవిలో అయినా కూ

(ప్రక్క పేజీ చూడండి)

“వొస్సా” అంతం

క్రొవ్విడి లక్ష్మన్న

క్రిందటిసారి “వొస్సా” ముచ్చట రాసేను; యీ వొస్సా మూడు మాసాలూ బుద్ధభిక్షువులు పెగోడాల్లో ఉండిపోవలసిందే కాని, మామూలుగా దేశసంచారం చెయ్యడానికి వీల్లేదు. ఈ నిష్ఠ ఆశ్వీజ పున్నంతో అఖరు. ఈ రోజున జరిపే కార్యక్రమాన్ని “సెక వొస్సా” (వొస్సా ఆఖరు) అంటారు. ఆరోజునే “బకు”లు శివ, ఉమ, గణేశ, నారాయణ, బలరాములని పూజించి, వొస్సా ఆఖరు అయింది అనీ, దేవుళ్లు బయటకి రావొచ్చుననీ విన్నవించుకుంటారు! పెగోడా లన్నింటిలోనూ బుద్ధభిక్షువులు పోగయి, వారివారి పాపచర్యలు బహిరంగంగా చెప్పి వొప్పుకుని, మన్నించమని బుద్ధభగవానుణ్ణి వేడుకుంటారు. తరవాత భక్తకోటి సమర్పించిన కానుకలూ, భోజనాదులూ, స్వీకరిస్తారు (క్రిందటిసారి వ్రాసిన ప్రకారం, లాటరీ పద్ధతిలో). బౌద్ధధర్మం, బుద్ధప్రవచనాలూ పఠిస్తారు. “వెస్సాంతర జాతకం” లో భాగాలు చదివి – పురాణ శ్రవణంలాగ – అర్థం చెప్పి, బోధచేస్తారు. ఈ వెస్సాంతర జాతకంలో బుద్ధుడు తాలూకు పూర్వవృత్తాంతం – అంటే తాను ప్రాపంచిక సౌఖ్యాలువొదిలి, భిక్షువుగా మారిన సంఘటన యిత్యాదులు–ఉన్నాయిట


ఈ ఆశ్వీజ పౌర్ణమి రాత్రి దీపాలు అరటి దొప్పల్లో పెట్టి తూంసిలావ్ నదిలో వొదులుతారు అరిటి నారతోనూ దొప్పలతోనూ కూడా ఓ చిన్న కోవెల్లాగ కట్టి, దానినిండా దీపాలుపెట్టి, ముందుగా బుద్ధత్రయానికి (బుద్ధుడు, తద్ధర్మం, భిక్షువులూ – వీటిని ఆభరణత్రయం అని కూడా వ్యవహరిస్తారు) ఆరాధన చేస్తారు.

పల్లెటూళ్లలో ప్రజలు యీ సమయంలో ఏడాదిపొడుగునా నీటిని అపవిత్రం చేసినందుకు, నదీదేవతలనీ జలదేవతలనీ క్షమాపణ వేడుకుంటారు.

బుద్ధభిక్షువులని చక్కగా అలంకరించిన పడవల్లో కూచోబెటి ఉత్సవంతో నదిలో ఊరేగించడం కూడా కద్దు.

ఈనాటి జలోత్సవం గురించి అనేక గాథలు చెబుతారు గాని అందులో రెండే ముఖ్యం అయినవని వాళ్లే అంటారు. ఓ దాని ప్రకారం ఏమిటీ అంటే: బుద్ధభగవానుడి దంతం ఓ నాగుడు తీసుకుపోయి నది అడుగున దాచేసేట్ట అంచేత నదీదేవతలని పూజచేసుకుని తద్వారా భగవానుడి దంతం పూజచేసుకుంటారుట! ఇహ రెండో దాని ప్రకారం ఏమిటీ అంటే: నాగుడి మొర ఆలకించి బుద్ధభగవానుడే, జలచరాలుకూడా తరించడానికిగాను, ఏవో స్మృతిచిహ్నాలు నీటిలో వొదిలేడనీ, అందుకు యీ పండుగ అనీన్నీ.

(ఇంకా ఉంది)



అరటి దూటా, నారతో కట్టిన వొస్సా ప్రభ.

★ ఎదురింటివాడు ★

నాగే: ఇల్లు చల్లదనంమాటసరే - కిటికీలు కూడామూసి ఆకొంపలో ఏం గూడుపుఠానీ చేస్తున్నారా అని!

కాంత: అదా నువ్వనేదీ గూడుపుఠానీ అంటే జ్ఞాపకం వచ్చింది. (గొంతు తగ్గించి) ఈ సార్వభౌమరావురాబడి పన్ను ఎగ్గొట్టేవాళ్లమీద రహస్యవిచారణ జరిపేవాడని నా అనుమానం

నాగే: నిజంగానా?

కాంత: విను ఈ సార్వభౌమరావు వరసగా రెండుగోజులు పరాంకుశంగారింటికి వెళ్ళి ఏదో వ్యవహారాలు మాట్లాడినట్టు మాట్లాడి వచ్చాట్ట. మూగోనాడు ఇన్కమ్ టాక్సువాళ్లొచ్చి పుస్తకాలన్నీ తణిఖీ చేశారు. కేసూ!

నాగే: నేనింకోమాట విన్నా బారిస్టరు సీతారామయ్యగారున్నారు మాదూ

కాంత: ఆయన యిల్లు నిన్న ప్రొహిబిషన్‌వాళ్లు సోదా చేశారుగా!

నాగే: అదికూడా ఎదటింటాయన కట్టుకున్న పుణ్యమే అని బసవేశ్వరరావు నాతో సూచనగా అన్నారు

కాంత (నిర్ఘాంతపోయి) ఓరి వీడి కడుపుడకా! అంతపనీ చేశాడుగా?

నాగే అనే అనుకోవాలి మరి (మాధవరావు వస్తాడు) మాధవరావుగారా ఏమిటి? దయచెయ్యండి, దయచెయ్యండి.

మాధ: మెయిలుకు టైము కావచ్చిందండీ తొందరగా వెళ్లాలి సార్వభౌమరావుగారికి సౌకర్యంగా ఉందో లేదో కనుక్కుపోదామని వచ్చా. అద్దెకుండేవాళ్లు ఇల్లెలా చూచుకోవాలో నిజంగా ఆయనకే తెలుసండీ! సుఖపడటం చాతయిన మనిషి

నాగే: ఆమాట మీరనాలిసిందే! ఈ వారంరోజులుగా ఆ కిటికీ రెక్కలు తెరిచిన పాపానపోతే ఒట్టూ! సుఖం ఎరగని మాబోటివాళ్లం ఉక్కకు తట్టుకోలేక, వేలంతా కడవలకొద్దీ నీళ్లుపోసి తడుపుకుని, గాని మీద మంచాలు వేసుకుని, అప్పటికీ గాలి చాలక నానాఅగచాట్లూ పడుతున్నాం.

మాధ: ఈ బాధంతా ఆయనకు లేదే తూర్పుపక్క రెండుగదులూ ఎయిర్ కండిషనింగ్ చేయించుకున్నారు. గంటసేపు ఆగదిలోకూచుని బయటకివచ్చేసరికి వడదెబ్బ తగిలినట్టయిందనుకోండీ! పాపం, కిటికీతలుపులకు అద్దాలు లేనికారణంచేత, పగలుకూడా గదుల్లో దీపాలు వేసుకుంటున్నారు నాకే సిగ్గయింది ఖర్చయితే అయింది పెట్టిస్తానన్నా ఇంకో మూడు వారాలభాగ్యానికి దేనికి లెమ్మన్నారు.

నాగే అదంతా మాకేం తెలుసు మరి? అయితే చూడండీ, ఆయనకేంపనో మీరేమన్నా విచారించారా?

మాధ: ఆయనపనితో నాకేంపని చెప్పండీ! నే నడగలేదు.

నాగే: ఆఁ, మరేం లేదు, ఆయనా ప్రొహిబిషన్‌సీఐడీ అని ఎవరో అంటేనూ.

మాధ అయితే కానివ్వండీ... రహస్యంగా తాగేవాళ్లకి బాధగాని, మనకేం?

కాంత ఒకవేళ ఇన్‌కమ్‌టాక్స్ సీఐడీ అయినా కావచ్చు

మాధ: ఎవరైతే మనకేమిటి చెప్పండీ? పనిపాటా లేనివాళ్లం వారినిగురించీ, వీరినిగురించీ ఏమేమో అనుకుంటాంగాని, ఆయనవంటివాడు ఇంకొకర్నిగురించి ఆలోచిస్తాడా? వస్తానండీ నాకు రైలు వేళయింది.

నాగే మాధవరావుగారూ, ఒక్కమాట .. ఈ సార్వభౌమరావుగారిని మే మెవరం చూడలేదు. ఆయన వయస్సెంత ఉంటుంది?

మాధ: యాభైఉంటుంది కాని చాలా చలాకీ మనిషి ఇంకా తక్కువున్నట్టు కనిపిస్తాడు

నాగే: ఆయన వెంట 18, 20 వయసుగల పిల్లలున్నారుట. వాళ్లెవరండీ? ఆయన కుమార్తెలా?

మాధ: (ఆశ్చర్యంగా) పిల్లలా? ఆ యింట్లో ఆడవాళ్లెవరూ లేరే? మీరు పొరబడిఉంటారు. ఆ యింట్లో ఉన్నదల్లా ఆయినా, ఆయన కొడుకూ, వంటవాడూనూ వెళ్ళొస్తానండీ (పోతాడు)

నాగే: ఆడవాళ్లు లేరూ! ఇదంతా మాయ సభల్లే ఉందే! ఆడవాళ్లను చూశానని మా అవిడేలో పనిమనిషి చెప్పిందిట?

కాంత: వెళ్లిపోయ్యారేమో.

నాగే ఎప్పుడు వచ్చినట్టు, ఎప్పుడు వెళ్లినట్టు? ..చూడు, కాంతం? నీకాయిల్లు బాగా తెలుసుగదా, అందులో ఆడవాళ్ల నెక్కడన్నా దాచటానికుందా?

కాంత: దాస్తే, నీళ్లగదిలో దాయాలి.

నాగే: అవును—దాచారేమో?

రామా. (అంతకుముందే వచ్చికూచుని) ఇదంతా ఏదో డిటెక్టివ్ కథల్లే ఉంది, నాన్నా!

నాగే. నువ్వెప్పుడొచ్చావురా? చదువూ సంధ్యాలేదా ఏమిటి?

రామా చదవటం పూర్తిచేసే వచ్చా, నాన్నా.

నాగే: అట్లాఅయితే ఆ మంచంమీద పడుకుని నిద్రపో. అమ్మ ఇంకా లోపల ఏం చేస్తున్నదీ?

రామా: ఊరగాయ కలుపుతున్నది .. సరేగాని, నాన్నా, ఎదురింటాయన సంగతి తమాషాగా లేదూ?

నాగే తమాషా నీక్కూడా తెలిసిందీ?

రామా: నేను కళ్లారా చూస్తేనే?

నాగే. ఏం చూశావు నువు?

రామా. పెద్ద బట్టలషాపులో ఈ మునలాయన ఇవాళ దీపాలు పెట్టేవేళ డజను చీరెలు కొన్నాడు. నాలుగువందల రూపాయల బిల్లు, నా కళ్లారా చూశా.

నాగే మరి మాధవరావు యింట్లో ఆడపురుగే లేదంటాడేం? పొట్టి మన్నుదిన్న పాము! నన్నడిగితే ఆ యింట్లో ఏదో పెద్ద తతంగమే జరుగుతున్నది ఈ సార్వభౌముడు ఏ సీఐడీ కూడా కాడు. వందమంది సీఐడీలు పిడి వెంటబడితేనే గాని ఆ మూసిన కిటికీల వెనక ఏం జరుగుతున్నదీ తెలీదు.

కాంత అసలు కిటికీలు మయ్యటానికే గదులు ఎయిర్ కండిషన్ చేశాడేమో అది చూడు!

నాగే ఆమాట నిజంరా! భలే పట్టావు మోసం!.. పిచ్చిముండాకొడుకు, మాధవరావు, ఎయిర్ కండిషనింగ్ ప్లాంట్ చూసి ధ్వంసైపోయినాడు. గదులు చల్లగా ఉండటానికే, ఫిట్టాడయ్యా, అద్దాల తలుపులు పెట్టిస్తానంటే వద్దనటమేం?

కాంత దానికి సమాధానం చెప్పు! .. నువ్వన్నట్టు ఇందులో ఏదో తిరుగుడుంది. అన్నట్టు, నువు పట్టాభితో మాట్లాడా?

నాగే. ఏదీ? మొదట మరిచేపోయినా. తరవాతి నాకు తీరలా. ఇంతలో ఈయన





"ఏ యెండకా గొడుగులు"

—ఈమని సత్యనారాయణ రెడ్డి—రాజమండ్రి.

సీఐడీ అని బసవేశ్వరరావు నాతో అన్నాడు. నేను నమ్మా. (సీతమ్మ వస్తుంది)

కాంతి: ఏమండీ అక్కగారూ, ఊరగాయి పెడుతున్నారా?

సీత: పెట్టటం మొన్ననే పెట్టాం. ఉప్పూ, నూనే చాలనట్టు కనిపిస్తేనూ... ఈసారి మా ఆవకాయికి మంచి కారం పడింది లెండి. తెడ్డుతో నూనెత్తిస్తే నెత్తురల్లే ఉంది!

కాంతి: ఏదీ, మా యింట్లో ఇంకా పెట్టలా. వీలు చూసుకుని అన్నీ తెచ్చి పడేయాల్లి...ఆఁ, చాలా పొద్దుపోయినట్టుంది. ఊరంతా మాటుమణిగింది. నేను రాలేదని మా ఆడవాళ్లు తిట్టుకుంటూ ఉంటారు. మా దిక్కుమాలిన పేటలో పట్టపగలే దొంగల భయం! కిందటేడు మధ్యాహ్నం రెండుగంటలప్పుడు మా యింటి పక్క సందులో హత్య జరగలా? (ఎదటింటినుంచి ఒక స్త్రీ ఆర్తనాదం కర్ణవిదారకంగా వినిపిస్తుంది. తరవాత, బొంగురు గొంతు, "చావు ముండా!"... కాస్సేపు నిశ్శబ్దం. ఇక్కడినుంచీ ఈ రంగం చివరిదాకా అందరూ రహస్యంగానే మాట్లాడతారు.)

సీత: (వొణుకుతూ) ఏమిటండీ అదీ?

రామా: (భయంతో) హత్య, నాన్నా! ఎవరినో పొడిచి చంపేశారు.

నాగే: పోలీసుల్ని పిలుస్తామా?...ఏం, కాంతం?

కాంతి: మన కెందుకొచ్చిన పీడ!

నాగే: గుట్టు చప్పుడు కాకుండా కళ్ళు మూసుకు పడుకుందాం.

కాంతి: అయితే మీరు పడుకోండి. నే పోతా.

నాగే: కొంచెం ఆగు. వీధిలో ఎవరూ లేకుండా చూసి మరీ పోదూ గాని.

కాంతి: అదీ నిజమే...ఈ కేకవిని ఎవరన్నా వచ్చేదీ లేనిదీ ఇంకో అయిదు నిమిషాలల్లో తేలిపోతుంది.

సీత: ఎంత భయంకరమైన కేకో! నా చెవుల్లో ఇంకా గింగురుమంటూనే ఉంది.. ఉక్కయితే అయింది, లోపలే పడుకుందామండీ!

నాగే: నువ్వయినదానికీ, కానిదానికీ భయపడకు...ఏదీ? మళ్ళా ఏ చప్పుడూ లేదు...చూడూ, కాంతం, ఎవరినన్నా చంపారే అనుకుందాం. చచ్చేమనిషి అంత కేక పెట్టాక, హంతకుడు, "చావు ముండా" అని అట్లా అరుస్తాడా?

కాంతి: నువ్వు చెప్పేది మరీ బాగుంది. కోపంలో చంపేవాడికి ఆలోచనా, సాలోచనా ఉంటుంది? ఒట్టి కేక అయితే మనం హత్య అనుకోనక్కర్లేదు. "చావు ముండా" అన్న తరవాత హత్య కాదని ఎట్లా అనుకోవటం?

సీత: ఇదెక్కడి పాపిష్టి పీడ వచ్చి పడిందండీ మనకూ?

నాగే: నువ్వూరుకో!... ఇంకోటి చూశావా, కాంతం? ఆ పిచ్చిముద్దు, మాధవరావు ఆ ఇంట్లో అద్దెపురుగే లేదంటాడు గదా, ఇప్పుడు మనం విన్న కేక ఎవరు వేసినట్టూ?

కాంత: పల్లిపోయినాడు గాని, ఇంకో అయిదు నిమిషా లాగినట్టయితే, ఈనాటి అయినన్నా అడిగేవాళ్ళం... ఆ తండ్రీ కొడుకు లిద్దరికీ వేద కొట్టుకింద గొయ్యి తవ్వుతుంటారు. ఇంకాస్సేపటికి శవం మాయమవుతుంది. తెల్లారేలోపల రక్తం మరకలూ అవీ కడిగేస్తారు—

సీత: చెప్పకండీ! అసలే భయమేసి చస్తూంటేనూ!

కాంత: ఇప్పుడిక మనం భయపడి మాత్రం చేసేదేమిటి?...సార్వభౌమరావు మీద హత్యానేరం ఎవ్వరూ మోపలేరు. ఈరాత్రి ఆ యింట్లో అసలెవరూ లేరని ప్రమాణం చేసి చెప్పటానికి మాధవరావు ఉండనే ఉన్నాడు. చావుకేక చెవులారా విన్న

★ ఎదురింటివాడు ★

వాళ్లం మనం సాక్ష్యం ఇవ్వంగదా!...అసలీపని చెయ్యటానికే ఇల్లు అద్దెకు తీసుకుని ఉంటాడు. రేపో ఎల్లుండో చల్లగా ఇల్లు ఖాళీచేసి వెళ్ళిపోతాడు. ఆ తరవాత ఆ యిలు ఊరికే ఇచ్చినా నా కక్కర్లేదు. బతికుంటే బలుసాకు తినొచ్చు; హత్య జరిగిన కొంపలో తెలిసి నే నుండలేం ?

రామా: వాళ్ల గోడ దూకి లోపల ఏం జరుగుతున్నదో చూసిరానా, నాన్నా?

నాగే. (పళ్లు బిగబట్టి) నువ్వూరుకోరా!

కాంత: చూడు, నాయనా, రామారావ్! పెద్దవాణ్ణో, చిన్నవాణ్ణో చెబుతున్నా. ఈ విషయం పొరపాటున కూడా ఎవరిదగ్గిరా ఎత్తవద్దు. నీ పరీక్ష లేమిటో నువు చూసుకో. హత్య అంటూ జరిగినాక అది ఎప్పటికైనా బయటపడి తీరుతుంది. దాన్నిగురించి ఎవరి కేమాత్రం తెలిసినట్టు కనబడ్డా, ముందు ఎరెస్టు చేసి తరవాత మాట్లాడతారు...చాలా పొద్దు పోయిం ది. నే వెళ్లొస్తా. మీరందరూ జాగ్రత్త సుమా!

(వెళతాడు)

సీత: నాయనా, మంచాలు కాస్త లోపలికి పట్టరా.

రామా: చచ్చేట్టు బయటికి చేరేశాను గదా, మళ్ళీ లోపలి కేమిటమ్మా?

సీత: నేను చచ్చినా బయట పడుకోను.

నాగే: పోనీ నువు లోపల పడుకో.

సీత. నేనొక్కత్తెనూనా ? ఇం కా నయం! (ఆగి) అదుగో, వినండీ!...అది కోళాయి చప్పుడు కాదూ? (కొళాయి చప్పుడు వినిపిస్తుంది) వాళ్లు చేతులు కడుక్కుంటున్నారు!...

రంగం 3.

నాగేశ్వరం ఇల్లు: సాయంకాలం

మాధవరావు· నాగేశ్వరంగారూ, నాగేశ్వరంగారూ!

నాగే: మాధవరావుగారే!దయ చెయ్యండి దయ చెయ్యండి. ఎప్పుడు రావటం?

మాధ: రైలు దిగివస్తున్నా.

నాగే: ఎప్పుడు కనిపించినా వెళుతూ కనిపిస్తారు గాని, వస్తూ కనిపించరు. ఇవాళేదో విశేషం ఉంది...కొంచెం మంచి తీర్థం తెప్పిస్తా.

మాధ: అవసరం లేదు......ఇవాళేం చిత్రమో చల్లగా ఉంది. రైల్లో కూడా నాకేమీ శ్రమ కలగలా.


నాగే: మీరు తాపీగా వచ్చి కూచుని మాట్లాడటమే విశేషం. అందుకనే ఇవాళ ముబ్బుముబ్బుగా ఉంది.

మాధ: నన్ను గురించి మీ కలాటి భావం ఉంది, ఏం చెయ్యను?. కిందటిసారి ఇల్లు మీకు చెప్పకుండా మరొకరి కిచ్చినందుకు గట్టిగా మందలించారు. అలాటి పొరపాటు మళ్లీ జరక్కుండా మీ కీసారి ముందే చెబుతున్నా. ఈ రాత్రికి ఇల్లు ఖాళీ అవుతున్నది. మీ చిత్తం వచ్చినవారి కివ్వవచ్చు.

నాగే: సార్వభౌమరావుగారు ఇల్లు ఖాళీ చేస్తున్నారా ఏం?

మాధ: అవును. ఆయన ఉత్తరం రాస్తే నే వచ్చా. నెలరోజు లుంటామన్నారు. ఇరవై నాలుగు రోజులే ఉన్నారు. వెళ్లిపోతున్నారు. వారి పని అయిపోయినట్టుంది.

నాగే: ఏనాడో అయిపోయింది.



మాధ: ఏమిటన్నారూ?

నాగే· అయిపోకపోతే ఉండేవారేగా !

మాధ: నిజమే...ఇందర్ని చూశాను గానివ్వండి, అద్దె కుండేవారిలో సార్వభౌమరావుగారంటివారు బహు అరుదు.

నాగే: దానికేమీ సందేహం అక్కర్లేదు ... అటువంటివాడు ప్రపంచమంతా గాలించినా దొరకడు.

మాధ: కరెక్టుగా చెప్పారు...ఏమండీ, నూరు రూపాయలి స్తిరి, నెలన్నా ఉండకపోతిరి, ఇంటి అద్దె నెలకు యాభయ్యే, కనీసం యాభయ్యన్నా తిరిగి పుచ్చుకోండీ అంటే ససేమిరా విన్లేగు.

నాగే: ఆయన కాయిల్లువల్ల కలిగిన లాభంలో ఈ యాభై ఏపాటిలెండి?

మాధ: ఇంటివల్ల లాభమా?

నాగే: ఏం లాభం లేకుండానే ఈయిల్లు తీసుకుని, దానిమీద ఇంతఖర్చు చేసి, ఇన్నాళ్లూ ఎవరికంటూ పడకుండా ఇక్కడ ఉన్నారా?

మాధ (నొచ్చుకుని)మన సార్వభౌమరావు గారిమీద ఏదో దురభిప్రాయం ఉన్నట్టు తోస్తున్నది. నిజంగా ఆయన చాలా పెద్ద మనిషి. మీ రాయన్ని ఎరిగుంటే ఇలా మాట్లాడరు.

నాగే: మాధవరావుగారూ, నే నొక్కటి చెబుతాను వినండీ. ఈ సార్వభౌమరావు గారిని నే నింతవరకు చూసినపాపాన కూడా పోలేదు. ఆయన్ని గురించి నా కేఅభిప్రాయమైనా ఉంటే దానికి ఆధారాలు ఆయన కల్పించినవే అనుకోండి.

మాధ. మీ కాగ్రహం తెప్పించటానికాయన ఏం చేసిఉంటారబ్బా?

నాగే: నాకాయన ఆగ్రహమే తెప్పించారని మీరెందు కనుకోవాలీ? ఆయనలో మీకున్నంత గురి నాకు లేదు, అంతే! మీరు నాకు అన్నలాంటివారు. మనం ఎదురెదురిళ్లవాళ్లం. మీ మంచికోరే చెబుతున్నాననుకోండి - ఇల్లు ఖాళీచేసి పుచ్చుకునే ముందు, ఇల్లూ దొడ్డీ కాస్త జాగ్రత్తగా పరీక్షించి మరీ పుచ్చుకోండి. తరవాత పీకమీదికివస్తే చేసేది ఉండదు.

మాధ: ఏమిటండీ, చిత్రంగా మాట్లాడుతున్నారూ? పీకలమీదికి రావటమేమిటి? ఇల్లూ దొడ్డీ పరీక్షించటమేమిటి?

నాగే. దొడ్లో ఏమన్నా తవ్వినజాడలున్నాయేమో చూడండి.

మాధ. (అయోమయంగా) తవ్వటమా? దేనికి తవ్వటం? ఎవరు తవ్వటం?

నాగే. అంత అమాయికంగా మాట్లాడతారేమండీ? పాదులు వెయ్యటానికి దొడ్డి తవ్వరోయూ?

మాధ: అందులో తప్పేముందీ?

నాగే. తప్పేమీ లేదు. కాని, దొడ్డి తవ్వినట్టుగాఉండి, పాదులుమాత్రం లేకపోతే అది ఆలోచిందవలిసినవిషయమేగా?

మాధ: పొదులు వెయ్యనివారు ఉత్తినే తప్పుతారా?

నాగే: ఊరికే ఎందుకు తప్పుతారులెండి? తప్పితే పొదులకోసం తప్పాలి, లేకపోతే మరెందుకైనా తప్పాలి

మాధ: మరెందుకై ఉంటుందని.

నాగే: తప్పటంమటుకు జరిగి పొదులు కనిపించకపోతే చెప్పండి. పై విషయాలు అప్పుడు చెబుతాను.

మాధ: మీరు నన్ను చాలా కంగారు పెట్టేస్తున్నారు

నాగే. కొంపతీసి, నేనిట్లా అన్నానని ఎవరితోనన్నా అనేరు!.. ఇది మీ క్షేమం కోరి చెప్పాను.

మాధ: నేనెవరితోనూ అనన్లెండి. కాని మీకేమైనా అనుమానాలుంటే, వాటికి కారణంలేదని నా గట్టినమ్మకం. (రామారావు వస్తాడు) ఏమోయ్, రామారావ్! పరీక్షలయిపోయాయా?

రామా: అయిపోయినయ్యండి.

మాధ: బాగా రాశావా?

రామా: ఫస్టుగా రాశానండీ.

మాధ: భేష్, ఫస్ట్‌క్లాస్‌లో పాస్‌కా!... అయితే, నాగేశ్వరంగారూ, ఇంటి కెవరినో చూస్తానన్నారు, వారు తీసుకోవటానికి సిద్ధంగా ఉన్నారా?

నాగే: వారు కిందటి ఒకటో తేదీకైతే తీసుకునేవారే ఇంకో ఇల్లు చూసుకున్నారు.

మాధ: అయితే మరొకరకు చూసుకున్నారు. మాట ఇచ్చెయ్యనా?

నాగే. అవశ్యం ఇచ్చెయ్యండి.

మాధ: మరి నేను వెళ్లొస్తా

నాగే. మంచిదండి. (మాధవరావు వెళతాడు)

రామా: ఏం, నాన్నా? ను వక్షింతలు చేసినట్టే అయిందే? ఆ సినిమా కంపెనీవాళ్లు అతీ గతీ లేదు, నాన్నా. వాళ్లకోసం అయిదు రూపాయలు తగలేసి ఫోటోలు తీయించుకున్నానూ.

నాగే: పోతే పోయినై లేరా వెధవ అయిదురూపాయలూ! నీ తృప్తికోసం ఇచ్చానే గాని, అందువల్ల లాభం ఉండదని నా కానాడే తెలుసు.

రామా: (సంకోచంగా) ఇంకో అయిదు రూపాయలుంటే ఇయ్యి, నాన్నా.

నాగే: మళ్లీ దేనికిరా?

రామా: అయిందేదో అయింది, నాన్నా. వ్రతం చెడ్డా ఫలమైనా దక్కాలి. ఆ ఫోటోల కాపీలు కొన్ని తీయించి ఫిలిం కంపెనీల కన్నిటికీ పంపితే ఏదో ఒకరాయి తగలొచ్చు. ఏమంటావ్?

నాగే: నీ తెలివి అఘోరించినట్టే ఉంది. ఒక్క బొప్పితో బుద్ధిరాలా?

రామా: (బతిమాలుతూ) ఇంకొక్క అయిదురూపాయలియ్యి, నాన్నా. ఆ తరవాత సినిమాసంగతి ఎత్తితే అప్పుడడుగు

నాగే: ఇంకేం! తగలెయ్. నా [illegible] జేబులో పర్సుంది. తీసుకో.

రామా: తీసుకున్నాలే, నాన్నా. నువ్వొప్పుకుంటావని నాకు తెలుసు.

(రామారావు పరిగెత్తిపోయాక కాంతయ్య వస్తాడు.)

నాగే: రా, కాంతం. కూచో.

కాంత: ఎక్కడికో మనవాడు తొందర పనిమీద పోతున్నాడే?

నాగే: వాడి మొహం, నా మొహం! ఆనాడు అయిదురూపాయలు తీసుకుని ఫోటోలు తీయించుకుని ఎవరికో పంపాడా? మళ్లా ఇంకో అయిదురూపాయలు తీసుకున్నాడు. ఫోటోలు అన్ని సినిమా కంపెనీలకూ పంపిస్తాట్ట!

కాంత: ఏమో, వాడి అదృష్టం ఎట్లా ఉందో...చూడు, నాగేశ్వరం, అదృష్టం పండి మనవాడికి సినిమాచాన్సు దొరికిందనుకో - ముందుగా వాడికి పెళ్లిచేసి ఉంచటం మంచిదికాదూ? మాటవరసకి చెప్పా!

నాగే (నవ్వి) వాడి కప్పుడే పెళ్లేమిటీ? పసితనం ఇంకాపోందే?

కాంత: పెళ్లయి, సంసారం మీదపడితే పసితనం అదే పోదుల్తుంది...చూడు, నాగేశ్వరం, నా కంటికి మనవాడు కొంచెం కొంచెం పుష్టిచేస్తున్నట్టు కనిపిస్తున్నది. నువ్వు గమనించలా?

నాగే: ఇవాళ వాడిమీద పట్టించావేమిటి?

కాంత పంచాంగం చూసి మరీ వచ్చాలే. నువ్వు ఊఁ అంటేనా, రుక్మిణికీ రామూకూ ముడి పెట్టేద్దాం!

నాగే: నీ యిల్లు బంగారం గానూ! అదా విషయం? అంత జారిపోయావేం?

కాంత: జారిపోవటమని మెల్లిగా అంటున్నావా? ఈ పెళ్ళి నాకిష్టంలేదు, మా ఆవిడకిష్టంలేదు, మా రుక్మిణి కిష్టంలేదు. బహుశా నీకుగాని, మీ ఆవిడకు గాని, రాముకి గాని ఇష్టం ఉండదు. అయితే అయింది ఇష్టంలేని పనులెన్ని చేస్తున్నాం కాం? వాళ్ళకి పెళ్ళిచేసేదాం నువ్వు ఊఁ అను!

నాగే ఏదో జరగందీ నువ్విట్లా తెగబడవు. ఏమయిందో చెప్పు.

కాంత: (విరక్తిగా) ఏమయిందా? నా శ్రాద్ధమయింది! పత్రికల్లో ప్రకటనలు చూసి ఇంతకాలంగా ఉత్తరాలు రాస్తున్నానా? వచ్చే జవాబులన్నీ యాభయ్యేళ్ళ దగ్గర్నుంచీ, తిన తిండిలేనివాళ్ళ దగిగ్గర్నుంచీనూ! రమ్మని రాస్తే నాలుగురోజుల క్రితం ఒకడొచ్చాడు వాణ్ణిచూసి మా అమ్మాయి ఏదో చందాకోసం వచ్చాడనుకుంది! మురికి గుడ్డలు కట్టుకున్నాడు. గడ్డం మాసిఉంది దవడలు పీక్కుపోయి ఆకలితో మాడుతున్న వాడిలా ఉన్నాడు ఉద్యోగం లేదుట. నా ఖర్చుతో పెళ్ళిచేసి ఇంట్లో ఉంచుకుని ఉద్యోగం ఇప్పించాలిట! సుష్టుగా భోజనం పెట్టి, పెళ్ళాంకోసం మటుకు ఇంకో ఇల్లు చూసుకోమని చెప్పా! అయిందా? ఇవాళ ఇంకో డొచ్చాడు. డాబుగా, దర్పంగా ఉన్నాడు కాని వయసు యాభయ్యేళ్లుంటుంది "మీరేనా కాంతయ్యగారు? మీ పిల్లకేనా పెళ్ళిచేస్తామంటున్నారు?" అని అడిగాడు. నాకు ఒళ్లుమండిపోయి, "తమరేనా పెళ్లికొడుకు?" అని అడిగా. ఆయన నవ్వి, "నేను తగనా ఏమిటి?" అన్నాడు. ఇంతలో మా రుక్మిణి వచ్చింది. "ఇదేనా పెళ్ళికూతురు?" అన్నాడాయన. "అవును, ఏమయితే?" అన్నా. మారుమాటాడకుండా వెళ్లిపోయినాడు నాకు ప్రాణం చాలొచ్చింది నువు నేను చెప్పినట్టు ఒప్పుకో. లేదూ, నీ అరుగుమీద అభోజనం పడుకుంటా. తరవాత నీ యిష్టం అక్కగార్ని పిలు. ఆవిడకూడా ఈమాట చెప్పేస్తా.

నాగే నువు తొందరపడకుండా ఉంటే- (సార్వభౌమారావు వస్తాడు) ఎవరది?

కాంత (రహస్యంగా) ఆయనే!

సార్వభౌమారావు నన్ను సార్వభౌమారావంటారు నేను చాలా రోజులుగా ఈ ఎదిటింట్లో ఉన్నా ఇవాళే ఇల్లు ఖాళీ చేస్తున్నాం. నా కొడుక్కి సినిమా తీయాలనే సరదా ఉంది వాడొక కొత్తపద్ధతిలో సినిమా తీయ తలపెట్టాడు. వాడికి సౌండ్ రికార్డింగ్, ఫిలిమ్ ఎడిటింగ్ తెలుసులెండి. సినిమా తియ్యటం వివరాలిప్పుడెందుకుగాని, మేం చేసిన పనేమిటంటే తీయబోయే సినిమాకు కావలసిన సౌండ్ ట్రాక్ యావత్తూ ముందుగా తయారుచేశాం. ఇది తీరా అయ్యేవారకే అవుతుందో, కోవే అవుతుందో తెలీదు ఒక విచిత్రమైన ప్రయత్నం మటుకు చేస్తున్నాం ఎన్నడూ సినిమాలలో కనబడని వారిచేత వేషాలు వేయిస్తున్నాం. వారంరోజుల్లో పిక్చరు పూర్తిచేయాలని మా ఉద్దేశం. రికార్డింగుకు నెలరోజులు వేసుకున్నాం అనుకున్నదానికన్న ముందే అయిపోయింది. ఇంతకు నొచ్చిందేమంటే మీ అబ్బాయి పంపిన ఫోటోలు అందాయి ఆ కుర్రాడు సినిమాకు పనికొస్తాడని నా నమ్మకం. వచ్చే ఒకటో తారీక్కు మీవాణ్ణి మద్రాసులో ఈ ఎడ్రసుకు రమ్మనండి. తలవని తలంపుగా కాంతయ్యగారు కూడా ఇక్కడే దొరికారు. మీ అమ్మాయి నాకు నచ్చింది. మావాడు స్వయంగా చూసిరావటానికి వెళ్ళాడు. వాడిక్కూడా నచ్చితే పెళ్లి ఏర్పాటు ఆలోచిద్దాం పిల్ల బాగుండటం ప్రధానం; మీ దయవల్ల మాకు డబ్బుకేమీ లోటులేదు

ప్రసాద్: (బయటినుంచి) నాన్నగారూ?

సా. రావు: రారా, ప్రసాద్.

కాంత: ఇతనా పెళ్లికొడుకు.

ప్రసాద్ అవునండీ ... (నవ్వుతూ) మీ అమ్మాయిని మా నాన్న కిస్తామన్నారటగా?

సా రావు: పిల్లని చూశావా?

ప్రసాద్ చూశాను, నాన్నగారూ. సరిగా నాకు కావలసిన షేప్ పెట్టించండి ముహూర్తం

సా రావు: కాంతయ్యగారూ, దయచేసి మీరుకూడా రామారావుతో బాటు ఒకటో తారీక్కు మద్రాసు రాకూడదూ? అంతా ఫైనల్ చేద్దాం

కాంత బాబూ, మద్రాసు కాదు, లండన్ రమ్మన్నా వస్తా

సా రావు మాడావుడిగా వచ్చి వెళ్తున్నందుకు క్షమించాలి వస్తాం.

నాగే. మంచిదండి

కాంత: వెళ్ళిరండి, బాబూ (నాలుక జల్లోక) నాగేశ్వరం, నన్ను గటగా గిల్లూ!

నాగే కల కాదులే నేను సాక్ష్యం ఉన్నా

కాంత (ఏదో తన్నుకున్నట్టు) అన్నట్టు, నాగేశ్వరం, ఇల్లు..! వాళ్లు ఖాళీ చేశారు నా కిప్పించు.

నాగే: చంపావు! మాసవరా వశిగితే నాకక్కర్లేదని చెప్పా

కాంత (కుంగిపోతూ) చెప్పావూ? మళ్లీ నీచేతిమీదగానే పుణ్యం కట్టుకున్నావూ? హాతోస్మి, హాతోస్మి!..

[రేడియో ప్రసారితం] ★

విజ్ఞానవీధులు

"డాక్టర్"

చిట్టిప్రశ్నలకు జవాబులు

యస్. దశరథరెడ్డి—సూర్యాపేట.

—ఏ లోహపు విలువ అయినా, అది దొరికే సులువుని బట్టిన్నీ దాని ఉపయోగాన్ని బట్టిన్నీ వుంటుంది.

ప్లాటినము ఎక్కువగా దొరికే లోహము కాదు. అది కరిగే ఉష్ణోగ్రత చాలా హెచ్చు. సులువుగా (రాగిలాగా ఇనుములాగా) మకిలిపట్టదు. మరొక లోహముతో గాని, ధాతువుతో గాని ఒక పట్టాన కలవదు. కనక నిర్మలముగావున్న ఉప్పులనూ, రాసాయనిక సంయోగములనూ వెచ్చబెట్టడానికి ప్లాటినము దొన్నెలు వాడతారు. అందువల్లనే ప్లాటినము అంత ప్రియము.

—మంత్రాలన్నవి భాషలో ఉన్న మాటలతో ఏర్పడినవే - ఏవో కొన్ని హ్రాం, హ్రీం, అని విడ్డూరపు అక్షరాలతో ఏర్పడినవీ ఉన్నాయి. మాకు తాంత్రికుల మంత్రాలు ఏవీ తెలియవు.

నేటి వైద్యులు, రోగము కుదరడానికి, అది కుదురుగనే, నమ్మకము రోగికి ఉండాలంటారు. ఉంటే కుదరడము సులువంటారు కూడాను. మంత్రమును ఉచ్చాటన చేసేవారికీ, ఆ మంత్రము కోసము వచ్చేవారికీ గట్టి నమ్మకముంటే-మంత్రమువల్ల రోగాలు కుదరవచ్చును.

మంత్రానికీ దైవానికీ సంబంధమేమిటో మాకు తెలియదు.

—జ్యోతిషానికీ దైవానికీనా? సంబంధమా? ఏమీ లేదు. జ్యోతిషానికి కావలిసిన దల్లా గ్రహాల స్థానాలు. అవి తెలిస్తే ఆ శాస్త్రము భూ, చ, తప్పకుండా జరగబోయే ఫలితాలను చెప్పేస్తుందని జ్యోతిష్కుల నమ్మకము. మరి దైవము ప్రశంస ఎక్కడుంది?

త్యాగరాజస్వామి 'గ్రహబలమేమి? రామానుగ్రహబలమే బలము' అని ఒక కీర్తనలో అంటారు.

—ఉదయాస్తమయాల్లో సూర్యకిరణాలు నేలబారుగా వస్తూ, భూమిమీద, గాలిలో తేలుతూవుండే ధూళికణాలమీద పడి చెదిరిపోతాయి. అందువల్ల మనము ఆ సమయాల్లో సూర్యుణ్ణి చూడగలుగుతాము. ఎరుపురంగు మాత్రము తక్కిన రంగులు చెదిరిపోయినంత చెదరదు. అందువల్ల సూర్యబింబము ఎర్రగా కనబడుతుంది.

—గాలి సూర్యవేడిమిని గ్రహిస్తుందా అంటారా? సందేహమేలా? అయితే ఒక్క రహస్యము మాత్రము గుర్తుపెట్టుకోవాలి. గాజుపలక నొకదానిని ఎండలో పెట్టినట్లయితే, దానిద్వారా కిరణాలు చొచ్చుకుపోతాయన్న సంగతి మన మెరుగుదుము. చొచ్చుకుని పోయే కిరణాలు ఆ పలకని ఎంత వెచ్చబెట్టగలుగుతాయీ? ఇప్పుడా గాజుపలకకి దీపపు మసి పట్టించామనుకొండి. సూర్యుడి కిరణాలు ఇప్పుడు ఆ పలకలోనుంచి చొచ్చుకుపోవు. దీపపు మసి సూర్యకిరణాల్ని పీల్చేస్తుంది. మాషిస్తుంది అంటారు శాస్త్రజ్ఞులు. ఈ చూషణవల్ల గాజుపలక వేడెక్కుతుంది.

సూర్యకిరణాలు గాలిలోనుంచి చొచ్చుకు పోయేటప్పుడు గాలి ఆ కిరణాల్ని ఏ కొద్దో మాషిస్తుంది. గాలి అంతమట్టుకు వేడెక్కుతుంది. అయితే వేసంగి గాడ్పుల వేడి ఈ కారణంవల్ల కలిగినది కాదు. భూమియొక్క వేడిని అందుకున్న గాలి వేడి అది.

ఎ. బాలసుందరం—నగరి.

సముద్రము లోతుకి పోనుపోనూ పైన వున్న నీటి ఒత్తిడి ఎక్కువౌతుంది కదా! ఈ ఒత్తిడివల్ల నీరు ఏ కొంచెమో నొక్కబడుతుంది. అంటే సాంద్రతర మౌతుందన్న మాటే కామా.

సముద్రములో లోతుకి పోనుపోనూ ఒక వస్తువుమీద నీటి ఒత్తిడి ఎక్కువౌతుంది. సముద్రపు పై పొరలలో నివసించే చేపలు లోతులకు పోవు ఈ ఒత్తిడికి జడిసే. లోతులలో ఉండే చేపల రక్తనాళాలు ఆ ఒత్తిడికి సరిపడే ఉద్రేకాన్ని కలిగివుంటాయి. వాటిని నీటి పైకి తెస్తే ఆ రక్తనాళాలు చిట్లిపోతాయి కూడాను. ★



బ్రిటిష్ ప్రధాని పదవినుంచి విరమించిన సర్ విన్స్టన్ చర్చిల్.

రచయితలకు మనవి

మాకు కథలు, గేయాలు, చిత్రాలు, ఫొటోలు పంపేవారు ఈ క్రింది అంశాలను గమనించ ప్రార్థన.

ప్రచురించని వానిని తిప్పిపంపగోరే వారు బుక్‌పోస్టుకు అవసరమైన స్టాంపులను, రచనలూ, చిత్రాలూ, ఫొటోలతోనే చేర్చిపంపాలి.

బుక్ పోస్టుకు అణా స్టాంపుకు తక్కువ కాకుండా పంపాలి.

రచనలను కాయితానికి ఒకే వైపున సిరాతో వ్రాసిపంపాలి.

ఫొటోలు కనీసం కార్డు సైజులో వుండాలి. నెగటివ్‌లు స్వీకరించబడవు.

చిత్రాలు ఇండియన్ ఇంకుతో వేసిపంపాలి. రంగుల చిత్రాలు స్వీకరించబడవు.

ప్రచురణ విషయాన్ని వెంటనే తెలియచెయ్యడం కష్టం.


నిరాకరించబడిన రచనలను తిప్పి పంపడానికి మాకు కనీసం ఒక మాసమైనా వ్యవధి అవసరం. ఫొటోలు, చిత్రాల విషయంలో యింకా ఎక్కువ వ్యవధి కావలసివుంటుంది.

ప్రచురించే వానిని గురించి ప్రచురించే ముందు మాత్రమే తెలియపరచగలము.

మాకు పంపిన రచనలను, ఫొటోలను, చిత్రాలను గురించి మా కార్యాలయంనుంచి ఎట్టివిధమైన సమాచారమూ అందనిదే, వాటి ప్రతులను యితర పత్రికలకు పంపవద్దని ప్రార్థన.

రచయితలూ, చిత్రకారులూ, సహృదయంతో సహకరించగలరని విశ్వసిస్తున్నాము.

—సంపాదకుడు.



26

నాలుగురోజులతర్వాత వానాగాలీ విసురుగావున్న ఒకరోజు హైస్కూలు కమిటీ సమావేశమైంది. రంగయ్యగారు పనిచేస్తున్నదీ స్కూల్లోనే. కమిటీమెంబర్లు ఐదుగురు. అందులో మృత్యుంజయశాస్త్రిగారొకరు. ఆయేడు పెట్టవల్సిన పుస్తకాల్ని ఆమోదించటం, ఇతరత్రా కార్యక్రమాలూ కమిటీ నిర్ణయించవలసిన విషయాలు.

హైస్కూలుకి ఆవేళ శలవు. కమిటీసభ్యులు మధ్యాహ్నం మూడుగంటలకి స్కూలులో హెడ్‌మాస్టర్ గారి విశాలమైనగదిలో సమావేశమైనారు. గదిమధ్య టేబిల్ మీద పబ్లిషర్లు తమతమ పుస్తకాల్ని పెట్టమని వినయపూర్వకంగా పంపుకున్న ప్రార్థనలూ, పుస్తకాలూ డజన్లకొద్దీ పడివున్నాయి.

ఆగది మేడమీద వున్నది. స్కూలు కనక కిటికీలకి చువ్వలు లేవు. వానగాలి జోరున గదిలోకి ప్రవేశిస్తూంది. గది ఎడంవేపు కిటికీదగ్గిర రంగయ్యగారుకూడా ప్రత్యేకాహ్వానంమీదవొచ్చి ఓ కుర్చీమీద కూర్చున్నారు. హెడ్‌మాస్టర్ గారూ వున్నాడు.

శాస్త్రిగారికి కమిటీలో మంచి పలుకుబడి వున్నది. మిగతా నలుగురూ గౌరవసభ్యులూ, స్కూలుకి భారీగా విరాళాలిచ్చిన వారూ. అయినా వాళ్ళకి స్కూలువిషయాలలో శాస్త్రిగారి తోడ్పాటు లేందే ఏమీ తెలీదు. ఎంచేతనంటే, అందులో ఒకాయన రైస్ మిల్ ఓనర్. చదువుకున్నవాడుగాదు. రెండోఆయన కృష్ణాజిల్లాలో పలుకుబడి గల భూస్వామి. తనపేరు పేపరులో పడాలనే ఒక్క కొంత తప్ప అన్యథా ఆయనకి స్కూలుకీ, విద్యావిధానానికీ, స్నానప్రాప్తికూడా లేదు. నలుగురూ ఎటంటే అటే. మూడోఆయన ఈమధ్యనే సిరిసంపదలువొచ్చి పడ్డబాపతు. ఆయన కస్తమానం డబ్బుతప్ప మరోస్మరణలేదు. విద్యలాంటి అల్పవిషయాలు పట్టించుకోడు. నాలుగోఆయన ఎప్పుడో స్కూళ్ళ ఇన్స్పెక్టర్ పనిచేసి రిటైరైనాడు. ప్రస్తుత విద్యావిధానాన్నీ, ఈ కుర్రకుంకల్నీ, వీళ్ళ విద్యాప్రమాణాన్నీ మాస్తూంటే ఆయనకి మంట అని చెప్పుకుంటాడు. కాగా పోగా వివాదానికి సిద్ధపడి కమిటీ సమావేశాన్ని కొంతవరకూ నిద్రమేల్కొల్పేపని ఈయనదే.

ఇలాంటి కమిటీ ప్రముఖుల్ని సమావేశపరచటం హెడ్‌మాస్టర్ గార్కి ఎప్పుడూ బ్రహ్మప్రయత్నమౌతూవుంటుంది. ప్రస్తుత సమావేశాన్ని నెలనుంచీ 'కాల్ ఫర్' చేస్తూంటే ఈనాటికి కుదిరింది. అదైనా మృత్యుంజయశాస్త్రిగారు పనిగట్టుకుని తిరిగి నలుగుర్నీ చిన్నకార్లో కూచోబెట్టుకుని లాక్కొచ్చాడు.

రంగయ్యగారు కళ్ళజోడుకుండా ఇంకా ప్రారంభంకాని సమావేశం పెద్దలవైపూ, బైట కిటికీగుండా కన్పిస్తూన్న వర్షం వేపూ చూస్తున్నాడు. ఆయనకి వీళ్లెందుకు తన● పిలిపించారా అని సంశయం.

మూకున్నరకి శాస్త్రిగారే ప్రారంభించాడు. "ఇవ్వాళ మనం ఇక్కడ సమావేశమైనకారణం స్కూలుకి అతిముఖ్యమైన కొన్ని విషయాలలో నిర్ణయాలు చెయ్యాలని దానికి ప్రెసిడెంటుగారు అంటూ రైస్ మిల్ ఓనర్ జోగారావుగారివంక చూసి, అనుమతిస్తారని ఆశిస్తున్నాను" అన్నాడు.

జోగారావుగారు నవ్వుతూ బొర్రమీసాలు మెలేసి, "అలాగే. అలాగే." అనిమాత్రం అన్నాడు. ఆయన అనవల్సింది కూడా అంతే.

ప్రెసిడెంటు అనుమతిలభించటమే తరవాయిగా మృత్యుంజయశాస్త్రిగారు ప్రారంభించారు; "హెడ్మాస్టరుగారు ఈ సమావేశంలో చర్చించటానికి ముఖ్యంగా, రెండుసమస్యలు ప్రతిపాదించారు. ఒకటి, ఫిఫ్త్ ఫారంవరకూ పాఠ్యగ్రంథాల్ని వేటిని పెట్టటమూ అని. రెండు..." అని సంశయిస్తూ శాస్త్రిగారు సభ్యులవంకా, కిటికీదగ్గిర కూచునివున్న రంగయ్యగారివంకా, దూరంగా తన టేబిల్ దగ్గిరకూచుని, ఎల్లవేళలా నమ్రత ప్రదర్శిస్తూన్న హెడ్‌మాస్టర్ గారివంకా చూశాడు.

రిటైర్డు స్కూళ్ళ ఇన్స్పెక్టర్ శివరామయ్య పంతులుగారు, "ఆ రెండోసమస్య ఏమిటో... చెప్పండి. . సమావేశాన్ని చప్పున తేల్చాలి. అవతల మనకి వేరేపన్లుంటాయి" అన్నాడు నిర్మొగమాటంగా.

"వొస్తున్నానండి, వొస్తున్నాను. నాకావిషయం ఎత్తటానికి ఎంతికష్టంగావున్నా, హైస్కూలు అభివృద్ధినీ, పిల్లల క్షేమాన్నీ—విద్యసాయినీ దృష్టిలో పెట్టుకున్నప్పుడు చెప్పక తీరటంలేదు." అన్నాడు శాస్త్రిగారు;

రంగయ్యగారు ఉపోద్ఘాతం బలంగావుందే, అనుకున్నాడు. అయినా తనతో ఏంపని—వీరికి అనికూడా అనుకున్నాడాయన. స్కూలుచుట్టూవున్న విశాలమైన మైదానపుభూమి, వర్షపుధాతలతో తడుస్తూంది. ఒకమూల నిద్రగన్నేరుచెట్టు గాలికి వూగుతోంది. రంగయ్యగారి మసకచూపుకి ఈ ప్రకృతి కొత్తగాను మసిపూసిన అద్దంలోగుండా చూస్తున్నట్టూ వుంది. మబ్బులు అక్కడికి అక్కడికి దట్టంగా అలుముకుంటున్నాయి

మృత్యుంజయశాస్త్రిగారు ఉపోద్ఘాతం ముగించి, తన చేతిలోని రెండుపుస్తకంలో పేజీలు తిరగవేస్తూ, "రంగయ్యగారు ఈస్కూల్లో హైయర్ ఫారాలకి తెలుగుపండితులుగా నియమితులై పదిహేనేళ్లవుతోంది. వారిసేవ ప్రశంసనీయం! కాగా, వార్ని మనం ఎంతయినా అభినందించవల్సి వుంది. అయితే హెడ్మా



కాశ్మీరు దృశ్యం

ష్టర్ గారి రిపోర్టు ప్రకారం, రెండుమూడు నెలలుగా రంగయ్య గారు, తమపనిని సరిగ్గా నిర్వర్తించటంలేదని తెలుస్తోంది. అదిన్నీ గాక రంగయ్యగారికి వృద్ధాప్యం వొచ్చేసింది. కళ్లు సరిగ్గా కనిపించక అవస్థపడుతున్నారు. వారిక ఈ వుద్యోగం విరమించి, విశ్రాంతి తీసుకోటం మంచిదని నేను అభిప్రాయపడుతున్నాను. కమిటీవారు ముందు, ఈ సమస్యనే ఆలోచించగలరని మనవి చేస్తున్నాను" అంటూ సభ్యులవంక చూశాడు.

సభ్యులలో—ఒక్క స్కూల్ ఇన్స్పెక్టర్ గారికితప్ప మిగతా వారికీవిషయం విన్నా మనసుకు పట్టలేదు. ఒక ఉపాధ్యాయుని అర్థాంతరంగా సుడిగుండంలోకి నెట్టేవిషయాన్ని శాస్త్రిగారు తియ్యటిభాషలో ప్రవేశపెట్టారని అంతకుముందే తెలీలేదు. రంగయ్యగారు ఉలిక్కిపడి చూశాడు. ఆయన మనస్సు ఆలోచించసాగింది. 'ఇదేమిటి!...'

శాస్త్రిగారు గొంతు సవరించుకుని కూర్చున్నాడు. ఆయన పని అయిపోయింది. ఇక తేల్చవల్సింది కమిటీ.

ప్రెసిడెంటుగారు ఒకసారి నిస్సహాయంగా సభా సభ్యుల్ని కలయజూసి, హెడ్మాష్టర్ గారివైపుచూసి, "ఏమండి హెడ్మాష్టర్ గారూ, రంగయ్యగారి విషయమేమిటో ఇలావొచ్చి సభ్యులకి చెప్పండి" అన్నారు. కుర్చీలో కూర్చున్న హెడ్మాష్టర్ చప్పున లేచివచ్చాడు. ఆయనతో బాటే రంగయ్యగారూ లేచి నిలబడ్డాడు, తనస్థానంలో నే. ఆయననొసట ప్రశ్నలు ముళ్లుపడ్డాయి.

హెడ్మాష్టర్ గారేవో రంగయ్యగారిమీద రిపోర్టొకటి చదివి వినిపించాడు. దానిసారాంశం—రంగయ్యగారి అమూల్యమైనసేవ ఇకముందు స్కూలుకి అవసరంలేదని.

శివరామయ్యపంతులుగారు ఈ రిపోర్టును సమగ్రంగావిన్నట్టే కనపడ్డారు. ఆతర్వాత ఆయన రంగయ్యగార్ని ఉద్దేశించి, "ఏమండీ రంగయ్యగారూ, ఏమంటారు?" అని ప్రశ్నించాడు, నేరం మోపబడినఖైదీని జడ్జి ప్రశ్నించేఫక్కీలో.

రంగయ్యగారు ఎంతలేమితో బాధపడుతున్నా, ఆత్మాభిమానం కలవాడు. ఎవరికీ ఏపరిస్థితిలోనూ లొంగనితత్వం ఆయనది. అర్థించటం అనేది ఎరగడాయన. రంగయ్యగారు నాలుగు అడుగులువేసి సభికులు ఆసీనులైవున్న చోటికి వచ్చాడు. ఆయన మొహంలో యథాప్రకారం శాంతి దర్శనమౌతున్నది. కళ్ళు రెండూ మసకబారిపోయినా, తేజస్సుతో మెరుస్తున్నాయి. ఆయన కృతనిశ్చయుడై వున్నాడు. తను వీళ్ళకి సంజాయిషీ చెప్పుకోవాలా? దేనికి? తనకళ్లు మసకబారినమాట నిజమే. అంతమాత్రాన తనబోధనలో వొచ్చినమార్పేమీలేదే! హెడ్మాష్టరు చదివిన రిపోర్టులో సగం అబద్ధం; కొంతనిజం; కొంత నిజాన్ని ఆధారంచేసుకుని రాసినవర్ణన. అయితే...తనకి భుక్తిపోతున్న మాట నిజమే....ఐతే భాగవతం అచ్చయితే నా దరిద్రం నివారణ కావచ్చు...

ఆయన ఆలోచిస్తూవుండగానే శాస్త్రిగారు; "రంగయ్యగారికి మా నిర్ణయం కష్టం కలిగించేమాట నిజమే. కాని పరిస్థితులు అలావున్నాయి. ఏం చెయ్యగలము! స్కూలుక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని..." ఆయన వాక్యాన్ని పూర్తిచెయ్యకముందే,

రంగయ్యగారు పైపంచె దులిపి భుజాన వేసుకున్నాడు. ఆయన అర్థించవల్సిందేమీ లేదు. ఈ సమావేశంలోని మనుషులకి యాంత్రికమైన అభిప్రాయాలేవో తప్ప—హృదయంతో ఆలోచించే సహనం ఔదార్యం లేదు..."నేను చెప్పవలసిందేమీ లేదు. నా సేవ అవసరం లేదని మీకు తోస్తే, ఉద్యోగం నుండి విరమిస్తాను" అన్నాడాయన, ప్రెసిడెంటు వైపు చూసి. అంతే. చప్పున వెనక్కి మళ్ళి, హెడ్మాస్టర్ గారిని చూసి రెండు చేతులూ ఎత్తి ఒక నమస్కారం చేసి గదిలోనుండి నిదానంగా నడిచి బైటికి వెళ్ళిపోయాడు.

ఆయన బతిమాలుకుంటాడనీ, లేదా ఎదురుతిరిగి వాదిస్తాడనీ అనుకుని అందుకు తిరిగి తనెలా వాదించాలో ఇందాకటినించీ రిహార్సల్ వేసుకుంటూన్న మృత్యుంజయశాస్త్రిగారు ఈ దెబ్బతో నిరాశ పడిపోయాడు. ఆయనకి ఒకవంక మంటమండుతున్నది. ఏం చెయ్యగలడు? రంగయ్యగారి ప్రవర్తన ఆయనకి చెంపపెట్టు పెట్టినట్టయింది.

అయితే ఆయన పైకి మంట కనపడనీయకుండా, "రంగయ్యగారూ మన నిర్ణయానికి అనుకూలంగానే వున్నారు. పోనివ్వండి. హెడ్మాస్టర్ గారూ! వారికి జీతం ఏమైనా బాకీవున్నదా?" అన్నాడు

హెడ్మాస్టర్ గారు, "వందో, కొంచెం తక్కువో బాకీ వుంటాం" అన్నాడు

"అయితే అదంతో లెక్కచూసి వుంచండి. రంగయ్యగారొచ్చి పట్టుకెళ్తారు" అన్నాడు శాస్త్రిగారు. ఆతర్వాత కమిటీ పుస్తకాలనిర్ణయంలో పడిపోయింది.

27

శ్యామల వొకనాడు కాలేజీకి సెలవైనందువల్ల గాబోలు జయలక్ష్మిని చూడాలని రంగయ్యగారింటికి బయల్దేరింది దారిలోనే సదానందం కనబడ్డాడామెకి. గాంధినగరం నుంచి గవర్నర్ పేటకివొచ్చేరోడ్డుమీద ఇద్దరూ ఎదురుపడ్డారు సదానందం, తలొంచుకుని నడుస్తున్నవాడల్లా, శ్యామల పలకరించేసరికి తలెత్తి, "ఏమండి?" అన్నాడు ఆగిపోయి. అతనిచేతిలో మార్కెట్ సంచీ వుంది

"జయ కులాసాగావుందండి?" అని అడిగింది శ్యామల.

సదానందం మార్కెట్టుకు వెళ్లేతొందరలో వున్నాడేమో, "అత్తవారింటికి వెళ్ళిపోయిందండి" అన్నాడు ముక్తసరిగా—

"ఎప్పుడండీ? ... నాకు తెలీనే తెలీదే? ... అదిసరే, మీరు కాలేజీ మానేశారని విన్నాను నిజమేనా?"

ఇద్దరూ వెళ్ళాలనే తొందరలోనే వున్నారు. ఉదయపు ఎండ మార్దవంగా బంగారపురంగులో మెరుస్తోంది. వొంతెనకింద కాలవలో పడవలు నిదానంగా తేలుతున్నాయి.

సదానందం చూశాడు; ఈమెని ఇంటికి తీసుకెళ్ళితే అమ్మ అన్నీ చెబుతుంది...ఆతర్వాత మార్కెట్టుకెళ్ళొచ్చు

"అదంతా ఒక కథలెండి. మీ రొకసారి మాయింటికి రాకూడదూ?" అన్నాడు సదానందం గృహోన్ముఖుడై.

"వెళ్లాలనే బయల్దేరానండి..." అంటూ శ్యామల అతన్ని అనుసరించింది.

సదానందం మనస్సు ఎందుకో కొంచెం శాంతిపడ్డట్టు అనిపించింది శ్యామలను చూడగానే. అతనికి ఇల్లు—ఆసమస్యలూ జయ వెళ్ళినదగ్గరనించీ ఈ నెలరోజులుగా మరీ ఘోరంగా తయారైనాయి. అదేమీ అతను పరిష్కరించుకోగల స్థితిలో లేదు నాన్నకి ఉద్యోగం పోయింది. ముప్పైరూపాయల ఇంటద్దె భరించలేరు హైస్కూలువారు ఇచ్చిన వందరూపాయల చిల్లరతో ఇప్పటివరకూ జరిగింది. ఇకముందు, సంపాయించవల్సింది తనే అని నిర్ధారణయింది. చిత్రకళ ఉద్ధరించదని ఎన్నడో తెలిసిపోయింది.

మొన్నటిదాకా ఉద్యోగాన్వేషణలో విజయవాడ అంతా గాలించేశాడు. కాని ఎక్కడా ఖాళీలు లేవు. ఈ చదువుకన్న ఏమంగలిపనైనా వొచ్చివుంటే హాయిగా పరువుగా రోజుకి రెండు రూపాయలు సంపాయించుకోగలిగేవాడి ననిపించింది.

శ్యామల మౌనంగా తలొంచుకు నడుస్తున్న సదానందం వేపు చూసింది ఉదయకాంతిలో అతనినీరసగోహం, అందమైన మొహం, సదా ఆలోచనాతత్పరతలోవుండే ఆ ముఖవైఖరీ ఆమెకి జాలి గొల్పుతూంది. ఇతనికీ తనకీ ఏమిటీ పరిచయం అనుకుంటోందామె.

ఇద్దరూ అలాగే ఒక్కమాట మాట్లాడకుండా ఇంటికొచ్చారు. ఇల్లు వెనకటిలా సందడిగా లేదు. ఏదో 'పెద్దవెలితి' కనిపిస్తోంది. అది ఇంతట్లో పూడ్చుకలిగిందేమీ కాదన్నట్టేవుంది శ్యామల మనస్సుకి.

ఆమెని లోపలికి తీసుకెళ్లుతున్న సదానందానికి ఏదో దిగులు కలిగింది. తల్లి వరండాలోకూర్చొని బియ్యం ఏరుతోంది. రంగయ్యగారు పూజలగదిలో కూర్చునివున్నారు. శ్యామలవెళ్ళి వరలక్ష్మమ్మగార్ని పలకరించింది. వరలక్ష్మమ్మగారు "రా అమ్మా రా. ఇట్లా కూచో." అన్నది ఆమె ముఖంలో ఏదో పోగొట్టుకున్న నిరీహ కనపడుతోంది.

శ్యామల, "ఏమండీ, మరి నాతో ఒక్కముక్క చెప్పకుండానే జయ అత్తవారింటికి వెళ్ళిపోయిందే!" అన్నది.

"ఏంచేస్తామమ్మా! దేనికీ వ్యవధిలేనంత తొందరపెట్టారు వాళ్లు." అంది వరలక్ష్మమ్మగారు నిట్టూర్చి.

ఇప్పుడా ఇంటిలో వెనకటిలా ఏదీ హుషారుగా జరగటం లేదు అన్నీ మందకొడిగా వున్నాయి. ఈపాటికి వంట ఐపోయేది ఇదివరలో. ఇప్పుడు ఇంతవరకూ పొయ్యేనా వెలిగించలేదు. రంగయ్యగారు స్కూలుకి వెళ్ళటంలేదు, సదానందం కాలేజీకి వెళ్ళటంలేదు. జయ లేకపోవటం. ఈ పరిస్థితి శ్యామలకి విసుగు పుట్టిస్తోంది. ఆమె ఆశించిన ఉత్సాహమేమీ లేకపోయేప్పటికి ఆమె మెల్లిగా లేచింది, "వెళ్ళొస్తానండి" అంటూ. వరలక్ష్మమ్మగారేదో పరధ్యానంలోవుంది గాబోలు, "సరేనమ్మా" అని మాత్రం అన్నది.

వరండాలోనుండి శ్యామల సదానందంకోసం అతని గదిలోకి వెళ్ళిచూసింది. సదానందం రెడీగా వున్నాడు. ఇద్దరూ బయల్దేరారు.

గడప దిగింతర్వాత శ్యామల, "ఏమిటోనండి, నాకేమంత ఉత్సాహంగా లేదు" అన్నది.

"నిజమేనండి. నాకూ అలాగే అనిపిస్తోందండి. ఈ ఇల్లు మార్చేస్తే, కొన్ని జ్ఞాపకాలు రాకుండావుంటాయి అనుకుంటున్నాను తిరిగి సత్యనారాయణపురంలో కాపరం పెట్టాలనుకుంటున్నాం" అన్నాడు, సదానందం

"అట్లాగా? నాన్నగారికి స్కూలు దూరమౌతుందేమో?"

"దూరమైపోయిందిగా!" అంటూ తేలిగ్గానూ వ్యంగ్యంగానూ నవ్వాడు సదానందం, తాశీల్దారుగారమ్మాయి ఎర్రటి శరీరచ్ఛాయను కొంత ఆసక్తితో చూస్తూ.

"ఏమిటీ. ఏమంటున్నారు!" అన్నదామె ఆశ్చర్యంగా.

"ఎందుకండీ ఆశ్చర్యం? నిజమే నాన్నకి కళ్లమసకలు ఎక్కువైనాయి అందుకని" ఆపైన ఏమీ చెప్పనవసరం లేకుండానే శ్యామలకి అర్థమైంది.

ఆమెకు జాలీ, సానుభూతి కలిగాయి. "అదా మీరు కాలేజీ కూనేసిన కారణం?." అని ప్రశ్నించింది.

"అవునండి" అంటూ సదానందం, "నేను ఇటు మార్కెట్టుకి వెళ్తాను..." అన్నాడు. శ్యామల, "సరేలెండి.. నేను వెళ్తాను"... అంది.

సదానందం ఆమెని చాలాదూరం వెళ్ళేవరకూ చూస్తూ సెంటర్‌లోనే నిలబడిపోయినాడు తర్వాత అతను మెల్లిగా ఏలూరురోడ్డు మీద తూర్పు వేపుగా నడవసాగాడు, మార్కెట్ సంగతి జ్ఞాపకం వొచ్చి

అతనొక పదడుగులు వేసివుంటాడో లేదో, వెనకనించి, "సదానందం" అని పిలుపు వినిపించింది. సదానందం వెనక్కి చూశాడు. డాక్టర్ వీరభద్రరావుగారు హోటల్ వాకిలిముందు నిలబడి పిలుస్తున్నాడు. డా॥ వీరభద్రరావుగారు ట్రౌజర్ లోపలికి చొక్కాదోపి, మెళ్లో స్టెతస్కోప్ తగిలించుకుని నుల్చునివున్నాడు చిరునవ్వు నవ్వుతూ. సదానందం ఆయన్ని సమీపించి, నమస్కరించి, "చాలా రోజులైందండి మనం కలుసుకుని — కాదండి?" అన్నాడు.

వీరభద్రరావుగారు "అవునోయ్, అన్నట్టు నెల పై చిలుకు నించీ నువ్వు కనపడ్డమే లేదు? ఏం కారణం? అని ప్రశ్నించాడు.

సదానందం "మా చెల్లెల్ని అత్తవారింటికి పంపించామండి ఈ మధ్య—ఆ తర్వాత—మా నాన్నకి ఉద్యోగం పోయింది—అన్నీ ఏమిటోనండి తారుమారయాయి—అక్కణ్ణించీ నేను ఉద్యోగాన్వేషణలో దిగాను. తీరికకాక రావటంలేదు" అన్నాడు.

గవర్నర్ పేట సెంటర్ సందడిగా వుంది వొచ్చేబండ్లూ పోయేబండ్లూ నాగరికయువకులూ, అందమైన ఆడవాళ్ళూ, రంగు రంగుల దుస్తులపిల్లలూ, ఆ రోడ్డు మనోహరంగా వుందా వానా కాలపు ఉదయపు ఎండలో. డాక్టర్ గారి గోధుమవన్నె ఖద్దరు షర్టు మెరుస్తోంది. ఆయన తీక్షణంగా చూశాడు సదానందంకేసి.

"అలాగా, పాపం! రెండొందలతోనే సరిగ్గా గడవని మీ కుటుంబం ఇప్పుడు ఎలా వెళ్లదీసుకుంటోందోయ్?" అని ప్రశ్నించా డాయన.

"ఓ వందరూపాయలిచ్చారు స్కూలు కమిటీవారు. దాంతో ఈ నెలా ఎట్లాగో నెట్టాం. రే పెలాగనేది నాకో బ్రహ్మాండమైన సమస్యగా పరిణమించింది. నాన్న చూద్దామా, భాగవతం రాయటానికి వీల్లేకపోయిందే అనే దిగులుతో, పూజగదినుండి బైటికే రావటం లేదు . అమ్మ రోజురోజుకీ చిక్కి శల్యమైపోతోంది . " అన్నాడు సదానందం దిగులుగా

"అయితే ఏంచెయ్యాలని నీవూహ?" అని అడిగాడు డాక్టర్.

"అదేనండి తోచకుండా వుంది. ఎక్కడా ఏ పనీ దొరక లేదు.. "

డాక్టర్ రెండుమూడు నిమిషాలు ఏమీ మాట్లాడలేదు. "ఇవ్వేక్కడికి బయల్దేరావు? మార్కెట్టుకా? నాకూ అటు పని వుందిలే పద. నేనొక సలహా చెబుతాను. ప్రస్తుతానికి నీకు కొంత ఉపయోగిస్తుంది..." అన్నాడు, నడుస్తూ.

సదానందం ఆయన పక్కనే నడుస్తూ, రెండుపక్కలా వరసగా వున్న మేడల్ని, సినిమాహాలుస్నూ, కంపెనీల బోర్డుల్ని చూస్తూ, "ఏదో మీరే చెప్పాలి. మీరు మాటఅంటే నేను వినకుండా వుంటానా?" అన్నాడు.

డాక్టర్ ఆలోచిస్తూనే, "నాకు ఒక కంపౌండర్ అవసరమోయ్. నాదేమంత పెద్ద ప్రాక్టీసు కాదనుకో. నేను మెంటల్ స్పెషలిస్టును కదూ?.. అయినా, కొంతవరకూ చిల్లరరోగాలకి కూడా మందులిచ్చేట్టయితే ప్రాక్టీసు పెరగొచ్చు.. ఏమంటావు? ఆ కాంపౌండింగ్ వుద్యోగం కావలిస్తే నీకిస్తాను. మనిద్దరం కలిసి వుంటే అటు చిత్రకళనూ అభ్యసించవచ్చు...నీకు ఒక వుద్యోగం దొరికినట్టు వుంటుంది" అన్నాడు.

సదానందం తలవూపాడు. అతని కళ్ళల్లో ఎంతో ఆశ ఉట్టి పడుతోంది

డాక్టర్ గారి సిగరెట్టు ఆఖరు దమ్ము పీల్చి ఎంగిలిపీక విసిరివేస్తూ, "నువ్వు నాదగ్గిర పెద్దగా ఏదో దొరుకుతుం దనుకోటానికి వీలుండదోయ్. ముందే చెబుతున్నాను. ఏదో నెలకో నలభై ఇస్తాను.. " అన్నాడు

సదానందం, వేరే ఎటుమూసినా అదీ దొరకటం లేదుగదండి! ఇంతకే సంతృప్తిపడదాం.. అదృగా మీ రిచ్చే ప్రతిఫలంకోసం గాదు నేను మీ దగ్గిరకి రావటం, ఏవో బొమ్మలు గీసుకోవచ్చు, మీ దగ్గిర తెలియనివి అడిగి తెలుసుకోవచ్చనీ —" అన్నాడు.

"అయితే. ఇంకో ఛాన్సుకూడా వుంది దాని విషయం గ్యారంటీగా చెప్పలేను ఇప్పుడు .నా హాస్పిటల్‌కి పదిళ్ళ తర్వాత ఒక పత్రిక ఆఫీసుంది వాళ్లీ మధ్య నాదగ్గిరకొచ్చి వారం వారం కొన్ని బొమ్మలూ హెడ్డింగులూ కార్టూనులూ వ్రాసిపెట్టమని అడిగారు నేను ముందే చెప్పాను, నాకు ఈ చిత్రాలు గియ్యటం ఓ హాబీ అనీ? అంచేత నే నొప్పుకోలేదు ..ఆపని ఇంకా ఖాళీవుంటే నువ్వు వొప్పుకోవచ్చు ఏదో వాళ్ళు కొద్దిగా ప్రతిఫలం ఇస్తారు. నీకూ ప్రాక్టీసవుతుంది కమర్షియల్ ఆర్ట్ అంటే ఏమిటో తెలుస్తుంది." అన్నాడు డాక్టరుగారు

సదానందం కళ్లు ఆశతో మెరిశాయి "రక్షించారండి! అలాంటి పనే కుదిరితే ఇంకేమండి! ఎగిరి గంతేసి వొప్పుకుంటాను! మీ హాస్పిటల్ సత్యనారాయణ పురంలోనే గాదూ?" అన్నాడు.

"అవును. స్టేషన్‌కి దగ్గిరే. బోర్డు అది కనపడుతూనే వుంటుంది రేపట్నించీ నువ్వు నా హాస్పిటల్‌లో పనికొస్తావా?"

సదానందం, "నిరభ్యంతరంగానూ! నేనూ, సత్యనారాయణ పురానికి కాపరం మార్చేస్తున్నామండి మనకింకా దగ్గిర అప్పుడు!" అన్నాడు సంతోషంగా

డాక్టర్, "మరీ మంచిది! పద, మార్కెట్టుకు గాబోలు! తొరగా వెళ్దాం" అంటూ చకచక నడవసాగాడు. సదానందం ఆయన ననుసరించాడు. అతని మెదడులో, తన సంపాదన, ఆ పత్రికలో పనీ, కాంపౌండర్ వుద్యోగం, ఆలోచనలమధ్య తన

అపస్వరాలు

చాలెలి దీనమైన ముఖమూ మెరిశాయి. చాల్లెలి సుఖంకోసం తనైనా ఆ బాకీ తీర్చాలి! నిన్ననే శేషాద్రిరావుగారు రాసిన ఘాటైన ఉత్తరం వొచ్చింది...సదానందం ఆలోచిస్తూ మార్కెట్టువైపు సాగిపోయినాడు.

28

శేషాద్రిరావుగారు తెనాలిలో తన ఆఫీసుగదిలో సుఖాసీనుడై, గుమాస్తాతో మాట్లాడుతున్నాడు. ఉదయం తొమ్మిదిగంటలవుతోంది. ఎండ మృదువుగా సుఖంగా కిటికీలలోనుంచి లోపలికి పడుతూవుంది. మేడచుట్టూవున్న ఖాళీలో పచ్చగడ్డిమీద రాత్రి కురిసిన వాన-చినుకులు నిలిచి, ముత్యాల్లా మెరుస్తున్నాయి. దొడ్లో బాదంచెట్టుకింద బావి గట్టుదగ్గిర జయలక్ష్మి బట్టలు వుతుకుతోంది. నిజానికి ఆ యింట్లో ఆమె గుడ్డలుతకవల్సిన అవసరంలేదు. కాని జానకమ్మగారు అలా భావించడంలేదు. కోడలివల్ల రాబట్టదగినంతా రాబట్టాలని ఆవిడ ఆశయం; ఈ తతంగమంతా రమణమ్మ చూస్తూ వూరుకుంది; ఆమె ఎలాంటి మార్పూ చెయ్యలేనప్పుడు, ఊరికే మాట్లాడి చెడ్డదైపోవడం ఎందుకని ఆలోచించుకుంది. ఇక త్రయంబకరావూ అంటే, అతను వెనకటిలాగానే తటస్థంగా వుండిపోయినాడు; భార్య అతన్ని చూస్తేనే దెయ్యాన్ని చూసినట్టు వొణుకుతుంది. ఇక మాట్లాడే అవకాశం ఎక్కడ?

రమణమ్మే అతనితో మాట్లాడి అతనికి ఆశ కలిగిస్తూవుంది. ఆ భయం త్వరలో పోతుందనీ, అందాకా వేచివుండమనీ చెబుతూవుంది. జయ పొద్దస్తమానం ఏదో పని చేస్తూవుంటుంది. పని కామెకంపుతుందని కాదు; అలవికాని పన్లు చెయ్యలేక బాధపడుతోంది అంతకు రెట్టింపు మానసిక వ్యథ అనుభవిస్తోంది.

పుట్టింట్లో ఆమె సుఖంగా పెరిగింది. డబ్బువల్ల లభింపగల సుఖాలు లేకపోయినా, తల్లి గారాబంలో తండ్రి వాత్సల్యంతో పెరిగిందామె. ఇక్కడ ఈయింట్లో వాత్సల్యం ప్రేమలనేవి వొట్టి ఎండమావులు. జయలక్ష్మి ఎటువంటి చాకిరికేనా సహించివుండగలదు. మాట పడాలంటేనూ, ఎత్తిపొడుపులు సహించాలంటేనూ ఆమెకి వొళ్ళంతా మంటలు మండుతాయి. రంగయ్యగారి కూతురు మరి!

ఇది బాగా కనిపెట్టారు ప్లీడరుగారూ, ఆయన సతీమణీ ప్రారంభించారు ఆగ్నేయాస్త్రప్రయోగం. జానకమ్మగారు భోజనాలదగ్గిర ఒకనాడు కోడలికి వడ్డిస్తూ, "ఇదిగో పిల్లా, అదేం కూరో తెలుసా" అంది. జయకి తెలుసు; కాని ఏమీ మాట్లాడలేదు. ఊరికే తలెత్తి చూసింది అత్తగారివంక. ప్లీడరుగారు వంటింటి బయటే నుల్చునివున్నాడు తమలపాకులు నములుతూ.

జానకమ్మగారు కోడలి మౌనాన్ని ఆధారం చేసుకుని, "నీకెట్లా తెలుస్తుందిలే! ఏనాడైనా తింటేనా? ఎంతసేపటికీ—పచ్చడి మెతుకులేనాయె. అది బంగాళదుంపకూర!" అన్నది.

జయలక్ష్మికి ఎంతో కష్టమేసింది; తన లేమినిగదా అత్తగారు ఎత్తిపొడుస్తున్నారు అని. కాని ఏమీ అనలేదు. కాని అన్నం దిగదు అలాగా చాలాసేపు కూర్చొనేవుండిపోయిందామె. అత్తగారు ఆమెవంక చూడనైనా చూడకుండా బైటికి వెళ్ళిపోయింది. తర్వాత రమణమ్మ ఆమెని సముదాయించి అన్నం తినిపించింది.

ఇంకోనాడు జయ ప్లీడరుగారికి కాఫీ తీసుకెళ్లి ఇచ్చింది. ప్లీడరుగారు కాఫీగ్లాసు అందుకుంటూనే, "చూశావు, ఇది వెండిగ్లాసూ! కాస్త జాగ్రత్తగా వాడుతూవుండూ? మా యింట్లో అన్నీ వెండిగ్లాసులేలే" అన్నాడు, చాలా సహజంగా; అదివరకు వెండిగ్లాసు ఎరగని వాళ్ళకి చెపుతున్నట్టున్నదా యనస్వరం. ఇలాంటి మాటలతో జయలక్ష్మికి దహించుకుపోతున్నది ఒళ్లు.

జయలక్ష్మికి గుడ్డలుతుకుతూవుంటే ఇలాంటివన్నీ జ్ఞాపకం వొస్తున్నాయి. బావిదగ్గిర రెడ్డి నీళ్లు తోడుతున్నాడు. ఆ కుర్రాడికీ, జయకీ ఆ యింట్లో అంతస్తులో కొద్దిపాటి భేదమే గాని, ఇతరత్రా ఇద్దరూ వొకటే.

ఇంతలో ఎక్కణ్ణించో జానకమ్మగారొచ్చింది దొడ్లోకి. "బాగ్లేవె గుడ్డలుతకడం! మధ్యాన్నానికి గాని తెమిలేట్టులేదే!..." అంటూ రెడ్డివంక చూసి, "నువ్వు నీళ్లు తోడి ఇస్తున్నావురా? అది తోడుకోలేదూ? బాగానే వుంది! రేపణ్ణించి, మడినీళ్లు గూడా నీచేతనే తోడించేట్టుంది వరసచూస్తే" అన్నది మండిపడుతూ. జయలక్ష్మికి ఈ మాటలతో ఆవేశం వొచ్చినట్టయింది. ఆమెకి కళ్లు తిరగసాగాయి.

రెడ్డి మారుమాట్లాడకుండా పరిగెత్తాడు వాకిట్లోకి.

బైట ఆఫీసుగదిలో శేషాద్రిరావుగారు సీతాపతితో అంటున్నారు "విన్నావా? మా వియ్యంకుడికి ఉద్యోగం పోయిందిట. ఇందాక వొచ్చాడే శాస్త్రి, ఆయన చెప్పాడు. సంపాదిస్తున్నప్పుడే మన డబ్బు ఇవ్వలేనివాడు, ఇప్పుడింకేమిస్తాడు?" అంటున్నాడు.

ఇంతలో దొడ్లోనుంచి గోల వినపడ్డది. శేషాద్రిరావుగారు "అదేమిటో చూడరా రెడ్డి" అన్నాడు. రెడ్డి దొడ్లోకి పరిగెత్తికెళ్ళి చూశాడు.

జయ బావిగట్టుమీద ఫిట్ వచ్చి పడిపోయింది. జానకమ్మగారికి కాళ్లాడక, నోరు పెగలక అరుస్తున్నది. జయ తలకి గాయం తగిలిందేమో, రక్తపు చార నిగనిగలాడుతూంది బావి గట్టుమీద.

రెడ్డి వెళ్లి చెప్పాడు ప్లీడరుగారికి. లోపలికి పోయి రమణమ్మకీ చెప్పాడు; ఈ గోలకి మేడమీద కూచుని ఏదో చదువుకుంటున్న త్రయంబకరావూ కిందికి వొచ్చాడు. దొడ్డోనుంచి రమణమ్మే జయని లోపలికి తీసుకొచ్చి మంచంమీద పడేసింది.

"డాక్టర్ని పిలుచుకు వస్తా—" అన్నాడు కొడుకు తల్లితో.

"పోయిరా. తప్పేదేముంది? ఎంత రుణం వుంటే అంతా తీర్చువద్దూ" అంది జానకమ్మ.

త్రయంబకరావు అక్కడవంక ఒకసారి చూసి బయటికి వెళ్లిపోయినాడు. రమణమ్మ జయ మొహంమీద కాసిని నీళ్లు చిలకరించింది. "అమ్మా, ఏదో కళ్లు తిరిగి పడిపోయిందే అమ్మా! కాసిని పాలు పట్టుకురావే. గొంతులో పోస్తాను" అంది.

తల్లి, "నువ్వే పోయి తీసుకురా. దీని చాకిరీ కూడా నేనెక్కడ చేసేది!" అంటూ ఇంకో మంచంమీద కూలబడింది.

ప్లీడరుగారు, "బతికి వుంటేమో, చూడవే అమ్మాయి" అంటూ ఆఫీసుగదికి వెళ్ళిపోయినాడు. రమణమ్మ మనస్సు చాలా బాధపడింది. తమ్ముడూ మరదలూ వేరైతే తప్ప, ఈ పిల్లకి ఈ బాధలు తప్పవని ఆమెకి ఎన్నడో స్పష్టమైంది. అది ఎలాగైనా సాధించాలనే పట్టుదల ఆమె కెక్కువైంది, ఆ రోజునించి.

(ఇంకా వుంది)

చర్విత చర్వణం

చంటిపిల్ల గీపెడుతున్నది. పిల్లలు అన్నమే అమ్మా అని గోల పెడుతున్నారు. చీకటి పడుతున్నది. ఆయన ఇంటికివచ్చే వేళవుతున్నది. ఇల్లంతా అగోరంగా వున్నది. ఎట్లాగయినా ఆయన వచ్చేటప్పటికి ఇల్లు చక్కబెట్టుకోందామని సత్యవతి ప్రతిరోజూ ప్రయత్నిస్తుంది. కాని, ప్రతిరోజూ రామారావు ఇంటికి వచ్చేటప్పటికి ఇట్లాగేవుంటుంది.

వస్తూనే ఆఫీసు గుడ్డలువిప్పి లుంగి కట్టుకొని కాళ్లూచేతులూ కడుక్కొని చంటిపిల్లను చేతుల్లోకి తీసుకుంటాడు. అగివరకల్లా యేమిచేసినా వూరుకోని ఆరునెలల పసిగుడ్డు ఏడుపంతా మరచిపోతుంది ఊం అంటుంది నవ్వుముఖం పెట్టి.

పసిదాన్ని నెమ్మదిగా చాపమీద పడుకోపెట్టి పిల్లలకు అన్నంపెడతాడు రామారావు. "నేను వస్తున్నా కొంచెంసేపు, అట్లా కుర్చీ వేసుక్కూచోండి" అంటుంది తను.

మాటయితే అంటుంది. కాని పని తీరికకావద్దూ? పొద్దున అనంగా నాలుగు మెతుకులు కసిరి ఆఫీసుకువెళ్లిన రామారావు ఎంత అలసిపోయి వుంటాడూ? ఎంత తొందరగా చేద్దామని ప్రయత్నించినా వంట తెమలదు. అవతల పొయిమీద ఏదో ఒకటి ఉడుకుతూవుంటుంది. పొయిమీద గిన్నె పొయ్యిమీదనే వదిలిపెట్టివచ్చి పిల్లలకు అన్నంపెటడం ఎట్లా? ఆ పిల్లలు అన్నానికి కొంచెంసేపు ఆగరాదూ? ఆగతారు రోజూ ఆగుటూనేవుంటారు కాని, ఎంతిసేపని ఆగుతారూ? ఆకలవుతూంటే కొంచెంసేపు ఆగమని పిల్లలకు చెప్పడం సులభమా? తాను చెప్పలేదు. వంట కావాలి వంట ఆలస్యమయితే భర్తకు ఆకలి ఎక్కువయి కోపంవస్తుందేమోననే భయంవల్ల తాను వంటయిల్లు వదలిరాలేదు రామారావు ఇంటికివచ్చి పసిదాన్ని ఆడించి, పిల్లలకు అన్నంపెడతాడు పిల్లలకు అన్నం పెడుతూనే ఇల్లంతా సర్దుతాడు.

ఆయనకు ఇంత ఓపిక ఎట్లావస్తుందో? తెల్లవారుఝామునే లేస్తాడు. గంట గంటన్నరసేపు ఆఫీసుపని చూచుకొని కుంపటి అంటిస్తాడు కాఫీకి నీళ్లు పెడతాడు. ఈలోగా తనకు మెలకువవచ్చి లేస్తే సరే సరి లేకపోతే కాఫీకూడా కాస్తాడు.

సత్యవతి ఆలోచిస్తున్నది. ఆలోచిస్తూ పిల్లలగోడవ వినిపించుకోకుండా వంటయింట్లో సతమతమవుతున్నది.

అంతలో రామారావు రానేవచ్చాడు. వస్తూనే పసిదాన్ని చేతుల్లోకి తీసుకున్నాడు. పందెంవేసినట్లు అది ఏడుపు మానింది. అదివరకల్లా "అన్నమే అమ్మా" అని అరిచే అయిదేండ్ల బాబు "నాన్న వచ్చాడు" అంటూరామారావు దగ్గర చేరాడు. "చెల్లాయి నా పుస్తకం చింపిందమ్మా" అని అదివరకల్లా విసిగించిన పెద్దపిల్ల "నాన్న వచ్చాడు" అంటూ వంటయింట్లోకి వెళ్లి చెంబుతో నీళ్లుతెచ్చి "కాళ్లు కడుక్కో నాన్నా మంచి నీళ్లు తెస్తా" అన్నది. ముందు ఒక చాపతీసుకురా తల్లీ అన్నాడు రామారావు. పెద్దపిల్ల చాపతెచ్చింది. ఒక గుడ్డకూడా తెచ్చి చాప వేసి దానిమీద పక్క వేసింది. రామారావు నెమ్మదిగా పసిదాన్ని చాపమీద పడుకోపెట్టాడు "ఏయ్‌పాపా" అంటూ బాబు దానిదగ్గర కూర్చున్నాడు. అది ఏడుపుమానింది.

ఏ. యస్. అవధాని

రామారావు తరువాత పనికి ఉపక్రమించాడు. ఇదే దినచర్య. నిత్యజీవితంలో మామూలు సన్నివేశాలివి ఇప్పుడు. ప్రస్తుతం ఇట్లాగే జరిగిపోతున్నది. రామారావు చేసినా తానుచేసినా ఒకటే! పిల్లలందరినీ సర్దాలి. ఇంట్లోపని ఆడది చేస్తున్నదా లేక మగవాడు చేస్తున్నాడా అన్న సమస్య ఇప్పుడు ఇక్కడ రాకపోవచ్చు. కాని ఎల్లకాలం ఇట్లా జరిగిపోతుందా? జరిగిపోయే అవకాశం వున్నదా?

ఎక్కడైనా పనివుండి రామారావు ఆలస్యంగా వస్తాడు ఆనాడు ఇల్లంతా తన కొక నరకమవుతుంది.

ఆఫీసులో పని తెమలక రామారావు ఆలస్యంగా వస్తాడు. నానా యాతనలూపడి పిలలనుతిను, సర్దిగలుగుతుంది. వాళ్లే ధర్మాన వాళ్లు ఏదో ఒక విధంగా పడి నిద్రపోతారు.

*　　*　　*

సత్యవతి రోజూ చాలాసేపు ఈ విషయంగురించి ఆలోచిస్తుంది. భర్త ఇంట్లో ఉన్నంతిసేపూ ఆలోచించనివ్వడు ఏదో ఒకపని వుంటుంది తను ఒకవేళ ఏదయినా మరచిపోతే భర్తయే ఆ పని తన కళ్లఎగుట చేస్తూవుంటే సహించడం ఎట్లా? సహించక చేసే దేమిటి?

పోనీ పనిమనిషిని పెట్టుకుంటే... పనిమనిషి ఏమిచేస్తుంది? నీళ్లుతెస్తుంది. అంట్లు తోముతుంది ఇల్లువూడుస్తుంది. ఆ మాటకు వస్తే అడిగినంత డబ్బు ఇవ్వగలిగితే యీ రోజులలో పనిమనిషి చెయ్యనిపని అంటూ వున్నదా యేమిటి? అన్నీ చేస్తుంది పనిమనిషి. కాని, డబ్బో?

నెలజీతం సరిగ్గా పదిరోజులకు చాలడం లేదు. పొలంమీద వచ్చే అయిగువందలూ నాలుగు నెలల్లో అయిపోతవి. ఇంకానయం.

రామారావు పద్యాలురాసీ, ఉపన్యాసాలుచేసీ నెలకు ఏ పాతికో పరకో తెస్తాడు. వేడినీళ్లకు చన్నీళ్లు తోడుగా సంసారం సాగిపోతున్నది, నలుగురుపిల్లల్లో ఎవరికో ఒకరికి మందులు నెలనెలా డాక్టరుకు డబ్బు చెల్లించాలి. నెలకు నలభైరూపాయల అద్దె కట్టాలి. పిల్ల పాలకు నెలకు పదిరూపాయలవుతున్నది కాఫీపాలకు పదిరూపాయిలవుతుంది. బియ్యం, ఉప్పు, మిరపకాయలు

★ చర్విత చర్వణం ★

అబ్బబ్బ ఎన్ని కొనాలి? అన్నీ కొనవలసినవే గదా? తెల్లవారిలేస్తే రూపాయ కాగితం మారిస్తే మధ్యాహ్నంవరకూ కూడా వుండడం లేదు. ఇటువంటి పరిస్థితులలో పనిమనిషిని పెట్టడం ఎట్లా సాధ్యమవుతుంది? పనిమనిషిని పెడితేమాత్రం తన సమస్యలు పరిష్కారమవుతవా? సత్యవతి ఆలోచిస్తుంది. ఆలోచించగా ఆలోచించగా ప్రతిరోజూ కొంతదూరం పోగా, పోగా ఎక్కడో ఒక చోట ఆలోచనలు ఆగిపోతవి.

*   *   *

రామారావు టైప్ మెషిన్ ముందర కూర్చుని ఆలోచిస్తున్నాడు. ఆఫీసరు వూళ్లో లేడు. కనుక టైపుయంత్రానికీ తనకూ తేడా కనిపిస్తున్నది. తను ఒత్తితే కీ బోర్డు టకటకా మంటుంది. తన వేళ్ళు దయాభిక్షాల మీద కీబోర్డు గమనం ఆధారపడి వుంటుంది. ఆఫీసరు దయాదాక్షిణ్యాలమీద తన వేళ్లగమనం ఆధారపడి వుంటుంది. ఇవాళ్ళ ఆఫీసరు వూళ్లోలేడు. కాంపుకు వెళ్ళాడు. ప్రొద్దుటి టపాలో ఆయనవద్దనుంచి వచ్చిన అర్జెంటు కాగితాలన్నీ టకటకా టైప్ చేశాడు తాను. మూడుగంటకల్లా పని అయిపోయింది. అకౌంటెంట్ సుబ్బారావు నవ్వుతూవచ్చాడు రామారావు దగ్గరికి.

"ఏం రామూ....విశేషాలేమిటి?"

రామారావు ఆలోచనలకు అంతరాయం ఏర్పడ్డది.

"నిశ్నేరా బ్రదర్. ఏమిటివిశేషాలూ?" అన్నాడు సుబ్బారావు మళ్ళీ.

"ఊ...విశేషాలేమిటి?" అన్నాడు రామారావు మత్తుగా.

"ఏం...పని తక్కువయి నట్లున్నది, బాస్ లేడుగా. పరధ్యాన్నంగా వున్నట్లున్నావ్" అన్నాడు సుబ్బారావు.

"సరేగాని...విశేషాలేమిటి?"

"విశేషాలేమి ఏడ్చినయ్. పెద్దపిల్ల నాలుగురోజాలనుంచీ లేవడంలేదు. డాక్టరు పది రూపాయలమందులు రాసిచ్చాడు. నెలాఖరుకదా? నువ్వేమన్నా...."

"సరే...బాగా అడిగావు నెలాఖరు దాక వన్నా నీ దగ్గర ఏమన్నా ఉంటూవచ్చిందేమో? నా దగ్గర మొదటివారంనుంచీ ఖాళీ. ఇంట్లో అన్నంతినడం, అయ్యర్ హోటల్లో కాఫీతాగడం, నాయర్ కొట్లో సిగరెట్లూ, వక్కపొడీ...ఇదే మనసంగతి. క్షమించాలి. పదిరూపాయలు కాదుగదా పది దమ్మిడీలు కూడా లేవు. భాయీ."

"నువ్వూ అట్లాగేఅన్నావూ! పొద్దుటి నుంచీ కనీసం పదిమందినైనా అడిగాను. లాభంలేకపోయింది. మళ్ళీ ఫస్టున సర్దుతాను. ఎక్కడైనా చూచిపెడుదూ పుణ్యం వుంటుంది."

"ఉంటే ఇంత యిదిగా అడగాలా? ఇదివరకు ఎప్పుడైనా లేదన్నానా? ఈ నెల నా పనీ చాలా కటాకటిగావున్నది. ఈ నెలలో పాతఅప్పులు నలభయిదాదాకా సర్దాను. ఎందుకు సర్దానంటావేమో? సంవత్సరాది వస్తున్నది. పదేండ్ల పెద్దపిల్ల చిరిగిన గుడ్డలతో తిరుగుతున్నది. ఇక ఇల్లాలిసంగతి చెప్పనే అవసరంలేదు. రెండు పాతచీరెలతో కాలక్షేపం చేస్తున్నది. పాత బాకీలు సర్దితే రెండుమూడు రోజులలో మళ్లీ యేమన్నా పుడుతుందేమో నన్న ఆశతో..."

"అవునుగాని ఇందాక శంకరం వచ్చాడెందుకూ?"

"వాడికీ డబ్బు అప్పుకావాలిట."

"నీ దగ్గర తీసుకున్న పదీ ఇవ్వలేదా ఇవాళ."

"ఇచ్చాడు. కాని, పదీ చాలా అవసరం నాకు భాయీ."

"మరి ఇవ్వననక లేవంటా వెందుకూ!"

"ఇదే నీతో తంటా చెపితే అర్థంచేసుకోవు. నీ బుర్రకు నీ సంగతే తప్ప ఇతర విషయాలేమీ ఎక్కవు. పో... తీసుకుపో. ఆశేపెట్టి వేధించకు" అన్నాడు రామారావు పదీరూపాయల కాగితం సుబ్బారావుమీద విసరివేసి.........

*   *   *

"ఈ చాకిరీ చెయ్యలేక నా నడుం విరిగిపోతున్నది."

"..................."

"ఎల్లుండే పండగ. నా సంగతి ఎట్లా వున్నా ఆ పిల్లలకన్నా నాలుగు గుడ్డ ముక్కల సంగతి చూడండి."

"... ...."

"నా నోరు పారేసుకోడమే గాని... పెదిమ కదల్చరేం."

"అట్లాగే."

"అట్లాగే యేమిటి? ఎల్లుండే పండగ పిల్లలకు గుడ్డలు."

"అట్లాగే తీసుకువస్తాను "

"ఇంకా యెప్పుడు? ఇవాళ్ళ ఇస్తేనేగాని రేపుసాయంకాలానికన్నా తయారుకావు. మీరు బజారుకు వెళ్ళేది ఎప్పుడూ? గుడ్డలు తెచ్చేదెప్పుడూ? . "

"చూస్తూనేవున్నావుగా తీరిక దొరకడం లేదు. ఎంతసేపూ ఇల్లూ ఆఫీసూ సరిపోతున్నది."

"పోనీ నేనువెళ్ళి తీసుకువస్తాను. డబ్బు ఇవ్వండి "

"బాగావున్నది అదివుంటే నీచేత ఇంతగా చెప్పించుకోడం దేనికి?"

"ఒకప్పుడు మనదగ్గర డబ్బుంది కనుక నా ఇవాళ్ళ లేకపోవడానికి? ఎప్పటికప్పుడు దిన దినగండం వెయ్యేండ్లాయువేగా? మన తరువాత ఉద్యోగాలలో చేరినవాళ్ళను చూడండి. ఏదో ఒకటి ఏర్పరచుకొంటున్నారు. ఎందుకయినా చేసుకుపుట్టాలంటారు ఇదేనేమో?"

"నువ్వనేది ఏమిటి?"

"అదేమంటే కోపం ఇవ్వవలసినవాళ్ళను అడగరు ఉన్నప్పుడు బాబ్బాబనే వాళ్ళకు ఎంతపడితే అంతా యిస్తారు "

"నువ్వు చెప్పేదేమిటో నాకు తెలియడం లేదు "

"నేను సంస్కృతం మాట్లాడడం లేదు. హిందీరాదు నాకు—నా మాటలు అర్థం కాకపోవడానికి."

"అర్థమవుతూనేవున్నది "

"ఏమి అర్థమవుతున్నది నాబొంద "

"అవును నేను చేతకానివాణ్ణి. నా వల్ల యేమీ కాదు. పిల్లలకు గుడ్డలు కుట్టించలేను. నీకు చీరెలూ నగలూ కొనలేదు. ఇదేగా నువు చెబుతున్నదీ ?"

"ఉన్నమాట అంటే ఉడుకెక్కువ. ఇరుగుపొరుగువాళ్ళను చూడండి. ఎంత సరదాగా వుంటున్నారో? ఎప్పుడూ ప్రతిదానికీ డబ్బులేదు. డబ్బులేదు. అనే మాట తప్ప మరొకటి కనిపించదుగదా! ఆ గోపాలానికి మన కన్న తక్కువజీతమేగా. చూడండి ప్రతి పండగక్కీ చీరె తెస్తాడు. పిల్లలకు గుడ్డలు కుట్టిస్తాడు."

"అవును నేనూ అదే అడుగుతున్నాను "

"మళ్ళీ వన్నే చెప్పమంటారేమిటండీ "

"మరి ఏమిచెయ్యమంటావ్? నాకు చేతకావడంలేదు. నువన్నా జాగ్రత్తగా నడుపుకొస్తే బాగుంటుంది గదా?"

"నడిపేందుకు ఇక్కడ ఏముున్నదీ? డబ్బుకావాలి? ఎట్లానన్నా డబ్బుతీసుకు రండి అగీ కావలసింది "

"చేతనైనట్లు తీసుకువస్తునే ఉన్నానుగా."

"ఆ తీసుకువస్తున్నారు. సరిగ్గా ఖర్చుపెడితే వారంరోజులకన్నా చాలదు "

"అందుకని ఏమి చెయ్యమంటావ్"

"నన్నడిగితే నాకేం తెలుస్తుంది? డబ్బుకావాలి. డబ్బుమాత్రం ఎందుకూ? పిల్లలకు గుడ్డలు కావాలి. నెయ్యి అయిపోయింది. వెన్న తీసుకురావాలి, బొగ్గులు అయిపోయినయి. ఈ పూటబియ్యం అప్పు తెచ్చాను. ఇక మీ యిష్టం "

"అంతకంటే నువ్వు చేయగలిగిందేమున్నదీ? పగలల్లా అఫీసులో చాకిరిచేసి ఇంటికివస్తే ఇదీ వరస "

"అవును ఆఫీసులో పనిచేసి మీరు అలసిపోయారు ఇంట్లో పనిలేకుండా కూర్చొని మీరు రాగానే రాద్ధాంతం చేస్తున్నాను ...."

"ఆమాట నేను అనలేదు. ఎందుకూ అట్లా గోలచేస్తావు. ఈ యిల్లుకట్టుకొని నువ్వే వూరేగు "అంటూ రామారావు గబగబా బయటికి వెళ్ళాడు..... .

* * *

అవును . సత్యవతి చెప్పిన విషయాలు నిజమే. పిల్లలగుడ్డలు చినిగిపోయినవి గదా. పండగపేరుతోనైనా గుడ్డలు కుట్టిస్తే రోజూ వాళ్ళు తొడుక్కోడానికి ఉపయోగపడతవి గదా. తనుమాత్రం ఆ మాట కాదన్నాడా? కాదనడానికి ఆ విషయం తనకు తెలియదా యేమిటి? తెలుసు. తెలిసి తనేమిచేశాడూ? వెనక చేసిన అప్పులు తీర్చకుండా కొత్త అప్పులు చెయ్యడం ఇష్టంలేక గుడ్డలు కొనలేదు ఇంట్లో అన్నీ సరిగ్గా ఇవాళ్ళనే ఎందుకు అయిపోవాలి? వాడుకుంటే మరి అయిపోవా? అయిపోతవి. అయిపోగానే మళ్ళీ తెచ్చుకోవాలి. ఇంట్లో నిత్యావసర వస్తువులు అయిపోయినప్పుడల్లా ఆఫీసువాళ్ళు జీతమివ్వరుగదా? జీతంవచ్చినప్పుడే నెలకు కావలసినవన్నీ కొందామని ఎంతప్రయత్నించినా సాధ్యపడడంలేదుగదా? అక్కడికీ ఆ పాలంమీద వచ్చేదానితో కొంత వరకు అప్పులుతీరుస్తునేఉన్నాడు అయినా ఈ ఆడవాళ్ళకు ఇంత తొందరేం? ఇంత తొందరగా బయటబడతారేం? పిల్లలు చిరిగిపోయినగుడ్డలతో తిరుగుతుంటే బాధపడేది తాను ఒకర్తె అయినట్లు మాట్లాడుతుందేం ? ఇంట్లో బొగ్గులూ, బియ్యం, నెయ్యి అయిపోయినవని తనకు తెలియదా ? తీసుకువద్దామని తనుమాత్రం అనుకోనడంలేదా? ఈ కొస్తలోనే ఇంతగా అరుచుకోవలసిన అవసరమేమి వచ్చింది! ఇంట్లోకి కావలసినవి తీసుకురాకుండా ఈ పదిహేనేండ్లలో ఒక్కసారయినా ఎవరికన్నా ఇబ్బంది పెట్టానా? ఆ సంగతి సత్యవతికి తెలియదా? తెలుసు. కనుక ఇంట్లోకి కావలసినవి లేవని కాదు ఆమె ఆందోళన. పండక్కి గుడ్డలు కావాలి. ఇవాళ్ళనైనా గుడ్డకొని టెయిలరుకు యిస్తేనే గాని గుడ్డలు తయారుకావు అవును. సత్యవతి ఆందోళపడవలసినదే. కాని, గుడ్డలు ఎట్లాతీసుకురావాలి అని ఆలోచిస్తూ దిగులుగా రామారావు గాంధీ చౌక్ దాకా నడిచాడు ఇక అక్కడినుంచి అందరూ తన శత్రువులే. ప్రతికొట్లోనూ కాకపోయినా, చాలా కొట్లల్లో రూపాయో అర్థరూపాయో తను ఇవ్వవలసివుంటుంది

మెర్క్యురీలైట్ వెలుగుతోంది. మున్సిపల్ లైబ్రరిలోనుంచి రేడియో పాడుతోంది. జనం గబగబా నడుస్తున్నారు. హోటళ్ళల్లోనుంచి కొందరు కొంపలన్నీ అంటుకుపోయినంత హడావిడిగా బయటికి వస్తున్నారు. మరికొందరు అంతకంటే హడావుడిగా ఒకరినొకరు తోసుకుంటూ హోటళ్ళల్లోకి వెళుతున్నారు వచ్చేపోయేవాళ్ళను చూస్తూ ఒక పిన్ వర్క్సుషాప్ బయట నుంచున్నాడు రామారావు.

"అల్లాగే.... గుడ్డలేమన్నా కావాలా? మా వాడి కొట్టున్నది. కొత్తరకాని పెట్టి వుండండి."

"దానికేమున్నది కాని మీవాడి కొట్టు ఎక్కడ? డబ్బుకు కొత్త అగుతాడా?"

"దానికేముందండయ్యా. మీ దగ్గరుంటే ఒకటి మా దగ్గరుంటే ఒకటీనా. పదండి నేనేవచ్చి చెబుతాను వాడికి."

*　　*　　*

అవును....ఆయనమాత్రం ఏమిచేస్తారూ? జీతం చాలడంలేదు. ఇంకా ఎక్కువ డబ్బు కావాలి. పిల్లలయితే ఎక్కువవుతున్నారు గాని ఆదాయం పెరగడంలేదు. చేతనైనట్లు ఆయనకూడా సర్దుకుపోతునే ఉన్నారు. కాని, ఇవాళ్లి అంతకోపం దేనికిరావాలి?

ఎల్లుండే సంవత్సరాదిపండగ. ఉగాది. ఉగాది తన పుట్టినరోజు. పెద్దపాప పుట్టినరోజుకూడా. జీవితంలో మరొక సంవత్సరం గడిచిపోతున్నది. ఆ పిల్లలూ. యీ సంసారం మరొక సంవత్సర జీవితంలో ప్రవేశిస్తారు. అందుకు దగ్గ ఆనందం అవసరంలేదా? తానుమాత్రం ఏమి అడిగింది? నగలుచెయించమని పోరుపెట్ట లేదే? సినిమాలకూ, సర్కసులకూ, నాటకాలకూ పికార్లకూ తీసుకువెళ్ళమని గోల

"దండాలండీ..." అన్నాడు కోమటి రంగయ్య.

"నమస్తే..." అన్నాడు రామారావ్.

"అమ్మగారు పాపచేత చీటీపంపించారు. బియ్యం, వెన్న, బొగ్గులూ... మొత్తం 20 రూపాయలు సామాన్లుంటయ్. పంపించ మంటారా!"

"పంపించు."

చెయ్యలేదే? ఇంట్లోకి కావలసిన వస్తువుల సంగతి చెప్పింది. ఎందుకు చెప్పాలి? ఇంట్లోకి కావలసిన వస్తువులు తీసుకురావాలని ఆయనకు తెలియదా? ఆయనంతట ఆయన కాక తను చెప్పితేనే ఇన్నియేండ్లూ గడచినవా? కాదు సంవత్సరాదిపండుగ. పుట్టిన రోజూ కలిసి కలిగించిన ఆనందంవల్ల తను కొంచెం తొందరపడ్డది. ఆ తొందరలో ఆయన మనస్సుకు కష్టం కలిగించేమాట అని వుంటే అనివుండవచ్చు. అంతమాత్రాన అంతగా కోపం తెచ్చుకొని ఆయన ఇంట్లో నుంచి ఎందుకు వెళ్లినట్లూ? ఆయనవుంటే నే ఈ పిల్లలను సర్దడం తనవల్ల కాదే అటు వంటప్పుడు ఈ కోపంతో......అనుకొని అప్రయత్నంగా వస్తున్న కన్నీళ్లను అపుకొంటూండగా బొగ్గులబస్తా, బియ్యం, వెన్నపూస తీసుకొని కోమటిరంగయ్య కొట్టు గుమాస్తా శాస్త్రి వచ్చాడు.

"నాన్నగారేడీ" అన్నది పాప.

"గుడ్డలు పట్టిస్తున్నారు. ఇవి తీసుకువెళ్లి ఇంటిదగ్గర ఇచ్చిరమ్మన్నారు మా పావుకారు." అన్నాడు శాస్త్రి.

*　　*　　*

"గుడ్డలు చాలా తక్కువ ఖరీదుని."

"ఈ చీర ఎంత అయింది?"

"పన్నెండూ."

"మరి ఆ రెండోదో?"

"అది పదిహేనున్నర."

"మిగతా గుడ్డలూ"

"అవన్నీ కలిసిపదిహేను. కాని, గుడ్డలు ఏమంత బాగుండలేదు."

"ఫరవాలేదు. బాగుండడానికి అంతే మిటి? ఎంతలో చేసుకున్నా చేసుకోవచ్చు అందరికీ అన్నీ అమరినయ్. మరి మీకో."


"నాకా... నాకెందుకూ?"

"అప్పుడైందే మీసంగతి చూచేవాళ్లు అటు వైపునా, ఇటువైపునా...."


"ఇంకా నీకు ఆ పిచ్చిపోలేదు. చిన్న పిల్లలంకాదు. మన సంగతి మనమే చూచుకోవాలి. మనం ఎవరిసంగతి చూస్తున్నామని, మన సంగతి చూడ్డానికి ఇతరులు వస్తారూ?"

"సరే ఎప్పుడూ ఉన్నదేగా యీ వితండ వాదన. పిల్లలందరూ పడుకొన్నారు. ఇక స్నానానికి లేవండి నాలుగు మెతుకులు నోట్లో వేసుకొని పడుకుందాం మళ్ళీ ఆ పసిది లేచిందంటే తిండి తిననివ్వదు."

"ఇదుగో లేస్తున్నా. తప్పేదేమున్నది కనుక."



ఉన్ని ఉత్పత్తిదారు (కాశ్మీర్ దృశ్యం)



కాశ్కదు కొండలు

అద్దం ముందు

కృష్ణమోహనరావు

"ఒకవేళ మళ్లీ చిన్నదానివై పోయావనుకో!" తన ముందొచ్చి నిలుచున్న సుందరమ్మను ప్రశ్నించింది అద్దం. "తిరిగి జీవితాన్ని మళ్ళీ ప్రారంభిస్తున్నావనుకో! తిరిగి ఇదేవిధంగా జీవితం గడపడం నీకు ఇష్టమేనా?"

సుందరమ్మకు ఏం సమాధానం చెప్పాలో తెలియలేదు. కళ్లు చిట్లించి ఒకసారి తనవైపు చూసుకొంది. ఆమె మనస్సులో తను తన జీవితంలో అనేకపరిస్థితులలో అనేక పర్యాయాలు ఇదేవిధంగా నుంచొని ఉండడం తలచుకొంది.

"ఇదిగో చూడు—నా జీవితంలో అనేక అనుభవాలు కలిగాయి. కష్టాలు అనుభవించాను. సుఖాలు అనుభవించాను..."

అద్దం ఫక్కున నవ్వింది. సుందరమ్మతో ఇదే తంటా! కదిపితే చాలు తన కథంతా చెప్పి విసిగిస్తుంది. అంటే, అందరితో మొఱపెట్టుకొంటుందని కాదు. ఈ అద్దానికి సుందరమ్మకూ తెగని స్నేహం. తనని సుందరమ్మతోబాటు అత్తారింటికి పంపించారు. సుందరమ్మ అత్తారింటికి వచ్చేయడానికి ఒకరోజు ముందర వాళ్లమ్మ తన ముందు నుంచొని ఘొల్లుమని ఏడ్చింది. తనకు గుండె తరుక్కుపోయింది.

"ఓహో! మొదలెట్టావూ? నీ కష్టాలు నీ సుఖాలూ నాకు తెలియవనా? అమ్మ పుట్టింటినుంచి మేనమామనగలు చెప్పినట్టుగా ఉంది చాల్లే, తల్లీ, చాల్లే!"—అద్దం తిరిగి నవ్వడం ప్రారంభించింది.

"సుందరమ్మ నవ్వలేదు. ఇటువంటప్పుడు తనతోబాటు సుందరమ్మకూడా నవ్వేయడం ఆచారం. అద్దం తెల్లబోయింది. సుందరమ్మ తన మాటలు వినిపించుకొన్నట్లు కూడా లేదు. ఆమె తన ధోరణిలో తను ఉంది. అద్దంకూడా వినడం ప్రారంభించింది.

"...కష్టాలలోకూడా సుఖాలు ఇమిడి ఉంటాయి. అలాగే సుఖాలవిషయం కూడాను. ఒకప్పుడు మనం తిట్టుకొన్న కష్టాలే సుఖాలకు దారితీస్తాయి. మనకష్టాలు సుఖాలుగా మారిపోతాయి. మనం అనుకొంటాం: 'ఈ జరిగిన వాటివల్ల ఒక పాఠం నేర్చుకొన్నాం. ఇక ముందు ఇటువంటి పరిస్థితులలో మనం ఈ విధంగా ప్రవర్తిద్దాం; ఈ విధంగా ప్రవర్తించొద్దూ' అని.

★ అద్దం ముందు ★

కాని తీరా సమయంవచ్చేవరకు ఈ అనుభవాలెంగుకూ పనికిరావు.

"మగాళ్ల సంగతి నేను అట్టె అంత చెప్పలేను, కాని ఆడవాళ్లం తెలివితేటల కంటె ఉద్రేకాలకే ఎక్కువ లొంగుతామేమో అనుకొంటాను. బహుశః మగాళ్ల సంగతికూడా అంతే అయిఉంటుంది."— సుందరమ్మ

గాలి రివ్వున వీచింది. సుందరమ్మ చిన్న కొడుకు పదేళ్లవాడు రామం బల్లమీద పేకతో మేడకడుతున్నాడు. గాలికి మేడ కూలిపోయి, పేకముక్కలన్నీ గల్లంతుగా కింద పడిపోయాయి. ఇస్పేటురాణీమాత్రం, అరకు ఆరుని ఆనుకుని సంకేతంగా నిలుచునింది.

అద్దం అడిగింది. "నీ వేదాంతం సరే కాని, సుందరమ్మా! ఈవాళ పొద్దున్న నువ్వు ఏడ్చావు కేనికి?"

"నీ కెల్లా తెలిసింది?

"నువ్వు మొహం కడుక్కొని నా దగ్గిర కొచ్చినప్పుడు నీ కళ్లెఱ్ఱగా ఉన్నాయి"

"పొద్దున్న మీ అన్నగారికి బాగా కోపంవచ్చింది. ఇద్దరం పోట్లాడుకొన్నాం. మామూలేగా! చేతులో ఉన్న గ్లాసు విసిరి కొట్టేరు. కొంచెంలో తప్పిపోయింది."

"నీకు తప్పిపోడమేమిటి? గుమ్మంలోంచి వచ్చి నా దగ్గిరకొచ్చి పడితేను. ఏదో ఈ నేలమీద ఇంకొ రెణ్ణాళ్లు ఆయుస్సుండబట్టి బతికిపోయానుగాని, లేకపోతే నా కోసం ఏడవడంకూడా మానేసేవా రీపాటికి! అది సరే కాని, అమ్మాయి గురించే నా తగాదా?"

సుందరమ్మ తల ఊపింది. ఆమె కళ్లల్లో నీళ్లు గిర్రున తిరిగాయి. సుందరమ్మకూతురు రాధ 'ప్రాబ్లెమ్ చైల్డ్' అఖండమైన తెలివితేటలున్నాయి చగువుంది. ఆడవాళ్లందరికి అందంగా ఉన్నామనే గర్వం సహజం. రాధకి ఆడదైపుట్టినందుకే గర్వం!" ఆమెను చూసినప్పుడల్లా సుందరమ్మ కనిపిస్తూంటుంది. ఆడవాళ్లకు తెలివితేటలుండడం ఒక విధంగాచూస్తే వారికీ ఇతరులకీ కూడా ప్రమాదమేమోనని మగవాళ్లను ఆడవాళ్లను తయారుచేసేటప్పుడు భగవంతుడు రెండు రకాలు పదార్థాలను ఉపయోగిస్తాడేమో అనిపిస్తుంది. ఆడవాళ్లు ఒక వస్తువుని చూసినప్పుడు దాని మంచిచెడ్డలనుగురించి ఆలోచించరు వారిలో ఉండే ఓ గ్రహింపుశక్తి వల్ల ఆ వస్తువులోని 'గుణాలాన్ని' గ్రహిస్తారు. మగవాళ్లు అల్లా కాగు; వారు వస్తువుని గురించి మంచిచెడ్డ లాలోచించి ఒక నిర్ణయాని కొస్తారు. ఈవిధంగా చూస్తే దేముడు కూడా ఆడవాళ్లంటే కొద్దిగా పక్షపాతం చూపిస్తున్నాడేమో అనిపిస్తుంది. ఇదంతా ఆయన కెల్లా అర్థమవుతుంది? సుందరమ్మ తన కూతురును గురించి బాధపడుతోంది అంటే ఎందుకో ఆయనకు అర్థంకాదు. ప్రయత్నించాడు కాని అర్థంకాలేదు. ఎల్లా అర్థమవుతుంది? ఇద్దరూ జీవితంలో రెండు బాటల వెంబడి నడుచుకొంటూ వచ్చారు. ఒకచోట కలిశారు. అక్కడ నుండి ఇద్దరూ కలిసి ప్రయాణంచేశారు. అయినప్పటికీ తను వచ్చిన బాటనంటిన దృశ్యాలు ఆమె హృదయానికి హత్తుకుపోయాయి. అల్లాగే అతనికి కూడా. ఆమె దృక్పథాన్ని అర్థంచేసికొని ఆమె వచ్చిన బాటను సానుభూతితో ఊహించుకోగల శక్తిని భగవంతుడు అతనికి ఇంకా ఇవ్వలేదు. అందుకనే అతనికి ఆ పిచ్చికోపం! అతని అభిప్రాయాలతో ఆమెకు సానుభూతి ఉంది. అయితే తనను అర్థం చేసికోడని ఆమెకు కోపం!

ఇద్దరి సంగతీ అద్దానికి బాగా తెలుసు. అందులో ముఖ్యంగా సుందరమ్మ సంగతి. తీరిక ఉన్నప్పుడల్లా సుందరమ్మ అద్దం ముందుకు వెళ్ళి మంతనా లాడుతుంది. అద్దంకూడా ఆమెతో మనసిచ్చి మాట్లాడుతుంది.

సుందరమ్మ తల్లిదండ్రులు పేదవారు కారు; అయితే ధనికులు కూడా కారు. సుందరమ్మ చాలా తెలివయిందని చెప్పడానికి వీల్లేదు; కాని తెలివి తక్కువదీ కాదు. నడిచేటప్పుడు సాధ్యమయినంతవరకూ దారిలో ముళ్ళను తొక్కకుండా నడుస్తుంది. కాని ఒకొక్కప్పుడు అనుకోకుండానే ముళ్లు గుచ్చుకొంటాయి. గుచ్చుకొన్నాయి కదా అని కొందరు ఆడవాళ్లు పెద్ద గంద్రగోళం చేస్తారు. ఇతరుల బాధలను తాము అర్థం చేసుకోలేకపోయినా తమకు ఒకింత నెత్తురు ఒలికితే భూకంపం వచ్చినంత కంగారు పడతారు. సుందరమ్మ అటువంటిది కాదు. ఆమె తన చుట్టూ ఉన్న ప్రపంచాన్ని ఒక పాఠశాలగా తీసుకొంది. చుట్టూ తిరిగే వ్యక్తులందరూ ఆమెకు ఉపాధ్యాయులే. ఆమె తనకు గుచ్చుకొన్న ముళ్ళనుచూసి చాలా బాధపడేది. అయితే తనకు గుచ్చుకొన్న ముళ్లు ఇతరులకు కూడా బాధ కలిగిస్తాయని ఆమె తెలిసి ప్రవర్తించేది. తన ప్రవర్తనవల్ల ఇతరులకు ఎక్కడ బాధ కలుగుతుందో అని మెలకువతో ప్రవర్తించేది. ఆమె ఇతరుల యెడ మితిలేని సానుభూతిని వ్యక్తంచేసేది.

సానుభూతి చాలా విచిత్రమయింది. మనకు ఇతరుల కష్టాలయెడ సానుభూతి కలుగుతుంది, వా రీసానుభూతికి కృతజ్ఞత వలిబుచ్చరు పయిగా తమ ప్రయోజనాల కోసం దానిని దురుపయోగం చేసికోడానికి యత్నిస్తారు. ఇదీ సుందరమ్మ అనుభవం

సుందరమ్మ తన అనుభవాలన్నీ ఎన్నోసార్లు చెప్పింది.

"అప్పుడు నాకు పదిహేను పదహారు సంవత్సరాలు వయస్సు అంతవరకు పురుషులంటె నాకు ఒక విధమయిన ఏహ్యం ఉండేది కాని అప్పుడు నాలో—లోలోపల ఏవో వాంఛలు పెరగడం ప్రారంభమయ్యాయి నా అందాన్నీ, నా అలంకరణాన్నీ, నా పనులనీ పురుషులు చూడాలనీ; అభినందించాలనీ కోరికలు నాలో పెరగడం ప్రారంభం అయ్యాయి. పురుషులందరూ పశువుల్లాటివారనీ, వాళ్లు పశువు

ల్లాగే ప్రవర్తిస్తారనీ మా అక్కయ్యల్లాగే నేనూ నమ్ముతూండేదాన్ని. అయితే ఏ పురుషుణ్ణి చూసినా అతడు తప్ప మిగతా వాళ్లందరూ పశువులని భావిస్తూండేదాన్ని.

"అప్పట్లో మా ఇంటిపక్కని ఈశ్వరయ్య అనే కుర్రాడుండేవాడు. కుర్రాడంటే కుర్రాడు కాదులే, - పెద్దవాడే! పత్రికల్లో కథలూ వ్యాసాలూ రాస్తూండే వాడు. చిన్నప్పుడు చాలా నెమ్మదిగా వుండే వాడు. ఆడవాళ్ళూ, మగవాళ్ళూ సమానం అనీ ఆడవాళ్లు వంటిళ్లల్లోంచి బయటకు వచ్చి ప్రజలలో తిరిగి మెలగాలనీ అంటూండేవాడు. సాంబయ్యగారబ్బాయి. మన ఊరే వాళ్లది. సన్నగా, పొడుగ్గా.."

సాంబయ్యగారు బాగా డబ్బున్న రైతు.

అద్దం ముందు

ఒక్కడే కొడుకు కావడంవల్ల వాళ్ళ వంశంలో ఆచారం లేకపోయినా పెద్ద చదువులు చెప్పించాడు అతడు అప్పుడప్పుడు సుందరమ్మగారింటికి వస్తూండే వాడు. కాని పెద్ద అయిన తరువాత చాలా చెడ్డపేరు తెచ్చుకున్నాడు అతనికి ఎవ్వరూ పిల్లనివ్వడానికి ఇష్టపడలేరు. తండ్రితో కూడా సంబంధాలు తెగతెంపులు చేసుకొన్నాడు.

సరిగ్గా పక్కింట్లోనే ఉండేవాడతను. నలుగురు కుర్రాళ్ళను చేరదీసి, ప్రేమమీద, సంఘంలో స్త్రీల పరిస్థితులనుగురించి ఉపన్యాసాలిస్తూండేవాడు. పాలిపోయిన అతని మొహం అది చూస్తే జాలివేసేది సుందరమ్మకి.

అతడు అప్పుడప్పుడు సుందరమ్మవాళ్లింటికి వచ్చేవాడు ఏదయినా పనుంటే. ఒక రోజున అతడు వచ్చేసరికి ఇంట్లో ఎవరూ లేరు. మామ్మ ఉంది కాని ఆవిడ ఎక్కడో లోపల పడుకొనిఉంది. నాన్న, అమ్మ-ఇద్దరూ కూడా ఇంట్లో లేరు. నాన్న ఊరెళ్ళారు. అమ్మ అగ్రహారంలో కాంతమ్మగారింటికి వెళ్లింది.

అతడు సావిట్లోకి వచ్చి పిలిచాడు; తను వెళ్లింది. అతడిని సంఘం హింసిస్తోంది. ఎందుకు? తన అభిప్రాయాలను నిష్కర్షగా పైకి చెప్పగలిగినందుకు. "మిమ్మల్ని అర్థం చేసుకొనే వ్యక్తి ఒక్కతెయినా ఉంది" అని అతగానితో ఎప్పుడయినా చెప్పాలని సుందరమ్మ ఉద్దేశ్యం.

సుందరమ్మ గుమ్మంలోకి వెళ్లి "నాన్నగారు ఊరెళ్లారు; రేపొద్దున కాని రారు" అంది

అతడు తనవైపు రెండు క్షణాలు చూశాడు: "మీరెంతవరకూ చదువుకొన్నారండీ?" అని అడిగాడు.

సుందరమ్మ తెల్లబోయింది. ఒక్క నిమిషం ఆగి "థర్డ్ ఫారం పేసయ్యా" అంది. తన చదువుకి తనకే సిగ్గేసింది. అతను వెళ్లిపోయాడు.

అతడి గది వాళ్ళ గోడ నానుకుని ఉండేది. దానికి కిటికీలు లేకపోయినా గాలి రావడానికి పయిన గోడకు కన్నాలు ఉండేవి. తను పెరట్లో చెట్టునీడను కూర్చుంటే అతని ఉపన్యాసాలన్నీ వినబడేవి. తను అక్కడ కూర్చొంటుందని అతనికి తెలుసా? ఏమో, తెలిస్తే తెలిసుండొచ్చు అనుకుంది సుందరమ్మ. మర్నాడు అతడు రోజూకంటే గట్టిగా మాట్లాడుతున్నాడు. సంఘంలో కొందరు మగవాళ్లుంటారనీ, వారు పెద్దమనుష్యుల్లాగే చలామణీ అవుతుంటారనీ, ఇతరుల విషయాలలో విశాల హృదయులేననీ, తమ ఇంట్లో ఆడవాళ్ళను మాత్రం అణిచేస్తారనీ చెబుతున్నాడు. దానితరవాత తనెరుగున్న ఒక పెద్దమనిషినిగురించి ఉదాహరణంఇచ్చాడు. సతని మాటలు వింటున్నకొద్దీ అతడు తన అంగతే చెబుతున్నాడని అర్థం అయిపోయింది తనకు. తను వినాలనే కాబోలు చాలా గట్టిగా మాట్లాడుతున్నాడు.

సుందరమ్మకు బాగా కోపం వచ్చింది. నాన్నంటే తనకు చాలా ఇష్టం. తనను ఎంతో ప్రేమగా చూస్తాడాయన. తనకు చదువుకోవాలనిఉందంటే తప్పక చెప్పించేవాడే తనే అడగలేదు. ఈశ్వరయ్య నాన్నను బాగా అర్థంచేసికోలేకపోయారు అనుకొంది సుందరమ్మ

ఆ వేళ రాత్రి నాన్న భోజనంచేస్తూంటే సుందరమ్మ అంది "నిన్న మధ్యాహ్నం ఈశ్వరయ్యగారు వచ్చారు, ఎందుకో, నాన్నా!"

నాన్న ఉలిక్కిపడిచూసి, "ఎందుకూ?" అన్నారు.

"ఏమో చెప్పలేదు మీరు లేరంటే వెళ్లిపోయారు'

"నువ్వెందుకు పలికావు? అమ్మ లేదా ఇంట్లో?"

"అమ్మ కాంతమ్మగారింటికి వెళ్లింది."

"రౌడీ వెధవ! పోనీ సాంబయ్యగారి కొడుకుగదా అని ఊరుకొంటూంటే!—నిన్న నేను ఊరు వెళ్లడం చూసి పలకరించిన వెధవ మధ్యాహ్నం ఇంటికొచ్చాడన్న మాట నాకోసం."

సుందరమ్మ తెల్లబోయింది. ఆయన ఎప్పుడూ ఏదో ఆలోచిస్తూ ఉంటాడు. పరధ్యానంగా ఉండి మరిచిపోయుండొచ్చు అనుకొంది. అప్పటినుంచి రెండు మూడు రోజులు ఇదే ఆలోచించడం ప్రారంభించింది. నాన్న, ఈశ్వరయ్య—ఇద్దరూ మంచివారే. కాని ఒకళ్ళనొకళ్లు అర్థంచేసికోలేకపోతున్నారు. ఇంకా అతను నాన్నను అర్థంచేసికోలేదంటే ఆశ్చర్యంలేదు. కాని నాన్న అతన్ని అర్థంచేసికోలేదంటే? అది వింతే. ఇంత వయస్సు వచ్చి, ఇంతమంది మనుష్యుల్ని చూసినతర్వాతకూడా!

పైగా—ఈశ్వరయ్య నిజంగా రౌడీ అయితే తనముందు అంత సౌమ్యంగా ఎందుకు ప్రవర్తిస్తాడు? అతను వచ్చాడు; 'మీ నాన్నగారున్నారా?' అని అడిగాడు; 'నువ్వేం చదువుకొన్నావ్?' అని అడిగాడు; వెళ్ళిపోయాడు. తనవైపు చూసినా ఏదో సిగ్గుపడుతూ సిగ్గుపడుతూ చూశాడు. రౌడీ అయితే అల్లా ఎందుకు ఉండేవాడు?

నాన్న, అందరూ కూడా ఆ సుబ్బారావుని మంచివాడంటారు. తనని అతనికి ఇద్దామని అనుకొన్నారు కూడా. ఆ వేళ భోజనానికి వచ్చిన రోజున తములపాకులు ఇద్దామని వెడితే ఎవరూ లేకపోడం చూసి చెయ్యి పట్టుకొన్నాడు. వళ్లు ఝల్లుమంది. అరుద్దామనుకొంది కాని; మళ్ళీ ఎందుకా రభస అని ఊరుకొంది. ఒక నవ్వనవ్వేసి చక్కా వచ్చింది. మరి అతన్ని అందరూ మంచివాడని అంటారు. ఇల్లా ఎంతమందిని

అల్లరి చేస్తున్నాడో ఎవరికీ తెలియకుండా!

ఈశ్వరయ్యను అందరూ తప్పర్థం చేసుకొంటున్నారు. అనుకొంది సుందరమ్మ. పోనీ తన సానుభూతిని అతనికి తెలియచేస్తే? "సంతకం పెట్టకుండా ఒక ఉత్తరం రాస్తాను. దస్తూరి మార్చిరాస్తే సరి! ఎవరు రాసిందీ అతను అర్థంచేసికోగలడు!"

మర్నాడు ఈశ్వరయ్య పేర ఒక ఉత్తరం రాసి అతని గదిలోకి గోడ కన్నంలోంచి పడేసింది సుందరమ్మ.

అద్దం కొంటెగా నవ్వింది - గడుసుదానివే అన్నట్టు.

"ఈ ప్రపంచకమంటే ఏమిటనుకొన్నావ్! అమాయకంగా కనబడి గొంతులు కోసేస్తారు." అంది సుందరమ్మ.

"ఉత్తరంలో ఏం రాశానో జ్ఞాపకంలేదు, అక్కడక్కడ తప్ప. మొదట స్వార్థం లేకుండానే ఆయన స్త్రీలయెడ తీసుకొంటూన్న శ్రద్ధకు అభినందనలు తెలిపాను. 'మీ విజ్ఞానానికి, మీ సంస్కృతికి మీ పయిన నాకు విపరీతమయిన గౌరవం కలిగింది. మీలాంటి విద్యావంతులేగాని మా స్త్రీ జాతికి నిస్స్వార్థమైన సేవ చెయ్యలేరు. మీరు చేసేసేవకు నా సేవకూడా జోడించి చెయ్యాలనిఉంది. కాని నావంటి నిస్సహాయ అయిన స్త్రీ దేశానికి సేవ ఎల్లా చేస్తుంది?' అంటూ ఇల్లాగే ఏదో రాశాను" అంది సుందరమ్మ.

తనకి అతన్ని పెళ్లి చేసుకొంటే బాగుండును అనిపించింది. "మీ కభ్యంతరం లేకపోతే నేను మిమ్మల్ని పెళ్ళాడుతాను. సంఘం మనలను ఏమన్నా లెక్క చెయ్యవద్దు. మనం సంఘాన్ని ఎదిరిద్దాం" అని తనెల్లా రాస్తుంది? అందుకే తను రాసింది 'మీరు చేసే సేవకు నా సేవకూడా జోడించి' అని. అతడు చాలా తెలివయినవాడు. అర్థంచేసుకొంటాడు.

ఉత్తరం పడేసిన తర్వాత సుందరమ్మ చాలా విచారించింది. ఒకవేళ ఆ ఉత్తరం పడేసిన సమయానికి ఆ గదిలో ఇంకెవరయినా ఉంటే? ఆ ఉత్తరం వేఱొకరి చేతులో పడితే అతనికీ తనకీకూడా చాలా చెడ్డపేరు వస్తుంది.

ఉత్తరం పడేసిన రెండు మూడు రోజుల వరకూ ఏమీ జరగలేదు. పెరట్లోకి వెడితే అటునుంచి ఏం మాటలు వినబడతాయో నని అటు వెళ్లడం కూడా మానేసింది. ఒక రోజున అతడివద్దనుండి జవాబు వచ్చింది. నాన్న ఇంట్లో లేనిసమయంలో అతనే వచ్చాడు. "మీ నాన్నగారి పుస్తకం తీసుకొన్నాను. వారు వచ్చిన తరువాత వారికిచ్చెయ్యండి," అన్నాడు అతను. అందులో ఉంది ఉత్తరం. సుందరమ్మకు భయం వేసింది. 'నాన్నగారు చూస్తే?' అనుకొంది.

అతను ఉత్తరంలో చాలా విషయాలు రాశాడు. 'నన్ను మాసి నువ్వేదో గొప్పవాడని అనుకుంటున్నావేమో. నేనొక పతితుణ్ణి. సంఘంలోని ఘరానా మనుష్యులు ఎవర్నైనా అడుగు చెపుతారు, ఈశ్వరయ్య పచ్చి రౌడీ అని' అంటూ రాశాడు. సుందరమ్మకు ఇక్కడ బాగా జాలేసింది. తన పతనానికి కారణం సంఘమే అన్నాడు. "నేను పడిపోయాను. నాకు లేవాలనే ఉంది. తిరిగి బాగుపడాలనే ఉంది. కాని ఎల్లాగా? నీలాంటిదాన్ని పెళ్ళిచేసుకొంటే నేను తప్పక బాగుపడతాను. కాని నా బాగు కోసం నిన్నెలా పాడుచేస్తాను?... నువ్వు చదువుకో. చదువుకొని నాకంటె బాగా తెలివయినవాణ్ణి; బాగా ధనవంతుణ్ణి, బాగా చక్కనివాణ్ణి పెళ్లిచేసుకో. బాగుపడు."

సుందరమ్మ అతన్నే పెళ్ళిచేసుకోవాలని నిశ్చయించుకొంది. తను అతని కోసం త్యాగం చేస్తుంది. తనవల్ల అతను బాగుపడతాడు. నాన్న వాళ్ళు ముందు కేకలేసినా చివరికి సంతోషిస్తారు.

ఆ తరవాత సుందరమ్మ అతన్ని రెండు

★ అద్దం ముందు ★

మూడుసార్లు కలుసుకొంది. మనిషిని కలుసుకుమాట్లాడుతోంటే ఆమెకు అతనిలో కొన్ని అవలక్షణాలు కనబడ్డాయి కాని మనస్సును ఎల్లాగో అల్లాగ సరిపెట్టుకొంది. తను రెండోసారి చూడడానికి వెళ్ళినప్పుడు అతడు తటాలున తన చెయ్యి పట్టుకుని తన పక్కన కూర్చోపెట్టుకొన్నాడు. ఒకపక్క సుందరమ్మని పెళ్లిచేసుకోడానికి తను తగనని అంటూనే ఈ పని చెయ్యడం ఆమెకు చివుక్కుమనిపించింది. ఎందుకో ఆమెకు సుబ్బారావు జ్ఞాపకం వచ్చాడు. ఎందుకో? అతనికీ ఇతనికీ పోలికే లేదు.

సుందరమ్మ ముందే జాగ్రత్తపడింది కాని లేకపోతే ఇదంతా ముంచుకుపోయేదే! పదిహేను ఇరవయిరోజులు గడిచిన తర్వాత ఒకనాడు కలుసుకొందామన్న ఈశ్వరయ్య కనబడలేదు. మర్నాడు పొద్దున్న ఊరంతా ఘుప్పుమంది. ఎవరినో లేవతీసుకొని ఈశ్వరయ్య పారిపోయాడు. ఆవిడ తనతోబాటు తన నగలన్నీ తీసుకుపోయిందిట.

* * *

"నాకేం పాలుపోటల్లేదు. సరిగ్గా నేను నడిచినబాటనే నడిచివస్తోంది నాకూతురు. నేను కొండకొనవద్దకువచ్చి ఆగాను. పడిపోవలసిందే. కాని దైవవశాత్తు రక్షింపబడ్డాను నా అనుభవాన్ని పురస్కరించుకొని నాకూతురు బాగుపడితే బాగుణ్ణు" – సుందరమ్మ.

ఏంచేసింది అమ్మాయి?

రాధను అన్నానికి పిలుద్దామని రాధ గదిలోకి వెళ్లింది సుందరమ్మ. రెండుమూడు సార్లు పిలిపించుకొన్న తరవాత రాధచేతిలో పుస్తకం తొందరగా డ్రాయర్లో పడేసి పరుగెత్తుకొచ్చింది. ఆమె తొందర అదీ చూస్తే అనుమానం వేసింది సుందరమ్మకు. డ్రాయర్‌లో వెతికితే దొరికింది. ఒక పుస్తకంలో ఉంది ఉత్తరం. రామకృష్ణుడిప్పిల్లి వేడిపాలెక్కడున్నాయో చటుక్కున కనిపెడుతుంది.

"పెళ్ళికొడు కెవరూ?" అని అడిగింది అద్దం. కొందరికి ఎప్పుడు హాస్యాలాడాలో ఎప్పుడు మానాలో తెలియదు

"ఎవరో రామకృష్ణారావుట. కాలేజీలో లెక్చరర్. ఏమిటి గతీ?' అంది సుందరమ్మ ఆదుర్దాతో.

"ఉత్తరం ఏంచేశావ్?" అని అడిగింది అద్దం.

"చింపేద్దామనుకొన్నాను. కాని రాధ మేమిటి? ఇంకొకటి రాస్తుంది. పయిగా నాకు తెలిసిందని తెలుసుకొని మరింత జాగ్రత్తపడుతుంది."

"ఓపనిచెయ్యి. నీ అనుభవాలన్నీ చెప్పిమాడు. పాఠం నేర్చుకొంటుందేమో చూద్దాం. నాకుమాత్రం నమ్మకంలేదు నిప్పు కాల్తుందని చెప్పితే తెలియదు. ముట్టుకొన్నతర్వాతకాని తెలియదు"

"అయితే అంతా చెప్పేయమంటావా..."

ఊఁ. మీ ఆయన!" అంది అద్దం.

సుందరమ్మ మొగుడు దరదరా నడుస్తూ వచ్చి లోపలికి పోయేడు. అతనితీరు చూస్తే ఆమెకేదో భయంవేసింది. వంటింట్లోకి వెళ్ళి ఫ్లాస్కులో కాఫీ గ్లాసులో పట్టుకొచ్చి ఇచ్చింది.

"నువ్వు పొద్దున్న అన్నమాట ఇప్పుడు నాకు అర్థమయింది" అన్నాడాయన. సుందరమ్మకు అర్థంకాలేదు

"ఏముంది? రాధసంగతి. ఎదిగినపిల్లను పెళ్లిచెయ్యకుండా ఉంచడం మంచిది కాదు"

పక్కగదిలో రాధ త్రుళ్లిపడింది.

కోర్టులో ఆయనస్నేహితుడు హెచ్చరిక చేశాడు. "ఊళ్లో పుకార్లు చాలా ఉన్నాయి. ఆ రామకృష్ణారావు దుర్మార్గుడు. నీకూతుర్ని జాగ్రత్తచేసుకో" అని.

ఆవేళ రాత్రి రాధను కూర్చోపెట్టి సుందరమ్మ తనకథంతా చెప్పుకొచ్చింది.

రాధ అంది: "అమ్మా! నువ్వీ కథ నాకెందుకు చెబుతున్నావో నాకు తెలుసు. రామకృష్ణారావుగారు దుర్మార్గుడని అతన్ని పెళ్ళిచేసుకోవద్దని కాదూ? మీ ఇష్టప్రకారమే చెయ్యండి. నేను కాదనను."

సుందరమ్మ నిర్ఘాంతపోయింది. రాధ లేచి వెళ్ళిపోయింది. గాజు వంగదు. పగిలిపోతుంది ఉక్కు వంగిపోతుంది. విరగదు. ఉక్కు తీగను తెంపడం అసాధ్యం.

* * *


రెండుమూడు రోజుల తర్వాత రాధ జడ వేసుకొంటోంది.

"నీ పెళ్ళిసంగతి ఏమయినట్టూ?" అని అడిగింది అద్దం

"ఏమో! ఎవరికి తెలుసూ? రామకృష్ణారావుగారిని పెళ్లి చేసుకుంటానంటా వేమోనని భయపడ్డారు. మీ కిష్టం లేకుండా చేసుకోనని చెప్పాను. రామకృష్ణారావుగారు దుర్మార్గుడుట. అయితే అయ్యుండొచ్చు. దుర్మార్గులయినవాళ్లను బాగుచెయ్యడంలోనే ఉంది గొప్ప! సావిత్రినీ అనసూయనీ అందరూ పొగుడుతారు కాని ఇంట్లో ఉంచుకోడానికి ఇష్టపడరెవ్వరూ!" అని వెనక్కి తిరిగి వెళ్ళిపోయింది

అద్దం అంది "నిప్పు ముట్టుకు చూస్తే కాల్తుంది. కాల్తుందని చెపితే ఏమాత్రం తెలుస్తుంది? ఎవరి అనుభవం వారికి కావలసిందే!"

రాధ వినిపించుకోలేదు. ★



ఏప్రిల్ 1

ఇల్లిందల సరస్వతీదేవి

"రేపు మధ్యాహ్నము రాక్ లాండ్సులో కమ్మని విందు, గానకళా ప్రదర్శనము. తాముందరు విచ్చేసి మమ్ములను ఆనందింపచేయుడు"ని హైదరాబాదు రాష్ట్రశాసనసభా సభ్యురాండ్రు మంత్రులకు పత్రికా విలేఖరులకు అచ్చొత్తింపబడిన ఆహ్వాన పత్రికలను అందించారు మార్చి 31 వ తేదీన.

ఆహ్వానింపబడిన వారిలో కొందరికి తీరుబాటులేదు కాబోలు - ఆ మరునాడు కొందరు మాత్రమే కమ్మని విందును తలచుకుంటూ రాక్ లాండ్సును వెదుకుకుంటూ వెళ్ళారు. ఎంతసేపు ఎదురుచూసినా ఆహ్వానించిన సభ్యురాండ్రు కనబడరు! వాళ్ల అలికిడే లేదు! కొంతసేపటికి ఆ అతిథులకు స్ఫురించింది 'ఆనాడు ఏప్రిల్ మొదటి తేదీ కదా!' అని. 'ఆల్ ఫూల్సే' అనుకుంటూ ఒక్కొక్కరే గృహోన్ముఖులైనారు.


ఇదే విధముగా జరిగిన మరొక సంఘటన: 'రేపు మౌలానా మహమ్మదలీ సికింద్రాబాదు మీదుగా ఢిల్లీ వెళ్లుతున్నార'ని ఒక స్థానిక పత్రిక మార్చి 31 వ తేదీన ప్రకటించింది. ఆ మరునాడు వేలకొలది ప్రజలు సికింద్రాబాదు స్టేషనువద్ద ఆయన సందర్శనముకొరకు గుమికూడారు. మధ్యాహ్నము 12 గంటలయినా మౌలానాగారి స్పెషల్ ట్రెయిను రాలేదు. అక్కడ గుమిగూడిన వారిలో ఉన్నతాధికారులు, ప్రభుత్వోద్యోగులు, విలేఖరులు ఇంకా ఎందరో పురజనులు ఉన్నారు. ఆ మరునాడు స్టేషనువద్ద సమావేశమయిన వారినందరినీ ఆ పత్రిక గేలిచేసింది - 'ఏప్రిల్ ఒకటవ తేదినాటి ఆహ్వానాలను నమ్మతారా?' అని.

మాఘ ఫాల్గుణ మాసాలు శిశిర ఋతువు. ఈ కాలములో ప్రకృతి తన రామణీయకతను కోల్పోతుంది. చెట్లు ఎండి మోడులవుతాయి. చైత్ర వైశాఖాలు వసంత ఋతువు చెట్లు చిగిర్చి ప్రకృతి కొక వింత శోభను కలిగిస్తాయి. ఋతువు మారగానే చలి వదలిపోయి ఎండలు ముదురుతాయి వసంతాగమనముతో మానవహృదయాలు కూడా చెట్లవలెనే చిగిర్చి, నూతనోత్సాహముతో విప్పారిన, మనసులతో కలకలలాడుతూ ఉంటాయి. మన దేశీయులందరు వసంతోత్సవాలను ఈ ఋతువులో జరుపుకోవటము ఆచారము. ప్రాచీన హిందూదేశ చరిత్రను పరిశీలిస్తే రాజులు వసంతోత్సవాలను శృంగార రసోద్దీపనములైన క్రీడలను ప్రోత్సహించి, దేశమంతటా ఎంతో ఘనముగా జరిపించుతూ ఉండేవారని తెలుస్తుంది సంస్కృతనాటకాలలో కూడా వసంతోత్సవ వర్ణనలు ఉన్నాయి.


మన సంప్రదాయానుసారము వసంత ఋతువు సంవత్సరాదితో ఆరంభమవుతుంది. కాని ఆధునికుల అంచనా ప్రకారము మేష సంక్రాంతి 21 వ మార్చినాడే, నిజానికి అదే వసంత ఋత్వారంభమని అనవలసి ఉంటుంది. కాని మనకు సంప్రదాయము ననుసరించటమే అలవాటు.

ఏప్రిల్ మొదటి తేదీనాడు పాశ్చాత్య దేశాలలో ఒక ప్రత్యేకమైన ఆచారాన్ని పాటిస్తారు. ఈ తేదీని ఆల్ ఫూల్స్ డే అంటారు. ఆనాడు ఒకరి నొకరు గేలిచేస కొని ఫూల్ చేసుకుంటారు. దీనిని హాస ముగా ఎగతాళిగా భావిస్తారు దీనికి వా వరుసలతో నిమిత్తము లేదు. దినిలో ప్రత్యే కముగా ఎవరినైనా అవమానము పాలు జేయాలనిగాని, అపకారము చేయాలనిగా ఉద్దేశ్యముండదు - ఉండరాదు. కనుక చిన్నవాళ్లు పెద్దవాళ్లను, పేదలు ధనికుల ఆ ఒక్కరోజున మాత్రము వరుసలా వచ్చు - గేలిచేయవచ్చు - పరాచికము లా వచ్చు. అందరూ సోదరభావముతో తమ భేదాలు లేకుండా కలసి మెలిసి వి దించే రోజది. వసంతోత్సవాలు మన

(30-వ పేజీ చూడుడు)



కాశ్మీర్, దాల్ సరస్సులో నౌకాగృహాలు.



ఏప్రిల్ 1

ములో ఉన్నప్పటికీ ఏప్రిల్ మొదటి తేదీన జరిగే ఈ విధమైన వినోదక్రీడలు మాత్రము మనకు పైనుండి దిగుమతి అయినవే. క్రమముగా ఏప్రిల్ మొదటి తేదీ ఈ దృష్ట్యా ఒక ప్రాముఖ్యము కలదిగా పరిణమించింది

మానవుడిని నిరంతరము గంభీరమైన ఆలోచనలు, ప్రాపంచిక వ్యధలు మనసును కల్లోలపరచి కుంచించివేస్తూ ఉంటాయి. వాటిని పరిష్కారము చేయలేకపోయినా మనసును కొంత ఉల్లాసపరచి, వినోదింపచేసి, మనోబలమును చేకూర్చే సాధనక్రియలు కొన్ని ఉన్నాయి. హాస్యము వినోదము వాటిలో చేర్చతగినవి. నిరపాయకరమైన సున్నితమైన హాస్యముచే వినోదము కలిగి మనిషి పకపక నవ్వకలుగుతాడు. ఆ నవ్వువల్ల ముఖకండరాలు, నరాలు సడలి చల్లవుతాయి. అటువంటి నవ్వువల్ల రక్తప్రసారము చక్కగా అయి, ఒక నూతన తేజస్సుతో ముఖము ప్రకాశిస్తుంది. ఇది ఆరోగ్యానికి హేతుభూతమైనది; మానసిక వికాసానికికూడా తోడ్పడుతుంది; సుహృద్భావాన్ని పెంపొందిస్తుంది. ప్రతి వ్యక్తికీ ఏవో కొన్ని లోపాలు ఉండటము సహజము. తన లోపాలను తాను తెలిసికొని సరిదిద్దుకోవటము అందరికీ అసాధ్యమైన పని. ఈ లోపాలను ఇతరులు వ్యంగ్యముగా, హాస్యోక్తిలో ఎత్తిచూపితే కోపగించుకోకుండా వినోదించటము ఒక సద్గుణము ప్రసిద్ధపురుషులను గురించి వ్యంగ్యచిత్రాలు వేసినా (*Cartoons*) లేక హాస్యోక్తులు వ్రాసినా వినోదకరముగా భావించటములో వారి గొప్పదనము స్పష్టమవుతుంది. గొప్ప గొప్ప రాజకీయవేత్తలు ప్రఖ్యాత పురుషులు ఈ చిత్రాలపాలయి అందరితోపాటు తామూ నవ్వి ఆనందించినవారే.

ఉత్తర హిందుస్థానములో ఎక్కువగాను, దక్షిణదేశమున తక్కువగాను ఆచారములో ఉన్న హోలీధూలండీ కలాపాలుకూడా ఈ హాస్యములోకే వస్తాయి హోలీపండుగ దినాలలో ఒకరిమీదఒకరు రంగులుపోసుకొని వినోదిస్తారు. పాటకజనములో కొందరు మసికూడా పూసుకొని ఆటపాటలతో వీధులవెంట తిరుతారు. ఆరోజులలో వీధులవెంట నడవటము కష్టము. ఎవరిబట్టలు చూసినా రంగులతో మునిగితేలుతూఉంటాయి ఆ నాలుగురోజులూ దాటిపోయిన తిరువాత ఎవరికివారే—వారివారి అంతస్థులలో నిలచిపోతారు

ఈ సంవత్సరము ఏప్రిల్ ఒకటవ తేదీ కొక విశిష్టత కలిగింది. ఆనాడే శ్రీరామ నవమి కూడా తటస్థించింది. మన పండుగలలో కొన్ని మహాపురుషులనుబట్టి వచ్చినవీ-కొన్ని ఋతువులనుబట్టి వచ్చినవీను. శ్రీరామనవమి ఒక మహాపురుషునిబట్టి ఏర్పడినది. ఆనాడే ఆ పురుషోత్తముడి జననము; కళ్యాణము, పట్టాభిషేకము. ఏప్రిల్ ఒకటవతేదీ నాటి క్రీడలు వినోదప్రాయములయితే శ్రీరామ నవమి ఉత్సవాలు పూజలు మనకు పవిత్రవంతమైనవీ ఉదాత్తభావాలను పురికొల్పేవీను

రాముడివంటి కొడుకు, సీతవంటి భార్య, భరత లక్ష్మణులవంటి సోదరులు, హనుమంతునివంటి బంటు భారతీయులకు ఆదర్శపాత్రలు. వాల్మీకి రామాయణములో యుద్ధకాండలో

నసర్వే భ్రాతరస్తాత
భవన్తి భరతోపమాః
మద్విధా వా పితుః పుత్రా
సుహృదో వా భవద్విధాః

'తోబుట్టువు లందరూ భరతునివంటి వారు కాజాలరు. తండ్రికి నా యట్టికొడుకులు పుట్టరు. సుగ్రీవుడా! నీవంటి స్నేహితులను కలుగజాలరు' అని శ్రీరామచంద్రుడే విభీషణుడు తనను శరణుజొచ్చిన సందర్భములో అన్నాడు. మనకు ఆదిదంపతులు పార్వతీ పరమేశ్వరులయితే ఆదర్శదంపతులు సీతారాములు. రామాయణ కథాప్రభావము ప్రపంచముపైన చాలా ఉన్నది. అందులోనూ భారతదేశములో అధికముగా ఉన్నది. భారతీయు లందరిలో ఆంధ్రులలో రామాయణ కథా ప్రభావము మరీ ఎక్కువగా కనబడుతుంది. రామలక్ష్మణ హనుమంతుల పేర్లు పురుషులలోను సీతమ్మ పేరు స్త్రీలలోను లక్షలకొలదిగా ఆంధ్రదేశములో లెక్కపెట్టవచ్చు. ఆంధ్రులకు కులదైవమూ ప్రియజనకుడూ శ్రీరామచంద్రుడు-ప్రియజనని సీతమ్మ. 'రామయ్య తండ్రీ - సీతమ్మ తల్లీ' అన్న మాటలే మన దేశపు బిచ్చగాళ్లకు బ్రతుకు తెరువు. 'సీతారామాభ్యాన్నమః' కూడా బ్రతుకుతెరువే అయింది.

ఆంధ్రదేశపు దివ్యక్షేత్రములలో భద్రాచల మొకటి. ఆ గుట్టమీద మన ఆదర్శ ప్రభువు పత్నీసమేతుడై వ[illegible]సినాడు. భద్రాచలములో దేవాలయము కట్టించి అనేక కీర్తనలను రామయ్యమీద రచించి రామదాసు - (కంచర్ల గోపన్న) మహాభక్తుడైనాడు. గోపన్న గతించిన కొంతకాలానికి పరరాజుల దాడి భయానికి శ్రీ సీతారామలక్ష్మణ ఉత్సవవిగ్రహాలు పోలవరానికి తరలవలసినవారైనారు. తిరిగి దేశములో శాంతి నెలకొన్న తరువాత తూము లక్ష్మీనరసింహదాసు అప్పటి హైదరాబాదు ప్రధాని అయిన రాజా చందూలాల్ వద్ద సనదునుపొంది భద్రాచల దేవాలయమును పునరుద్ధారణచేశాడు. అప్పటి కట్టుబాట్లూ సంప్రదాయాలూ నేటికీ ఆదరణలో ఉన్నాయి. ప్రతి ఏటా శ్రీరామనవమినాడు పగలు 12 గంటలకు సీతారాముల కళ్యాణోత్సవము చూసి వేలకొలది ప్రజలు కన్నుల పండువుగా ఆనం

కనకాంబరాలు

నిత్యానంద్

భోజనాలై పోగానే వంటిల్లు శుభ్రపరిచి వాకిట్లోకివచ్చి యీజీ చైరులో పడుకొంది సావిత్రి. సీతమంచంమీద నిద్రపోతోంది. పాప ఉయ్యాలలో పడుకుంది. రాజారావు ఆఫీసుగదిలో ఏదో రాస్తున్నాడు. సావిత్రి హృదయంలో ఏవోకోర్కెలురేగి అవి నైట్‌క్వీన్ వాసనలతోపాటు గాలిలో కల్సిపోతున్నాయి గాలి మంద మందంగా వీస్తున్నది వీధిలోని నైట్‌క్వీన్ వాసనలు ఆమెమీద దాడి చేస్తున్నాయ్! చంద్రుడు మబ్బులచాటునుంచి దోబూచులాడుతున్నాడు. సావిత్రికి ఆ సమయంలో కనకాంబరం చీర కట్టుకోవాలనిపించింది. తనకా కనకాంబరం చీరంటే ఎంతో యిష్టం. ఎంతో సంతోషంగా ఉంటేనేగాని ఆ చీర కట్టుకోదు.

రాజారావు గదివేపుచూసింది. చంద్ర కిరణాలు ఆమె చెక్కిళ్లమీదపడి ప్రతిబింబిస్తున్నాయా అన్నట్లు రాజారావు ముఖం ఎలెక్ట్రిక్ లైటుముందు స్పష్టంగా కన్పిస్తున్నది. రాజారావు రాతలలో మునిగి ఉన్నాడు. చంద్రునివేపు కళ్లుతిప్పి నిదానంగా పరిక్షిస్తున్నది.

యమునా తటాకినిలో గోపికాస్త్రీలతో జలక్రీడలాడే గోపాలకృష్ణుడిలాగ, అసంఖ్యాకములైన నక్షత్రములమధ్య ప్రకాశిస్తూ తన కర్తవ్యధిక ప్రియమైన తారామణిని వెతుకుతున్నట్లు చంద్రుడు పరుగెత్తుతున్నాడు. కాని తన భర్తకుమాత్రం తనంటే ఎందుకంత నిర్లక్ష్యమో బోధపడలేదు. ఎప్పుడూ తన కాగితాల రాత, రుసరుసలమోత, భార్యంటే రోతేగాని, సరదాకైనా ఒక్కనాడు సరసాలతో గడపలేదుకదా!

కాలచక్రంమాత్రం తన సాంసారిక జీవితంలో నాల్గుసంవత్సరాల నమాంతంగా మింగేసింది. తనిప్పుడు ఇద్దరు బిడ్డల తల్లయినా వయసుమాత్ర మేమంత తరిగిపోయింది? పదిహేనవయేట పెళ్లయింది. ఇప్పుడింకా సాంసారిక జీవితాన్ని గడిపిన సంతోషం సౌఖ్యం తనకున్నదా! ఎంతసేపూ భర్త అనుమానాలూ, యీసడింపులూ, నిర్బంధింపులూ, సూటిపోటు మాటలూ, షికార్లూ, లాలింపులు తనే మెరుగును? సాయంత్రం ఆ విధిలోని భార్యాభర్తలు షికారువెళ్తుంటే తనకెంతో మూపె ముచ్చటేస్తుంది.

తీయనికోర్కె లేవో చెలరేగడంతో కుర్చీలోంచి లేచింది. సావిత్రి అడుగులో అడుగులేసుకుంటూ భర్త గదిలోకి నడిచింది. రాజారావు సావిత్రి రాకను గ్రహించినట్టు కూడాలేదు; తన పనిలో నిమగ్నమై ఉన్నాడు.

టేబిలుమీద రెండుచేతులూ ఆనించి, ఏమంటాడో నని లోలోపల భయపడుతూనే, "సినీమాకి వెళ్దాముటండీ" అని అడిగింది సావిత్రి.

సమాధానంగా రాజారావు తలెత్తి తీక్షణంగా చూసి మళ్లీ తలదించుకుని రాసుకుంటున్నాడు.

"పగలల్లా ఆఫీసులోనూ, రాత్రి ఆఫీసు కాగితాలతోనూ అయితే, ఇంట్లో పెళ్లాం పిల్లలసంగతేమిటి?" సావిత్రి లోలోపలే విసుక్కున్నది. తను పెళ్లికాకముందు ఎన్నోకోర్కెలమేడలు కట్టుకున్నది. అన్ని గాలిమేడలైకూలిపోయేయి. సినీమాకి వెళ్ళడానికైనా నోచుకోలేదు.

భార్యంటే అతనికెందుకింత అలుసు? భార్యంటే అతనికున్న అభిప్రాయాలూ, ఆదర్శాలూ, అర్థమైనా కాకపోయినా, సావిత్రి పెదవులమీది చిరునవ్వుమాత్రం క్రమక్రమంగా క్షీణించిపోయింది.

ఇంకా అలాగే నిలుచున్న సావిత్రిని చూసి, "మరేం పనిలేదా? ఎందుకా సినీమాలు? ఫేషన్లు ఆచరణలో పెట్టడానికా?" అని గర్జించేడు రాజారావు. హృదయం ద్రవించిందా అన్నట్టు సావిత్రి రెండు కళ్లలోంచీ రెండు నీటిబిందువులు స్రవించేయి. హృదయంలేని వాళ్లకు ఎదటి హృదయాలు ఎంత తపించిపోతాయో ఏం తెలుస్తుంది? గాయపడ్డ హృదయంతో మెల్లిగా పడకగదిలో కొచ్చింది

యీ సినీమాలకి వెళ్ళే ఆడా మగా పనిలేకే వెళ్తున్నారా? ఫేషన్లు నేర్చుకుని వేషాలు వెయ్యడానికే వెళ్తున్నారా? పనిలో విసుగెత్తిన హృదయాల్ని ఆనంద పర్చడంకోసం వెళ్తున్నారు. సినీమాతారల ఫేషన్లవేపు పరుగెత్తే భర్తల మనస్సులను కట్టి ఇంట్లోనే ఉంచడంకోసం కొందరు వెళ్తున్నారు తనలో తానే సమర్థించుకుంది సావిత్రి

తనంటే అతనికెందుకా కోపం? తనేమైనా వ్యతిరేకంగా ప్రవర్తించేనేమో నని ఆలోచించింది. పొరపాటు వప్పుకుని బ్రతిమాలడానికైనా తనే పొరపాటూ చెయ్యలేదు. పోని కాగితాల గొడవల్లో విసుగుతో అన్నారనడానికైనా [illegible]దు. ఎప్పుడూ యింతే! కూతురు పక్క పడుకుని ఆలోచించింది.

రాజారావు సంస్కారం కలవాడే. చాతుర్యం, అందం అన్నీ ఉన్నాయ్! కానీయైనా కట్నం పుచ్చుకోకుండా సావిత్రిని పెళ్లాడేడు. అతని సంస్కార భావాలకు, చిన్నా పెద్దా, ముఖ్యంగా కట్నం ఇచ్చుకునే శక్తిలేక, యీడొచ్చిన పిల్లను రెండేళ్లు ఇంట్లో ఉంచుకున్న సావిత్రి

దిస్తారు. సీతారాముల కథా ఘట్టాలు పండితులకు పామరులకు స్త్రీలకు, పిల్లలకు ఎవరికి తగినట్టు వారికి వీలుగా రచింపబడి ఉన్నాయి. పనిపాటలు చేసుకొనేవారికీ, కథలు చెప్పుకొనేవారికి పాటలు పాడుకొనేవారికి పరిశోధన చేసేవారికి, విద్యార్జన చేసేవారికి ఏ దృక్పథముతో చూసిన ఒక ప్రత్యేకత, ఒక విశిష్టత ఆ కావ్యములో కనబడక మానదు. రామాయణమును మానవులకు రాముడు చూపిన మార్గముగా మనము భావిస్తున్నాము

అధ్యాత్మ రామాయణ కీర్తనల, స్త్రీల పాటలలో ముఖ్యమైన కుచ్చల కథ శ్రీరామ జననము, సీత అనవాలు, స్త్రీలలో చాలామందికి కంఠస్థమయిన వే. రామదాసు కీర్తనలుకూడా చాలమంది పాడుకుంటునే ఉంటారు. స్త్రీలలో అక్షర పరిచయము లేనివారికయినా ఈ పాటలద్వారా రామాయణ కథాభాగాలు సుపరిచయమే

ఈ సంవత్సరములో ఒకటవ ఏప్రిల్ వినోద పావిత్ర్యముల కలయికతో అపూర్వమైనదిగా భాసించింది. మన్మథ నామ సంవత్సరము ఇటువంటి అపూర్వ కలయికలతో శుభముల నివ్వగలదని ఆశిద్దాము.

★

★ కనకాంబరాలు ★

తండ్రీ, ధన్యవాదాలు అర్పించేరు. పెళ్ళయి కాపురానికి వచ్చినతర్వాత కొన్నాళ్ళు సరదాగానే ఉండి, ఇప్పుడెందుకిలాగ మారిపోయేడా అని సావిత్రి రాత్రీ పగలూ ఆలోచించేది. కాని కారణం మాత్రం కన్పించలేదు.

కారణం లేకుండా కస్సుబుస్సుమంటుంటే ఏ స్త్రీ సహించుకోగలదు? ఏదో కోపం మనస్సులో ఉంచుకుని యీ విధంగా భార్యను హింసించడమెందుకు? ఆ కోపకారణమేదో తెలియజేస్తే, మళ్లీ ఆ విషయంలో భర్తకు కోపం రాకుండా జాగ్రత్తపడవచ్చును. కాని [illegible]యా పేమో అనడానికైనా వీలు లేదు. తను బిడ్డలతల్లైనా వయస్సేమాత్రం? అందం ఏమైనా తగ్గిందేమోనన్న అనుమానం కలిగింది సావిత్రికి.

రాజారావు అప్పుడే కాగితాల కట్టను పక్కకు పెట్టి, సిగరెట్టు వెలిగించేడు. సావిత్రి లేచి పాలగ్లాసు తీసుకెళ్లి టేబిలు మీద పెట్టింది. పాలుత్రాగి గ్లాసు సావిత్రికిస్తూ, 'సావిత్రీ' అని ముఖంలోకి చూస్తూ పిలిచేడు రాజారావు. 'ఏమండీ' అన్నట్టు చూసింది సావిత్రి.

"నీ అందం శుక్లపక్ష చంద్రుడిలాగ దినదినాభివృద్ధి పొందుతున్నదే" అన్న రాజారావు మాటలకు ఉబ్బి తబ్బిబ్బయిపోయింది సావిత్రి. ఆ సమయంలో తాను స్వర్గంలో విహరిస్తున్నానా అన్నంత ఆనందం పొందింది.

సంతోష సాగరంలో యీదులాడుతున్న మనస్సుని కూడగట్టుకుని చిరునవ్వు నవ్వుతూ "యీ అందమంతా మీకోసమేగా దాచి పెట్టేను" అని తల దించుకుని సిగ్గుతో క్రీగంట చూసింది రాజారావుని.

"నిజంగా నాకోసమే దాచేనంటావా? అయితే బాగ లేదు" అంటూ గదిలోకి వెళ్ళిపోయేడు రాజారావు.

రాజారావు అన్నమాట వినిపించినా కొంతసేపటివరకూ దాని అర్థం ఆమెకు స్ఫురించలేదు.

సావిత్రి నిరుత్సాహంతో క్రుంగిపోయింది. స్త్రీలకి ఆగ్రహం వచ్చినా, అనుగ్రహం వచ్చినా, అంతే! అంతలోనే పొంగిపోతారు, అంతలోనే క్రుంగిపోతారు. బరువెక్కిన హృదయంతో వెళ్ళి పడుకుంది.

మరునాడు సాయంత్రం సావిత్రి తనకిష్టమయిన కనకాంబరం చీర కట్టుకుని, వాలు జడ వేసుకున్నది. వీధిలో పోసి పెంచుతున్న కనకాంబరం పూలూ, మల్లెమొగ్గలూ ఏరి తెచ్చి, దండగుచ్చి తలలో పెట్టుకున్నది. అద్దం దగ్గర నిలబడి చూసుకుంది అందం. పెళ్లయిన తర్వాతకంటే యిప్పుడే ఎక్కువ అందంగా ఉన్నట్టు తోచింది.

భర్తవచ్చిన సడి విని కాఫీ ఫ్లాస్కు తెచ్చి గ్లాసులోపోసి రాజారావు గదిలో టేబిలుమీద పెట్టి, బూటు విప్పుతున్నది.

"సావిత్రీ సినీమా కెళ్దామా" అన్నాడు రాజారావు.

"ఏ సినీమా బాగుంది?" సావిత్రి ప్రశ్నించింది.

"బాగున్న సినీమాకే తీసుకెడతాలే! అందులో ఫ్యాషన్లన్నీ ఆచరణలో పెట్టాలి సుమా! ఇప్పటి నీ వేషం ఏ సినిమాలోదో నాకు జ్ఞాపకం లేదు. ఎందులోది సావిత్రీ?"

సావిత్రికి కళ్లనీళ్ళ పర్యంతం అయింది. సినీమాకి వెళ్దామన్న సరదా అంతా మటుమాయమయింది. సినీమాకి తీసుకెళ్లమంటే నిన్న విసుక్కున్న మనిషి, యీరోజు తనంతట తనే సినీమాకి తీసుకెళ్తాననడం, తననిలాగ సూటిమాటలాడి నొప్పించడం కోసమా? పువ్వులు ముడిచి జడ వేసుకోకుండా శుభ్రమైన చీరయినా కట్టుకోకుండా కూర్చుంటే, 'దిష్టిబొమ్మలా ఎదురుగా కూర్చున్నావ్. చీరయినా మంచిది కట్టుకోకూడదా' అంటారు. చీరకట్టి సింగారించుకుంటే 'సానిదానిలా ఏమిటీ సింగారం' అంటారు. ఇంకెలాగ? జడ వేసి పువ్వులు ముడవకుండా, చీరమార్చి కట్టుకోకుండా ఏ పుణ్యస్త్రీ ఉంటుంది?

సావిత్రికి అక్కడుండడానికి మనసవలేదు. లేచి కళ్లు తుడుచుకుంటూ వంటింట్లోకి వెళ్ళిపోయింది. రాజారావు బట్టలు మార్చుకుని వంటింట్లోకి వచ్చి, "సావిత్రీ మరేం బాధపడకు! సరదాకి అన్నాను. రెండో ఆటకి వెళ్దాం లే. రెడీగా ఉండు" అన్నాడు.

"అక్కరలేదు. మీరు వెళ్ళిరండి! మీరు చూసివచ్చేక ఏ ఏ ఫేషన్లు అచరించాలో చెప్తే అవే ఆదరణలో పెడతాను!" విసురుగా ముఖం అటు తిప్పింది సావిత్రి.

"అయితే పోనీ" అంటూ రాజారావు వీధిలోకి వెళ్ళిపోయేడు.

ఒకనాడు సాయంత్రం రాజారావు ఒక స్నేహితుడిని వెంటబెట్టుకుని వచ్చేడు. పై వ్యక్తిరాక సావిత్రి గమనించలేదు. వాళ్లకి ముందుకు వేసుకుని వయ్యారంగా కాఫీ తీసుకెళ్ళి టేబిలుమీదుంచి, కొత్త వ్యక్తిని చూసి లోపలికి వెళ్ళిపోయింది. ఆ వ్యక్తి వెళ్ళిపోయేడు. రాత్రి ఎనిమిదైనా రాజారావు భోజనానికి రాలేదు. యీజీ ఛైర్‌లో నడుము వాల్చి ఏదో ఆలోచిస్తున్నాడు. సావిత్రి వెళ్ళి భోజనానికి రమ్మని పిలిచింది. రాజారావు ముభావంగానే భోజనం చేస్తున్నాడు. నిశ్శబ్దం తాండవమాడుతున్నది.

"ఇంతవరకూ భోజనానికి రాలేదేమండీ?" అని ప్రశ్నించింది రాజారావుని.

రాజారావు ఏమీ మాట్లాడలేదు.

"ఇందాక వచ్చిన అతను ఎవరండీ?" అతను వచ్చి వెళ్ళిన దగ్గర్నుంచీ రాజారావు అలా వుండడానికి కారణం తెలుసుకోవాలని అడిగింది.

"ఫుల్ యాడ్రసు కావాలా" తీక్షణంగా చూసేడు.

"అతని యాడ్రసు నాకెందుకు?" దిక్కొచ్చి ఉత్తరదక్షిణాలని చూపించినట్టు, సావిత్రి ముఖం ఆశ్చర్యం, అనుమానం సూచించింది.

"ఏమైనా భోగట్టాలు ఉత్తరం రాసి తెల్సుకోడానికి!"

"ఏమిటండీ మీ అర్థంలేని మాటలు? అతనెవరు? నేనెవర్ని? అతనికి ఉత్తరాలు నేనెందుకు రాయాలి?" దుఃఖం కోపంతో కలిసి, సావిత్రి గొంతుక వణుకుతున్నది.

"నావి అర్థంలేని మాటలు నీవి అర్థంలేని పనులూ. సరిపోయిందిగా" రాజారావు కోపంగా చూసేడు.

"అర్థంలేని పనులు నేనేమిటి చేసేను"

"జ్ఞాపకం తెచ్చుకో" భారమంతా ఆమెమీదే వదిలేసేడు రాజారావు!

"నాకు జ్ఞాపకం లేదు! చేసిన పొరపాటేదో చెప్పండి." రెట్టించింది సావిత్రి.

"నీకు తెలియదేం? క్రొత్తవ్యక్తి ఉన్నాడనైనా ఆలోచించకుండా గదిలోకెందుకు వచ్చేవ్" రభసకి కారణం తేల్చేడు రాజారావు.

"అతనురావడం నేను చూడలేదు. లేకపోతే ఎందుకంత స్వతంత్రంగా గదిలో చొరబడతాను?" సావిత్రి పైట చెంగుతో కన్నీరొత్తుకుంది.

"నేను రావడంచూసిన దానిని అతను రావడమే చూడలేదన్న మాట బహుశా నీ అందచందాలు, సినిమా ఫేషన్లూ చూపించడానికేమో లే!" సూటిగా అన్నాడు.

"నా అందం మీకే కన్పించడం లేదు. పైవాళ్ళకేం కన్పిస్తుంది?" పౌరుషం ఉట్టిపడ్డది సావిత్రి మాటల్లో!

"నీ ఫేషన్లుచూసి అందరూ సువ్వోక సినిమాస్టారువనుకోవాలనా?" గర్జించేడు రాజారావు.

"సినిమాస్టారులే గాని ఆడవాళ్ళెవరూ శుభ్రమైనచీర కట్టుకుని సింగారించుకోకూడదా? మగవాళ్లు ఏ సినిమాచూస్తే ఆ సినిమా ఫేషన్లతో బీచిల్లోనూ, పార్కుల్లోనూ ఆడాళ్ళ వెంట తిరిగొచ్చును. ఆడాళ్లు మాత్రం సింగారించుకుని ఇంట్లో కూర్చున్నా తప్పే! మొత్తనివారిని చూస్తే మొత్తబుద్ధేస్తుందిట! ఏదో అనుమానం మనసులో పెట్టుకుని క్రుంగి కృశించిపోతూ, నిష్ఠురంమాటలాడి ఎదటివాళ్ల మనసు నొప్పించకండి" మనసు బాగా దెబ్బతిన్నమీదట వీరావేశంతో ఏవేవో అనేసింది సావిత్రి.

"నీ యిష్టంవచ్చినట్టూ చెయ్యి" అంటూ అన్నం పూర్తిగా తినకుండా అన్నంలోనే చెయ్యికడుక్కుని లేచిపోయేడు. సావిత్రికి ఆ సమయంలో అతన్ని ఆపడానికి కూడా మనసొప్పలేదు. అప్పుడే గోడగడియారం తొమ్మిదిగంటలు కొడుతున్నది. వరసగా పదిగంటలు కొట్టేసరికి, రాజారావు గదిలోంచి కుర్చీ తిరగబడిన చప్పుడయింది. ఆ చప్పుడులో మిగిలిన రెండుగంటలూ లీనమైపోయేయి!

అంతవరకూ ఆగి ఆగి వస్తున్న దుఃఖం కట్ట తెంచుకునివచ్చి విజృంభించింది. ఈ గొడవకి నిద్రపోతున్న సీత లేచి వంటింట్లోకి వచ్చింది. పాపం! దానికేం తెలుస్తాయి పెళ్ళి పోట్లాటలు! తల్లి ఏడవడంచూసి తనుకూడా ఏడుపు లంకించుకుంది. సీతను ఓదారుస్తూ దుఃఖభారం తగ్గేక లేచి పడుకోబెట్టింది. తనూ ఆప్రక్కనే పడుకుంది. కన్నులు మూసుకున్నదేగాని నిద్రపట్టలేదు. ఏవేవో ఆలోచనలు గాలి దుమారంలాగ లేగి అంతరించిపోతున్నాయి.

ఏదో చప్పుడైతే కన్నువిప్పి చూసింది సావిత్రి. రాజారావు మంచంప్రక్క నిలబడి ఉన్నాడు. ఎంతసేపై అలాగ నిలబడి ఉన్నాడో? గభాలున మంచందిగి "పాలు కావాలా! మర్చిపోయేను" అంటూ వంటింట్లోకి వెళ్లింది. రాజారావు తిన్నగా తన మంచం దగ్గరికిపోయి కూర్చున్నాడు. సావిత్రి పాలగ్లాసు తెచ్చి రాజారావుకి అందించింది. రాజారావు ఆ గ్లాసుతోపాటు సావిత్రి వ్రేళ్లని పట్టుకుని దగ్గరకు లాగేడు.

"చాల్లెండి పాలుత్రాగండి" అంటూ దూరంగా తప్పుకున్నది సావిత్రి.

★ కనకాంబరాలు ★

రాజారావు పాలగ్లాసు టేబిలుమీద ఉంచి "సావిత్రీ పాలు నువ్వుకూడా త్రాగాలి లేకపోతే నేనూ త్రాగను' అంటూ మంచం దిగి సావిత్రి చెయ్యిపట్టుకుని తీసుకొచ్చేడు

"చాల్లెండి సరసం! రోజూ నేను త్రాగితే నేగాని త్రాగేవారుకారు గాబోలు పాలు?" అంటూ ముఖం పక్కకి తిప్పేసింది సావిత్రి

"నామీద కోపమా సావిత్రీ' ప్రతిమాలే ధోరణిలో మాట్లాడేడు రాజారావు

"మీమీద నాకెందుకు కోపం? కోపతాపాలు మగాళ్లు చెల్లింపుకుంటారుగాని, ఆడాళ్ళకెం చెల్లుతాయి!" అక్కసు వెళ్ళబోసింది సావిత్రి

"సమయం సందర్భం కనిపెట్టి మీరూ కోపతాపాలు చెల్లించుకుంటారు' రాజారావు సమర్థిస్తూ, సావిత్రిని మంచంమీద కూర్చోబెట్టి పాలు మిగిల్చి యిచ్చేడు

"మీరు మాత్రం తక్కువవాళ్లేంటి? అవసరాలను బట్టి ఆగ్రహం, అనుగ్రహం చూపిస్తారు"

"ఎల్లలు పడుకున్నారా" అన్నాడు రాజారావు ధోరణి మార్చే ఉద్దేశంతో

"ఆ" అని సమాధానమిచ్చి "ఉండండి ఇప్పుడే వస్తాను" అంటూ లేచింది "ఇప్పుడెక్కడికి' అన్నాడు రాజారావు ఆత్రంగా!

"యీ మడతచీర వదిలేసి పాతచీర కట్టుకొస్తాను మనకి యీ సింగారాలూ, ఫేషన్లూ ఎందుకు? ఎవర్ని ఆకర్షించాలి గనక? సినిమా స్టార్‌లా ఫేషన్లెందుకు?" సావిత్రి మాటలు రాజారావు గుండెల్లో నాటిపోయాయి

మెల్లిగా తేరుకుని సావిత్రి దగ్గరికెళ్ళి గుంపట్టుకొని "ఏదో అన్నాను ఆమాత్రం అనకుండా ఉంటే యీ మహంకాళీ స్వరూపం భర్తను అమాంతంగా మింగేయదూ?" అంటూ మంచందగ్గరికి తీసుకొచ్చేడు

"అయితే ఆ కాళీస్వరూపాన్ని చివాట్లతో నా పూజచెయ్యకేం' అంటూ రాజారావు వక్షానికి తల ఆనించింది

సమాధానంగా రాజారావు చిరునవ్వు నవ్వేడు

"ఆడది అలంకరించుకుంటే తప్పేమిటి? సినిమా ఫేషన్ల సింగారం అంతా, ఆ పిచ్చిలోకి పోతున్న మీ మనస్సు యిటులాగి, రంజింపజేసి నేను ఆనందించడానికే గదా! సింగారించుకుని వంటరిగా షికార్లు తిరిగితే తప్పే! మీతో కలిసి నేను షికారుకి వెళ్ళినంతలో తప్పేమిటి? మీ మనస్సుకి కొత్త ఆకర్షణలను చూపి ఆనందించడానికే గాని, ఇంకెవర్ని ఆకర్షించడానికి కాదే!" సూటిగా అడిగింది రాజారావుని

రాజారావు ఏమీ మాట్లాడలేకపోయేడు అయినా తన సిద్ధాంతాన్ని విపులీకరిస్తూ, "ఆమాత్రం అదుపాజ్ఞలలో ఉంచాలిలే' అన్నాడు

ఆ తర్వాత రాజారావు ఫేషన్ల విషయం ఎప్పుడూ ఎత్తలేదు సూటిపోటి మాటలాడడంకూడా చాలావరకూ తగ్గించేడనే చెప్పొచ్చు 'అనుమానం పెనుభూతం' అన్నట్టు ఆ అనుమానంమాత్రం వదల్లేదు తను వచ్చేసరికి వీధిగుమ్మంలో నుంచున్నా పక్కింటికి వెళ్ళినా అనుమానించి దెబ్బలాడేవాడు యీ అనుమానపిశాచిని వదిలించడానికి ఎన్నో ప్రయత్నాలు చేసింది సావిత్రి

ఒకనాడు సావిత్రి ఏమీతోచక పక్కింటికి వెళ్లి బాతాఖానీవేసింది ఆసందడిలో ఎంత టైము అయిందో గుర్తులేదు అయిదు గంటలకి భర్త వచ్చే వేళయిందని ఆవిడతో చెప్పి ఎల్లల్ని తీసుకుని గబగబా యింటికి వచ్చింది రాజారావు వీధి అరుగుమీద పచార్లు చేస్తున్నాడు

"ఎంతసేపైవచ్చేరండీ అంటూ తలుపు తీసింది రాజారావు లోపలికివెళ్తూ" ఎక్కడికెళ్లేవ్"అని గద్దించేడు

మాట్లాడకుండా లోపలికెళ్లి కాఫీ తెచ్చి ఇస్తూ "ప్రతీ చిన్న విషయాని మీకా అనుమానం వదిలిందికాదు ఆడది యింట్లో పొద్దు పొడిచిన దగ్గర్నుంచి పొద్దుపోయేవరకూ వంటరిగా కూర్చోగలదా? కాలక్షేపానికి ఏ ఇరుగమ్మతోనో పొరుగమ్మతో మాట్లాడితే తప్పా? పక్కింటిఆవిడరమ్మని పిల్చింది వెళ్లకపోతేబాగుంటుందా? వెళ్లినతర్వాత ఆ మాటా యీమాటా ఆడుకుని రావాలా? వాళ్ల మగాళ్లున్నప్పుడు ఆవిడ నన్ను రమ్మంటుందా? రమ్మంటే నేను వెళ్తానా? దీనికి అనుమానం ఎందుకు చెప్పండీ' అన్నది సావిత్రి

"యీవేళ పక్కింటి ఆవిడ రమ్మన్నదని వెళ్తావ్ రేపుపక్కింటిఆయన రమ్మన్నాడంటావ్" రాజారావు మాటలకి "రామరామ ఏం మాటలండీ' అని నోరు నొక్కుకుంది సావిత్రి

అనుమానం అనేది ఒకరకమైన జబ్బు ఇది లోపలే మనిషిని కాల్చేస్తుంది ఆ అనుమానం వదిలేదాకా అగ్నిమీదున్నట్టుంది కల్లుతాగిన వ్యక్తితో మాట్లాడితే ఏం ప్రయోజనమో యీ రకపు వ్యక్తులతో మాట్లాడినా అదే ప్రయోజనం మూడవ వారం టైఫాయిడ్ నడుస్తున్న వ్యక్తిమాటల్లో ఎంత అర్థముంటుంది

తన భర్త మాటల్ని పట్టించుకోడం పొరపాటే! ఆ వేడి తగ్గేక యీ పిశాచాన్ని పారద్రోలాలని నిశ్చయించుకుంది సావిత్రి

రాజారావు డ్రస్సు మార్చుకుని ముఖం కడుక్కుని కుర్చీలో కూర్చున్నాక పక్కనే నిలబడి "నామీద మీకెందుకా అనుమానం, అనుమానం మనిషి ఆలోచనాశక్తిని అంతరింపజేసి, పట్టుకున్న వ్యక్తిని కూడా దహించేస్తుంది" సావిత్రి సాదరంగా అన్నది

"ఎదుటి వ్యక్తిచేసే చేష్టల్నిబట్టి నడిచే నడతనిబట్టి యీ అనుమానం పుడుతుంది" రాజారావు సమాధానం యిచ్చేడు

"యింతకుముందు ఏస్త్రీవల్లనైనా మోసపోయారా'

"డిటెక్టివ్‌లాగ క్రాస్ ఎగ్జామిన్ చేస్తున్నావేమిటి?' రాజారావు చిన్న నవ్వు నవ్వేడు

ఆ నవ్వులో 'నువ్వు బాగ గ్రహించేవ్' అన్న భావం గోచరించింది

వెంటనే సావిత్రి "ఒక వ్యక్తి లంచగొండి అయితే దేశమంతా లంచగొండిలని అంటారా?" అన్నది

రాజారావు ఏమీ మాట్లాడలేదు

"చెప్పండీ అని రెట్టించి ఆఖరికి రాజారావు చేత నిజమేనన్నట్టు తల వూపించింది

"అదుపాజ్ఞల్లో పెట్టి ఎటూ తిరక్కుండా స్త్రీని నిర్బంధించినప్పుడు ఆమె కెదురు క్రోధన పట్టడానికి ఆస్కారం ఉంది ఇవ్వవలసిన స్వాతంత్ర్యము ఇస్తే ఎన్నడూ బాధ లేదు'

రాజారావు వింటున్నాడు

"రోడ్డంట మీరు పోతుంటే అనేక రిక్షాలు ఎదురౌతాయి మీరు వాటన్నిటిని నిదానించి చూస్తారా ఎటువంటి ఆడాళ్లున్నా?'

తల అడ్డంగా తిప్పేడు రాజారావు లేదనే అర్థంతో

"అదే చుట్టూ తెరకప్పిపోయే రిక్షా అయితే అందరి దృష్టీ ఆ రిక్షామీదే పడుతుంది అందులో ఎంత అందమైన యువతున్నదో చూద్దామనే ఆత్రుత'

నిజమే ననిపించింది రాజారావుకి కథ చెపుతుంటే "ఊ" కొట్టినట్టు వింటున్నాడు

"ఆజ్ఞలో ఉంచినన్నాళ్లూ దానికి వ్యతిరేకమైన భావాలు పుడతాయి! మనిషిని ఎటూ పోకుండా నిర్బంధించి గదిలో తాళం వెయ్యగలరుగాని, మనస్సుని కట్టిపెటలేరుగా! మనస్సు ఎన్నివిధాలుగా వ్యవహరిస్తే మీరేం చెయ్యగలరు?

"మీరు ఆఫీసుకి ఎన్నిగంటలికి వెళ్తారు?'

సావిత్రి ప్రశ్న రాజారావుకి ఆశ్చర్యం కలిగించింది ఇంతసేపూ మాట్లాడిన ధోరణి ఇలా మారినందుకు కారణమేమిటో బోధపడలేదు రాజారావుకి "పదిగంటలకి"

"ఎన్నిగంటలకి తిరిగివస్తారు?"

(48-వ పేజీ చూడండి)

బొమ్మరిల్లు

చందమామ కథ

నండూరి రామమోహనరావు

చందమామ యని
చందురు నందరు
ఎందుల కందురో
ఎరుగుదురోయీ?

అమృతము కొరకై
అమరులు అసురులు
క్షీరసముద్రము
చిలికి రొకప్పుడు

పాలకడలి నొక
పాలకడవగా,
మందర మనుగిరి
మంథానముగా,
త్రాడై వాసుకి
తోడై రాగా,
హరి తాబేలై
గిరిని మోయగా
త్వరచిరి తరచిరి
దనుజులు దివిజులు
తరచబడిన సా
గరము కడుపులో
కోలాహలముగ
హాలాహలమను
విషము జనించెను
బుస బుస పొంగుచు
హరుడా హాలా
హలమును గ్రోలెను

దేవ దానవులు
తిరిగి మథించిరి

అంత జనించెను
ఐరావతమూ,
ఉచ్చైశ్శ్రవమను
ఉత్తమాశ్వమూ,
కల్పవృక్షమూ,
కామధేనువూ,
లచ్చి, చంద్రుడు,
అచ్చర కన్నెలు
అంతమునందున
అమృతము పుట్టెను

అమరులు గైకొని
రమృత భాండమును
సిరిని భార్యగా
హరి గైకొనియెను
శివుడు హిమాంశుని
శిరమున దాల్చెను

సాగరమందున
జన్మించుటచే
సోముడు లక్ష్మికి
సోదరు డయ్యెను
జనులందరికిని
జనని లక్ష్మియగు
జనని సోదరుడు
మనకు మామయగు,

నందుచేత నే
అందరు అందురు
చలువలరాయని
చందమామయని

దాచిన ధనం

జి. సాంబశివరావు

ఒక రాజు ధనాన్ని, వస్తు నిచయాన్ని తనకు కావలసిన అవసరాలకంటే ఎక్కువగా ప్రోగు చేసుకొని, తనకు కొంచెం విశ్రాంతి చిక్కినతర్వాత అనుభవించవచ్చునని ఆలోచనలు చేశాడు. ధనం లేకపోతే సుఖం లేదు. సుఖం ఆనందానికి మార్గం. అందువల్ల ఆనందంగా జీవితాన్ని వెళ్లబుచ్చాలన్నా, సుఖాలను పొందాలన్నా, ధనం తప్పకుండా ఉండాలని ఆ రాజు మతం. ఈ డబ్బును జాగ్రత్తగా దాచుకోవాలి గా[illegible]ట్టి, అందరు రాజులు కట్టేవిధంగానే అందమైన మేడలను నిర్మించుకుంటూ, అందులో ఎన్నో కీలుకులు, ఎన్నో ఘాయలు ఏర్పాటయ్యేటట్లు చూశాడు. ఆ తర్వాత దాన్ని కాచేందుకు భవనరక్షకులను, ద్వారరక్షకులను, సైన్యాన్ని నియమించాడు.

ఒక రోజున ఆ రాజు తన వంటవాళ్లను పిలిచి, ఒక పెద్దవిందుకు మంచి, మంచి వంటకాలు అన్నిటి తయారు చేయమని ఆజ్ఞాపించాడు. వాళ్లు విందుకు అంతా సిద్ధం చేశారు.

ఈ విందులో రాజు ఒక పెద్ద పీటమీద కూర్చున్నాడు. ఇటూ, అటూ చుట్టాలు పక్కాలు కూర్చున్నారు. రాజు వారితో ఇట్లా అన్నాడు: "నేను ఎట్లాగో ఇంత డబ్బు ప్రోగు చేశాను. ఇక ఇవ్వాళ్లనుంచి దీన్ని అనుభవించడానికి ముహూర్తం పెట్టాను. అందుకే ఈ విందు. జీవితంలో ఇప్పుడు విశ్రాంతి చిక్కింది! హాయిగా ఈ ధనంతో సుఖాన్ని అనుభవిస్తూ గడిపేస్తాను!"

రాజు మాట ఇంకా పూర్తికాకముందే కోట సింహద్వారాన్ని ఎవరో తట్టినట్లు అయింది. ఆ తట్టిన తట్టు మామూలుగా లేదు. రాజుగారి భవనం అంతా కదిలిపోయింది. రాజుగారి సింహాసనం వణికింది. రాజసేవకులు భయపడి, వచ్చింది ఎవరో చూద్దామని సింహద్వారం



చిట్టి - బొట్టూ

ఆంధ్రపత్రిక

సచిత్ర వారపత్రిక.

బాల బాలికా పాఠకులకు

క్రొత్త సీరియల్

స్కార్లెట్ పింపర్నల్

మూలం: బారనెస్ ఆర్క్‌జీ

అనువాదం: ము. వీరభద్రశాస్త్రి

"ఇక్కడ ఉన్నాడిడుగో" అనుకొని,
"అక్కడ ఉంటాడడుగో" అనుకొని,
ఎక్కడపడితే అక్కడ వెతికాం—
ఎవడా స్కార్లెట్ పింపర్నల్?

మబ్బుల్లోనుంచేమైనా ఊడిపడ్డాడా?
భూమిలోనుంచేమైనా పుట్టుకు వచ్చాడా??
మనిషా? భూతమా? ఈ స్కార్లెట్ ఎంపర్నల్!!

ఫ్రెంచి విప్లవకాలంలో విప్లవకారులవలన మరణశిక్ష విధింపబడిన ప్రభువులను మృత్యుముఖంనుంచి తప్పించటానికి దీక్షవహించి ఫ్రెంచి విప్లవనాయకసంఘంవారి కన్నుగప్పి, భయ సంభ్రమాశ్చర్యాలలో ముంచిన సాహసిక యువకుని అద్భుతగాథ

బారనెస్ ఆర్క్‌జీ రచించిన ఈ సుప్రసిద్ధ ఆంగ్ల నవల అనువాదాన్ని పైవారంనుంచి మా పాఠకులకు సీరియల్‌గా అందజెయ్యగలుగుతున్నందుకు సంతోషిస్తున్నాము అడుగడుగునా అద్భుతంకొలిపే ఈ సీరియల్ నవలను మా పాఠకులు తప్పక అభిమానిస్తారని ఆశిస్తాము

—సంపాదకుడు

తెరిచారు అక్కడవారికి ఒక బిచ్చగాడు కన్పించాడు

2

ఆ వచ్చింది బిచ్చగాడానో, కాదో తెలియదు కాని వాడు కట్టుకున్న బట్టలన్నీ చిరిగిఉన్నాయి కంఠంనుంచి ఒక జోలీ వేళ్ళాడుతోంది

రాజుగారి సేవకులు వాణ్ణిచూచి గుండె నిబ్బరం చేసుకున్నారు చేసుకొని "ఒరేయ్ ఫో! ఇక్కడ నీకు తేరగా తిండిపెట్టేవాళ్లు ఎవ్వరు

లేరు. ఇట్లాగుటరా, రాజుగారి యింటికి భిక్షానికివచ్చేది? అదీకాక ఇదేం వేళ అని వచ్చావు? అయినా ఉండు, రాజుగారి భోజనం అవుతోంది, తిన్న తర్వాత మిగిలింది ఏమన్నా ఉంటే పెడతాం" అన్నారు.

వాడు అదంతా వినిపించుకోకుండా, "అరే! అబ్బాయిలు! మీ రాజుదగ్గరకు వెళ్ళి నేను వచ్చానని చెప్పి, బయిటికి రమ్మనండి. ఆయనతో నాకు జరూరు పనిఉంది" అన్నాడు.

"ఓరి! వెధవా! తిరిపెం ఎత్తితేనే గాని పొట్టగడవదు! రాజుగారినే నీ దగ్గరకు రమ్మంటావుటరా! నీకు పిచ్చిఅల్లే ఉంది."

బిచ్చగాడు సేవకులవంక అదో విధంగా చూచి ఇట్లా అన్నాడు: "ఒరే! అబ్బాయిలూ! నేనెవణ్ణయితే మీకెందుకు? మీ రాజుదగ్గరకు వెళ్ళండి. నేను రమ్మన్నానని చెప్పండి."

వాడి ఈ ధీమాను రాజుగారి సేవకులు భరించలేక పోయినారు. వాళ్లకు కోపం వచ్చింది. "వీడికి ఒక్క పిచ్చే కాదు, మదంగూడా ఉంది. వదులుద్దాం రండి" అనుకుంటూ కత్తులు, కఠారులు దూసి వాడిమీదకు దూకబోయారు. కాని వాడు వీరిని అట్లా దూకనియ్యలేదు. ఈ దూకుదామన్న ఆలోచన వారికి వచ్చి రాకముందే, కళ్లు ఎఱ్ఱజేసి, కంఠం పెద్దదిజేసి "ఆగండి" అని గదమాయించాడు. ఆ కంఠం అదేం కఠం! ఆ కళ్లు అవేం కళ్లు!! వాళ్ళకు భయంవేసింది. అప్పుడు వాడు "సరే!! ఇప్పుడు లోపలకు వెళ్ళి మీ రాజుకు నేను వచ్చానని చెప్పండి" అన్నాడు. వాళ్లు కుక్కిన పేనుల్లాగా లోపలకు వెళ్లారు.

రాజుగారు బంధువులతో కబుర్లు కొడుతూ భోజనం చేస్తున్నాడు. ఆ కబుర్లలో ఆయనకు ఈ కోట కదలడం, సింహాసనం అదరడం ఏమీ కన్పించలేదు. ఇంతలో సేవకులు వచ్చారు. "మహారాజా! ఎవరో భిక్షుగాడు వచ్చి, వాకిట్లో నిలబడి మిమ్మల్ని రమ్మంటున్నాడు. మీరు వస్తేనేగాని కదలట్ట" అని విన్నవించారు. రాజు ఉగ్రుడైనాడు. "ఎవడురా వాడు! నాలుగు తన్ని పంపించండి." అని పురమాయించాడు. సేవకులు రాజు సన్నిధానంనుంచి బయటికి వచ్చి, మరి కొంతమంది సేవకులను వెంటపెట్టుకొని సింహద్వారందగ్గరకు బయలుదేరారు. వీళ్లు ఈ బయలుదేరేలోపలే ఆ మనిషి ఇంకోసారి తలుపుతట్టాడు.

ఇది మరీ భయంకరంగా ఉంది. కోట అంతా ఒక్కసారిగా దద్దరిల్లిపోయింది. రాజుగారి భవనంలో ఎక్కడి సామాను అక్కడ తల్లక్రిందులయింది. సేవకులు అదిరిపోయారు. కాని రాజుగారు చెప్పిన పని చేయక తప్పదాయెను. ఆ సేవకులంతా ఒక్క ఉమ్మడిగా బయలుదేరివచ్చి ఆ భిక్షుగాడిమీద పడబోయారు. వాడు భయంకరంగా మళ్లీ ఒక్క ఉరుము ఉరిమాడు. సేవకులంతా నిశ్చేష్టులయి నిలబడ్డారు. అప్పుడు ఆ భిక్షుగాడు అన్నాడు: "ఒరే! అబ్బాయిలు! మీ రాజుకి, మీకూ కళ్లు కనిపించడంలేదు. ఆ కళ్లు తెరుస్తా. మీ రాజుదగ్గరకు వెళ్లండి. నా మాటలుగా ఇట్లా చెప్పండి. ఈ వచ్చిన వాడు మృత్యుదేవత. మిమ్మల్ని రమ్మంటున్నాడు అనండి. ఇక వెళ్లండి."

ఆ వచ్చినవాడు తాను మృత్యుదేవతనని చెప్పగానే రాజుగారి సేవకుల ప్రాణాలు పైనే ఎగిరిపోయినాయి. వాళ్లు వెంటనే రాజుదగ్గరకు పరుగెత్తారు.

"మహారాజా! ఆ వచ్చినవాడు మృత్యుదేవతట! మిమ్మల్ని వచ్చెయ్యమంటున్నాడు. ఇప్పుడు మరి ఏమి సెలవు?"

సేవకులు ఈమాటలు వణికిపోతూ చెప్పారు.

"అట్లాగా! మృత్యుదేవత వచ్చాడేం! సరే! నన్ను వదిలిపెట్టి నా బదులు ఇంకొణ్ణి తీసుకువెళ్ళమని చెప్పండి."

రాజు ఈ మాటలు మహా తాపీగా అన్నాడు.

రాజు సేవకులకు ఇప్పుడు మహాకష్టం ఏర్పడింది. అక్కడేమో మృత్యుదేవత. ఏమి చెప్పినాఉరుముతాడు. ఇక్కడేమో రాజు తన డబ్బునుగూర్చి గొప్పలు చెప్పుకుంటూ చుట్టాలతో కూర్చుని తాపీగా ఇట్లా పురమాయిస్తూ ఉంటాడు. ముందుకుపోతే గొయ్యి, వెనక్కిపోతే నుయ్యి. వాళ్లు రాజుగారు చెప్పిన మాటలను మృత్యువుకు చెప్పారు.

మృత్యుదేవతకు కోపం వచ్చింది. "మీ రాజు వట్టి మందమతిలాగా ఉన్నాడే. నేను తన కోసం వస్తే ఇంకొకళ్లను ఎట్లా తీసుకుపోతాను? రాజునే తీసుకుపోతాను. మీరు వెళ్లి మీ రాజుకు చెప్పండి."

సేవకులు మళ్లీ రాజుదగ్గరకు వచ్చారు. "మహారాజా! ఆ

ృత్యువు మిమ్మల్నేగాని ఇంకో ను తీసుకు వెళ్లట్ట. ఆమాట ెప్పమన్నాడు" అని రాజుతో ెప్పారు.

రాజు వాళ్లమీద కస్సుమని ేచాడు. "ఇంత డబ్బు, ఇంత ంపద ప్రోగుచేశానుగదా! దీన్ని నుభవించ నియ్యకుండా ఎట్లా ీసుకుపోతాడురా ఈ మృత్యువు న్ను? పొండి! నేను రానన్నా ని చెప్పండి" అంటూ వాళ్లను న్నినంత పని చేశాడు.

సేవకులు మళ్లీ మృత్యుదేవత ుంచున్న చోటికి వచ్చారు. ఆ దేవత అట్లాగే అక్కడేకదలకుండా స్థాణువులాగా భయంకరంగా నుంచున్నాడు. వాళ్లు రాగానే 'మీ రాజు ఏమన్నాడు?"అని అడిగాడు. వాళ్లు రాజు అన్నమాట లన్నీ చెప్పారు.

అప్పుడు మృత్యుదేవత అన్నాడు: "ఈ రాజు నేను అనుకున్న దానికంటే మందమతి. ఇవ్వాళ్లే చావవలసిఉండగా చావనంటాడేమి! నేనే వస్తున్నాను లోపలికి పదండి. అక్కడినుంచి, అట్లాగే తీసుకుపోతాను."

సేవకులు వెనుకరాగా, మృత్యుదేవత రాజుదగ్గరకు బయలుదేరాడు. అప్పుడుగూడా రాజు చుట్టాలను కూర్చోపెట్టుకొని డబ్బు సొదా, సుఖసంపదల సొదా, చెబుతున్నాడు. మధ్య మధ్య మృత్యుదేవతను తిడుతూ "ఈ డబ్బంతా ప్రోగుచేశాను; అనుభవించకుండా చావమంటే ఎట్లా చస్తాను?" అని గునుస్తున్నాడు. ఇంతట్లో ముందు మృత్యుదేవత, వెనుక రాజుగారి సేవకులు చక్కా వచ్చారు.

రాజు ఆ వచ్చిన మనిషిని ఎగాదిగా చూసి, సేవకులను సంబోధించి "వీ డెవడు" అన్నాడు. వాళ్ళకు ఏమి చెప్పడానికి భయం వేసింది. అప్పుడు మృత్యుదేవత అన్నాడు: "ఇక ఈ సేవకులలో ఎవ్వరితోను నువ్వు మాట్లాడక్కర లేదు. నే నెవరినని వాళ్లను అడుగుతావేమి! మృత్యువు నెత్తిమీదకు వచ్చి, కొట్టబోతున్నా, ధనం యొక్క మదంచేత నీకు అర్థం కాకుండా ఉంది. నేను మృత్యుదేవతని; నిన్ను ఈ ధనాన్నుంచి, ఈ సిరినుంచి, ఈ సంపదనుంచి, ఈ చుట్టాలనుంచి, ఈ పక్కాలనుంచి, ఈ సుఖాలనుంచి, ఆనందాలనుంచి, దూరంచేసి వెయ్యడానికి వచ్చాను. నువ్వు ఇంతకాలం వీటిని ప్రోగు చెయ్యలేక చచ్చిపోయావు. ఇప్పుడు కాలం సమీపించి, ప్రోగు చేసి చచ్చిపోతున్నావు. తెలిసిందా!"

రాజుకు ఇప్పుడు నిజంగా భయంవేసింది. చుట్టాలవంక సేవకులవంకా చూచాడు. చివరికి మృత్యుదేవత ముఖం వంక చూచాడు. చుట్టాలు తాము ఏమీ చేయలేమన్నట్లు చూస్తున్నట్లు రాజుకు తోచింది. సేవకులు నువ్వు కాకపోతే, ఇంకోరాజు అంటున్నట్లు తోచింది. మృత్యువు తన్ను తీసుకు పోకుండా విడిచిపోడని తోచింది. అప్పుడు అతనికి దుఃఖం ముంచుకు వచ్చింది. ఇంత డబ్బు ఉండి ఇదేమి చేస్తుంది? రాజు గోలుగోలున ఏడ్చాడు. "ఛీ! పాడు డబ్బు. దీనికోసం నానా అవస్థలుపడ్డాను. చివరికి ఇది నన్ను మోసం చేస్తున్నది. మృత్యువు వస్తే, అడ్డం రాకుండాఉంది. బ్రతికినంతకాలం తనమీదే నా మనస్సు లగ్నం అయిఉండేట్లు చేసుకొని, ఇప్పుడు ఏడిపిస్తోంది. ఈ డబ్బుతో లాభం పొందుదాంగదా అని ఎన్నో గాలిమేడలు కట్టాను. అన్నీ ఇప్పుడు ఒక్క దెబ్బతో కూలిపోయినాయి. ఈడబ్బునుఎందుకుసంపాయించానా అని బాధగాఉంది. దీన్నంతా యీ విరోధులపాలబెట్టి వెళ్లవలసిందే గదా!"

రాజు వాపోవడం చూచి మృత్యుదేవత వికటంగా నవ్వాడు. రాజు చెవులకు అది భయంకరంగా ఉంది. అప్పుడు మృత్యువు రాజుతో అన్నాడు: "రాజా! నువ్వు ఏమిటో పిచ్చిమాటలు మాట్లాడుతున్నావు. ఆ పిచ్చితో డబ్బును తిడుతున్నావు. ఆ డబ్బును అడుగు, అది నిన్నేమంటుందో చూద్దాం."

రాజుకు డబ్బు మాట్లాడుతుందాఅనిపించింది. "మాట్లాడుతుందంటావా?"అని ఆత్రంగా మృత్యువును అడిగాడు. "ఆ! ఇవ్వాళ్లే నీకోసం మాట్లాడుతుంది. అది ఏమి చెబుతుందో విందాం" అన్నాడు మృత్యువు.

రాజు, మృత్యువు, రాజు సేవకులు అంతా రాజు డబ్బును దాచి ఉంచిన కొట్టుల్లోకి వెళ్లారు. ఆ కొట్టులు చీకటిగా ఉన్నాయి. గాలి లేదు. కిటికీలు లేవు. మనిషిని గనుక, అక్కడ ఒక్కరోజు ఉంచితే, చచ్చేటట్లుగా ఉన్నాయి. తలుపులు తాళాలు వేసి ఉన్నాయి రాజు ఎప్పుడూ తాళం చేతులను బొడ్డులో కట్టుకుంటాడు గాని, ఇంకో చోట పెట్టడు. వాటిని అప్పుడు బయటికి తీసి, తలుపులు తెరిచాడు. అక్కడ బయట కంటె చీకటిగా ఉంది.

రాజు లోపలకు వెడదా మను

కుంటుండగా లోపలినుంచి "ఆగు" అని వినిపించింది. రాజు హడిలిపోయినాడు. ఆగిపోయాడు. అప్పుడు మృత్యువు రాజును "ఆ డబ్బు మాట్లాడుతోంది విను"మన్నాడు. లోపల డబ్బు గలగల్లాడింది. ఆ గలగల్లాడటంగూడా, మృత్యువు నవ్వులాగా వికటంగా ఉంది. రాజు "వెధవ మ్రోత" అంటూ కసురుకున్నాడు. "ఆ! వెధవ మ్రోత! అట్లాగే అనిపిస్తుంది." అని లోపలనుంచి మాటలు రాజుకు వినిపించాయి. "ఇందాక నువ్వు నన్ను మృత్యువుముందు తిట్టిపోశావు. అది నాకు వినిపించదు అనుకున్నావు. ప్రాణం ఉంటేనేగా విన్పించేది; లేకపోతే విన్పించదని నీ భావం. నీ భావమే కాదు; నీవంటి మనుష్యుల అందరి భావం అదే. అందువల్ల తమ చేత కాని తనాన్ని నామీద పెట్టి తిడతారు." డబ్బు ఇట్లా మాట్లాడ్డం చూచి రాజు దద్దరిల్లిపోయాడు. నేలమీద కాలివేళ్లతో గీతలు గీస్తూ నుంచున్నాడు. అట్లా కొంచెంసేపు గీసి, తల పంకించి "అయితే ఏమంటావు?" అని ప్రశ్నించాడు.

ఆ ప్రశ్న విని, డబ్బు కోపంగా గలగల్లాడిపోయింది. "ఏమంటానా? నిన్ను నువ్వు తిట్టుకోమంటాను. చచ్చి నువ్వు మట్టైపోతావు. నేనూ చివరికి మట్టైపోతా. నువ్వు పుట్టిందిగూడా మట్టిలోంచే; నేనూ మట్టిలోనే పుట్టా. భగవంతుడు నువ్వు రాజువి కాబట్టి నన్ను ఇంతకీ నీ చేతిలో పెట్టాడు. నువ్వేం చేశావు? నన్ను ఈ గదుల్లో, ఈ గదుల్లోవున్న ఖోషాణాల్లో బంధించావు. రాజువి గాబట్టి జనానికి మంచిపనులు చేస్తావని దేవుడు నన్ను నీకు ఇచ్చాడు. ఆర్తులకు సహాయం చేస్తావని, రోగులకు ఔషధాలు చేకూరుస్తావని, అర్థులకు దానం చేస్తావని ఇచ్చాడు."

డబ్బు అన్న ఈ మాటలువిని, రాజు వెటకారంగా "ఇంకా ఎందుకు ఇచ్చాడు?" అన్నాడు. డబ్బు ఇట్లా సమాధానం చెప్పింది. "ఇంకా ఎందుకు ఇచ్చాడంటావా? దేవాలయాలు కట్టిస్తావని, ఆస్పత్రులు పెట్టిస్తావని, వంతెనలు కట్టి రోడ్లు వెయ్యిస్తావని, కాలవలు త్రవ్విస్తావని, ఇట్లా ప్రజలకు మేలు చేస్తూ, పుణ్యం సంపాయించుకుంటావని ఇచ్చాడు. కాని నువ్వు అట్లా చెయ్యక నన్ను ఈ కొట్లలో బంధించి అట్టి పెట్టావు. నీ కోర్కెలు, నీ షోకులు, ఏమన్నా ఉంటే, వాటికోసం ఖర్చుపెట్టావు. అట్లా ఖర్చుపెట్టుకుంటూ గూడా కృతఘ్నుడిలాగా మాట్లాడావు. నన్ను పాడుచేసి, నువ్వు పాడైనావు. ఇప్పుడు మృత్యువు వస్తే, ఏడుస్తూ నన్నుగూడా కోపం చేస్తున్నావు. ఇందులో నాతప్పేమన్నా ఉన్నదంటావా?"

ఈ ప్రశ్న విని రాజుకు నడుం విరిగినట్లయింది. నుంచున్నవాడు, నుంచున్నట్టు కూలబడ్డాడు. ఇందాకటి గలగలలు అన్నీ తగ్గిపోయినాయి. "ముందే మంచి పనులు చేస్తే ఎంత బాగుండేది?" అని ఇప్పుడు రాజు ఆలోచన చేశాడు. "ఏమయ్యా! రాజా! ఏమిటి ఆలోచిస్తున్నావు?" అని మృత్యువు ప్రశ్నించాడు. ఆ ఆలోచనలలో ఆ రాజుకు మెలకువ వచ్చింది. "మంచిపనులు చేద్దామని ఆలోచిస్తున్నాను" అని రాజు మృత్యుకు సమాధానం ఇచ్చాడు. "ఇక ఈ జన్మకు లేదు" అంటూ మృత్యువు రాజు ప్రాణాలను లాగివేసుకొని, మాయం అయిపోయినాడు. కూర్చున్న రాజు శవమై క్రిందికి దిగజారాడు.

[అరేబియా రాత్రుల కథలలో ఒకకథను అనుసరించి]. ★

(బొమ్మరిల్లు సీరియల్)

ఊదరి

మూలం: చార్లెస్ డికెన్స్   అనువాదం: కె. రామచంద్రరావు

నెల్, ఆమె తాత ఎంతో హాయిగా జీవిస్తూఉంటారు. తాతకి ఎక్కువ ధనం సంపాదించాలని బుద్ధి పుట్టి పేకాటకి దిగుతాడు. అప్పుల పాలవుతాడు. బాకీ పెట్టిన క్విల్ప్ అనేవాడు వాళ్ళ ఇల్లు, దుకాణం స్వాధీనం చేసుకుంటాడు. నెల్, తాత ఎవరితో చెప్పకుండా లండన్ విడిచిపెడతారు. త్రోవలో ఒక మైనపుబొమ్మల ప్రదర్శనం యజమానురాలు, జార్లీ, ఇదరికీ తనదగ్గిర ఉద్యోగం ఇస్తుంది. నెల్ మంచి పేరు సంపాదిస్తుంది. డబ్బు సంపాదిస్తుంది. ఇలా సుఖంగా ఉంటూఉండగా తాత మళ్ళీ పేకాట అలవాటు పట్టుకుంటుంది. నెల్ సంపాదించిన డబ్బంతా తగలేస్తాడు. తాత జార్లీవద్ద డబ్బును గొంగిలించటానికి సిద్ధపడతాడు. మామూలుగా తనతో పేకాడేవారితో ఈ విషయం మాట్లడుతుండగా అదృష్టవశాత్తు నెల్ వింటుంది. ఆ రాత్రికి రాత్రే తాతని అక్కడ ఉండనివ్వకుండా రహస్యంగా బయలుదేర దీస్తుంది. పోయి, పోయి వారిదరూ ఒక పారిశ్రామిక పటణం చేరుకుంటారు. అక్కడ తిండి లేక బడలికతో అగచాట్లపడుతూ ఉండగా, ఇదివరకు వారికి ఆతిథ్యమిచ్చిన ఉపాధ్యాయుడు కనబడతాడు. ఉపాధ్యాయుడు వారిని తనతో తీసుకవెళ్తాడు. ఆ గ్రామంలో తాతకి ఉద్యోగం వస్తుంది. సుఖంగా ఉంటూంటారు. క్విల్ప్ తాత, నెల్ పారిపోయినట్లు తెలుస్తాడు. బహుశా ముసలివాడు ఎక్కడో కొంత ధనం దాచిఉంటాడని అనుమానించి ఎలాగైనా వారిని పట్టి ఆ డబ్బుకూడా గుంజాలని ప్రయత్నాలు చేస్తూఉంటాడు. కిట్ కూడా తన యజమాని కనిపించకుండా పోయినందుకు విచారిస్తూ వెతుకుతూంటాడు. అతనికి తిరిగి ఏబెల్ అనే ఆయనవద్ద ఉద్యోగం దొరుకుతుంది. ఇలా ఉండగా ఎవరో ఒక క్రొత్తఆయన లండన్ వచ్చి నెల్, తాతలగురించి దర్యాప్తుచేసి వెదకటం ఆరంభిస్తాడు. నెల్ జార్లీ ప్రదర్శనంలో పనిచేస్తున్నదని ఎవరో చెప్పగా ఆ 'ఆగంతుకుడు' కిట్ తల్లిని వెంటబెట్టుకొని అక్కడికి వెళ్తాడు. జార్లీ నెల్, తాత తనకు చెప్పకుండా పోయినారని తెలుపుతుంది. వారికై వెతుక్కుంటూ అక్కడికి వచ్చిన క్విల్ప్‌ని చూచి ఆ ఆగంతుకుడు మండిపడతాడు. క్విల్ప్ ఆ కోపం కిట్ తల్లిమీద చూపిసాడు. కిట్ ఈ సంగతి తెలిసి క్విల్ప్‌ని చివాటు పెడతాడు. ఈ కోపంలో క్విల్ప్ తన మిత్రుడైన బ్రాస్ అనేవానికి ఎలాగైనా కిట్‌ని కష్టాలలో ఇరికించమని చెప్తాడు.

6

రెండురోజులు గడిచినాయి. కిట్ తల్లిని లండన్ పంపించి ఎటో పోయిన 'ఆగంతుకుడు' తిరిగి లండన్ చేరుకున్నాడు. బ్రాస్ ఆఫీసు పైనఉన్న గదిలోనే అతనిమకాం. కిట్ నూతనయజమాని ఏబెల్‌కి ఆయనకి మంచి స్నేహంఏర్పడింది. యజమాని పనిపయిన కిట్ తరచుగా ఆయనవద్దకివస్తూఉండేవాడు.

ఒకరోజున కిట్ ఆయనతో మాట్లాడి వెళ్ళిపోతుండగా, క్రింద తన ఆఫీసుగదిలో కూర్చునిఉన్న బ్రాస్ పిలిచాడు. కిట్ తన టోపీతీసి బల్లపైపెట్టి ఎదురుగా కుర్చీలో కూచున్నాడు. బ్రాస్ అతనిటోపీతీసి చేతితోపట్టుకొని అటూ ఇటూ తిప్పుతూ కిట్‌తో చాలాసేపు ముచ్చటించాడు. కొంతసేపయిన తరువాత అతను బ్రాస్‌వద్దసెలవు తీసుకొని వెళ్ళిపోయినాడు.

కిట్ ఒక వందగజాలు వెళ్లాడో లేదో వెనకనించిఎవరో పిలిచారు. బ్రాస్ ఒకపోలీసుతో కలిసి దగ్గరికివచ్చాడు. పోలీసు కిట్ జబ్బపట్టుకొని "ఆగు, నిన్ను అరెస్టు చేశాను" అన్నాడు. కిట్ పట్టు విడిపించుకుంటూ "ఎందుకు?" అన్నాడు.

"తొందరపడకు, మిత్రమా! నాదిఒక అయిదుపౌండ్ల నోటు పోయింది" అన్నాడుబ్రాస్.

"పోతే"

"నీవుతీసినావన్న అనుమానం" కిట్ ఆశ్చర్య పోయినాడు. పోలీసు అతనిని సోదాచెయ్యాలని అన్నాడు. కిట్ నిర్భయంగా చేసుకొమ్మన్నాడు. బ్రాస్ తన ఆఫీసుకుపోయి అక్కడ సోదాచేద్దామన్నాడు. అంతాకలిసి ఆఫీసుకువెళ్లారు. అక్కడ సోదా చెయ్యగా కిట్ టోపీలోనుంచి ఆ నోటు బయటపడింది. బ్రాస్ గుమాస్తా సోదా చేసేటప్పుడు అక్కడఉన్నాడు. అతని సాక్ష్యం చేసి కిట్‌ని బ్రాస్ మేజిస్ట్రేటు దగ్గర హాజరుపెట్టాడు.

మేజిస్ట్రేటు ఫిర్యాదు ఆపొద్దిం చాడు. విచారణజరిగేవరకూ కిట్‌ని జెయిల్‌లో ఉంచాడు. తరువాత కొన్నాళ్ళకి విచారణజరిగింది. విచారణదినంనాడు కిట్ స్నేహితులు, యజమానిఏబెల్, "ఆగంతుకుడు" కూడావచ్చారు. కిట్ తల్లికూడా వచ్చింది. తనకొడుకు అమాయకుడని, నిర్దోషి అని మొత్తుకొంటూ ఏడ్చింది. అక్కడికి వచ్చినవారు అందరూ ఆమెనుచూసిచాలా జాలి పడ్డారు.

విచారణజరుగుతూన్నది. న్యాయ

వాడి బ్రౌన్‌గుమాస్తాను పిలిచి సాక్ష్యంఅడిగాడు

"సోదా జరుగుతున్నప్పుడు అక్కడఉన్నావా?"

"ఉన్నాను"

"కిట్ టోపీలో ఆనోటు దొరికిందా?"

"దొరికింది కాని "

అతనిని చెప్పనివ్వలేదు విచారణ ముగిసింది కిట్ కి ద్వీపాంతరవాస శిక్షవిధించారు కిట్‌తల్లి విచారం ఎవ్వరూ చూడలేకపోయినారు

ఆరురోజులు గడిచినాయి ఆ మరునాడే కిట్‌ని ఆస్ట్రేలియా పంపించివేస్తారు అనాడు, ఒక బాలిక కిట్ యజమాని అయినవీబెల్ ఇంటికి పరుగెత్తుకొని వచ్చింది అయన తోటలోఉన్నాడు ఆ అమ్మాయి ఆయనవద్దకివచ్చి "అయ్యా! కిట్ అమాయకుడండీ! ఏమీ తప్పు చెయ్యలేదు ఈసంగతి మీతో చెప్పాలనివచ్చాను" అన్నది

వీబెల్ ఆశ్చర్యంగా "ఎలా తెలుసు?" అని అడిగాడు బ్రౌన్ గుమాస్తాకి ఆరురోజులనుంచి జ్వరంగాఉన్నదని, జ్వరంలోఅతడు పలకరిస్తూంటే కిట్ కి ద్వీపాంతరవాస శిక్షవేసినట్లు తనకి తెలిసిందని ఆ అమ్మాయిచెప్పింది తను బ్రౌన్ ఇంట్లోపనిచేస్తున్నట్లు కిట్ టోపీలో బ్రౌన్ ఆనోటుపెట్టాఉండగా తాను కళ్లారాచూశానని కూడా ఆ అమ్మాయిచెప్పింది

వీబెల్ తొందరతొందరగా ఆ అమ్మాయిని తన బండిలో కూర్చోబెట్టుకొని తన స్వంతవ్యవహారాలుచూచేలాయరు వద్దకివెళ్లాడు జరిగినసంగతి అతనితో చెప్పాడు వెంటనే ఆలాయరు బ్రౌన్‌కి ఒకఉత్తరంవ్రాసి పిలిపించాడు వీబెల్ ఈలోగా "ఆగంతుకుడు" కికూడా కబురుచేసి పిలిపించాడు

బ్రౌన్‌వచ్చాడు వస్తూనేఅక్కడ ముగ్గురునలుగురు ఉండటం చూసి చకితుడై, మళ్ళీగుండె నిబ్బరించుకొని నవ్వుముఖంతో లాయర్‌ని పలకరించాడు లాయర్ బ్రౌన్‌ని మర్యాదచేసి కూర్చోబెట్టి ఇలా అన్నాడు

"ఆక్రూరవాడుఉన్నాడే- కిట్ - అతనికి ద్వీపాంతరవాస శిక్ష వేశారుకదూ? అతడుపాపం ఏ పాపంఎరగడు నిజంగా జరిగినదేమిటో ఇప్పుడు తెలిసింది సాక్ష్యమంతా సిద్ధంగాఉన్నది మీరు అనవసరంగా దాచకుండానిజంచెప్పుకోండి"

బ్రౌన్ ముఖం పాలిపోయింది నిజంచెప్పక తప్పదని తెలుసుకున్నాడు అంతాచెప్పి, తన మీదికి ఏమీరాకుండా చూడాలని ప్రార్థించాడు లాయరు అతనినిఅంతటితో వదలలేదు అంతావ్రాయించి సంతకం పెట్టించుకున్నాడు ఆ తరువాత అతనిని వెళ్ళనిచ్చాడు బ్రౌన్ ముఖం వాడిపోయింది అతడు ఇంటికి వెళ్తూఉండగా, చూచినవారెవరూ గుర్తుపట్టలేకపోయినారు

వెంటనే వీబెల్, లాయర్, 'ఆగంతుకుడు' బండిలో బయలుదేరి వేగంగా జెయిలుకు చేరుకున్నారు అప్పటికే కిట్‌ని తీసుకుపోవటానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి వీరు వెళ్ళి కిట్ నిర్దోషి అని తెలిందని, న్యాయాధికారి విడుదలఉత్తర్వుకొద్దిసేపట్లో ఇస్తాడుకనుక కొంతసేపు ఆగవలసిందనీ రక్షకభటులను ప్రార్థించారు కిట్ మంచితనం గుర్తించిన అధికారులు, తోటి ఖైదీలుఆనందపడ్డారు ఇంతలో విడుదల ఉత్తరువులు తీసుకొని ఒకఅధికారి అక్కడికి చేరుకున్నాడు

వీబెల్ కిట్‌ని తన బండిలో ఎక్కించుకొని ఇంటికి తీసుకొని వెళ్లాడు కిట్‌తల్లి కుమారుని కౌగలించుకొనిఏడ్చింది

బ్రౌన్ ఆ లాయర్ ఇంటినుంచి తిరిగి వెళ్ళిపోయినపిదప ఎవరికీకనిపించలేదు అతడేమయినాడో కూడా ఎవరికి తెలియలేదు కొంతమంది పరదేశాలకు పోయినాడన్నారు మరికొందరు అతనిని అమెరికాలో చూచినట్లు చెప్పారు కాదు ఇండియాలో ఉద్యోగం చేస్తున్నాడన్నారు కిట్ బదులు ద్వీపాంతర వాసానికి పోయినాడన్నారు కొన్నిఏళ్లుగడిచిన తరువాత, లండన్‌మురికిపేటల్లో ముష్టి ఎత్తుకుంటూ ఉండేవాడని కూడా అన్నారు కాని నిశ్చయంగా అతడేమయిందీ ఎవరూ చెప్పలేకపోయినారు

బ్రౌన్ ఆ లాయర్ ఇంట్లో నిజం ఒప్పేసుకున్న సంగతిక్వెల్ప్ కి తెలిసింది తెలియగానే అతడు తన గదిలో తలుపులు మూసుకొని కూర్చున్నాడు ఆరాత్రి కొందరు పోలీసులు అతనినిపట్టుకు పోవటానికి పోయి తలుపుపగులకొట్టి లోపలికి ప్రవేశించారు అతడు లేడు కాని పెరటితలుపులు తీసిఉన్నవి అతని ఇంటినుంచి కొంచెందూరంలో ఒక చిన్ననదిఉన్నది నది ఒడ్డుదాకా పోయి పోలీసులుగాలించారు

రెండురోజుల తరవాత లండ

నుకుతూర్పుగా కొన్ని మైళ్ళఅవతల ఒకమానవకళేబరం నదిలో దొరికిందని పత్రికలలో ప్రకటించబడింది పోలీసులు హుటాహుటివెళ్ళి ఆ శవంతీసుకువచ్చి గుర్తుపట్టారు అది క్వేల్స్‌ది

కిట్ విడుదలయికొన్ని వారాలు గడిచినాయి అంతా బాగానే ఉన్నప్పటికి తమయజమాని, నెల్ కనిపించలేదన్న విచారం అతనికి ఉంటూనేఉన్నది వారిఇల్లు చూచినప్పుడల్లా అతనికి దుఃఖంపొర్లుకు వస్తున్నది

ఇలాఉండగా ఒకనాడు ఏబెల్‌కి అతని తమ్మునివద్ద నుంచిఉత్తరం వచ్చింది ఆతమ్ముడు పశ్చిమరాష్ట్రాలలో ఒకగ్రామంలో ఉంటున్నాడు ఆ గ్రామంలోనే ఉపాధ్యాయుడు, నెల్, తాత ఉంటున్నదికూడాను నెల్ అంటే ఆగ్రామంలో అందరికీ చాలా అభిమానము ఏబెల్ తమ్ముడికిమరీను అతడు ఆ ఉత్తరంలో నెల్ సంగతి వ్రాశాడు ఆ గ్రామంలోఅందరూ ఆ అమ్మాయిని దేవకన్యఅంటారని వ్రాశాడు

ఆఉత్తరాన్ని ఏబెల్ కిట్‌కి చూపించాడు కిట్ ఆనందంతో గంతులువేశాడు ఆ మరుక్షణమే నెల్ కోసం తాతకోసం ఇంకాఅన్వేషిస్తున్న "ఆగంతుకుని" వద్దకు పోయి ఈవార్త చెప్పాడు ఆ ఆగంతుకుడు ఎంతో సంతోషించాడు నెల్ తాతకి తనుతమ్ముణ్ణన్న సంగతి అందరికిచెప్పాడు

ఆమరునాడు ఏబెల్, కిట్ ఆయన ఆగ్రామంవెళ్ళారు అంతా కలుసుకొని మహదానందం పొందారు అందరిలోకి ఎక్కువ ఆనందం పొందినవాడు కిట్ ★

(అయిపోయింది)

మాటలునేర్చిన గిత్తదూడ

గుత్తా బాపినీడు చౌదరి

ఒక గ్రామంలో వెంకయ్య అనే ఒక రైతు ఉన్నాడు అతడు చాలా మంచివాడు అతనికి వయస్సుమళ్ళినా పెళ్ళి కాలేదు అతనికి ఒక గిత్తదూడఉన్నది ఆ దూడే అతనికి సర్వము "ఈ దూడను ఇంతఅందముగా సృష్టించిన దేవుడు దానికి నోటిమాట కూడ ఇవ్వకూడదు ?" అని వెంకయ్యకు ఆలోచనకలిగింది అది అసాధ్యమయిన విషయమని తెలిసి కూడా ఏదయినా ఒక ఉపాయం ఉండకపోతుందా అని సలహాకోసమై శరభయ్య దగ్గరకువెళ్లాడు

శరభయ్య వెంకయ్యకోరిక విని 'వెంకయ్యగారూ! మీకు పిచ్చిఎత్తలేదుగదా? దూడమాట్లాడాలా ? ఏమి కోరికండీమీది! ఎవ్వరన్నా వింటే నవ్వుతారు, ఊరుకోండి" అని మెత్తగా చివాట్లుపెట్టాడు వెంకయ్య సిగ్గుతో తలవంచుకొని అప్పటికి యింటికివచ్చాడు కాని ఆ ఆలోచన బుఱ్ఱలో తొలుస్తూనే ఉన్నది

సాధులదగ్గర, యోగుల దగ్గర రకరకాల మహిమలు ఉంటాయని చెప్తుంటారుకదా, అలా హిమాలయాలలోకి వెళ్ళి భక్తితోకోరుకుంటే ఏసాధువైనా కనికరించకపోతాడా అని ఒకనాడు వెంకయ్యకి తోచింది వెంటనే హిమాలయాలకి ప్రయాణంకట్టాడు కంటికి కనిపించిన ప్రతిసాధువు కాళ్లుపట్టుకొని బ్రతిమిలాడాడు చివరికి ఏలాగైతేనేం వెంకయ్య చేసుకొన్నపుణ్యం కొద్దీ ఒకసాధువుకనిపించి వెంకయ్య కోరిక తీర్చటానికి అంగీకరించాడు ఆసాధువు ఒకమూలికతీసి వెంకయ్యకిఇచ్చి దూడకి తినిపించమని, వెంటనే దానికి మాటలు వస్తాయని చెప్పాడు


వెంకయ్య సంతోషంగా ఇంటికి వచ్చాడు, దూడ వెంకయ్యను చూడగానే జాలిగా సంతోషంతో అరిచింది "పాపం! ఇన్నాళ్ళనుంచి కనిపించలేదని ఎంత బాధపడిందో కదా!" అనుకొని, ఇకమీదట నీవు హాయిగా మాట్లాడుతావు, నీమనసులో ఉన్నదంతా చెప్పగలుగుతావు" అంటూ ఆమూలికతినిపించాడు

ఆ దూడ వెంటనే నోరువిప్పి "ఇన్నాళ్ళనుంచి ఎక్కడికి వెళ్లారు?" అనిఅడిగింది

వెంకయ్య ఉబ్బిపోయి సంగతి అంతాచెప్పాడు "ఎండలో తిరగక హాయిగావెళ్లి పాకలోపడుకో" అని తలదువ్వి చెప్పాడు

"అయ్యా! మీరు ఇంట్లో హాయిగా పరుపుమీద పడుకోవటంవల్ల మీకు తెలియటంలేదు, ఆ ఎండుగడ్డిమీద పడుకొంటే తెగగుచ్చుకుంటున్నది. కాబట్టి మీ పరుపు ఒకటికాస్త పాకలో వేయిద్దురూ" అన్నది గిత్తదూడ

'ఓసినీ! ఎన్నిమాటలు నేర్చావే



"ఏయ్, నేను డిటెక్టివ్ ని!"

★ మాటలునేర్చిన గిత్తదూడ ★

ఈసంగతి ఊళ్లో వాళ్లకి తెలిస్తే దృష్టి తగులుతుంది. పదపద' అంటూ దూడనుదొడ్లోకి తీసుకెళ్లి కట్టి వేశాడు.

వెంకయ్యఆకలిగాఉండి భోజనం చేస్తూఉండగా 'ఏమంతోయ్! వెంకయ్యగారు' అని పిలిచిందిదూడ.

'ఏమిటే!' అంటూ వచ్చాడు వెంకయ్య.

'ఏమయ్యా! పెదమనిషి! నీ వొక్కడివే భోజనం చేసేవాడవను కున్నావా! మేమంతామట్టిలో కలవ వలసిందేనా? ఏమయ్యా నీన్యాయ బుద్ధి! కొద్దిగా కుడితి, తెలగపిండి పట్టుకురా' అని దూడఆజ్ఞాపించింది.

వెంకయ్యమూరు మాట్లాడక దానికోరిక తీర్చాడు.

'ఇదిఏమిటయ్యా కుడితిలో నీళ్లు ఎక్కువ పోసుకొచ్చావు? కుడితి లో ఒట్టిచిట్టు వేయగానే సరిపోయిం దనుకున్నావా? కాస్త దోస బీర, అనపకాయ ఏదోముక్కలు తరిగి వేయి. రుచిగిచి ఏమీ అక్కర్లేదా?' అని దులపరించింది వెంక య్యను దూడ. వెంకయ్య తెల్ల బోయాడు. చచ్చినట్టు చెప్పిన పను లన్నీ చేశాడు.

ఈ విధంగా ఆగిత్త వెంకయ్యను ప్రతివిషయములోను సాధించటము మొదలుపెట్టింది.


ఒకరోజున వెంకయ్య మామూ లుగా నిద్రపోతుండగా 'ఏమయ్యో! వెంకయ్య గారూ! దొంగలుకుట్టి చస్తున్నా' అని గిత్తదూడ కేక వేసింది. నిద్రాభంగమై వెంకయ్య కోపంతో కర్రపుచ్చుకొని వచ్చి బడితపూజ చేయసాగాడు. గిత్త ఆదెబ్బలుపడలేక 'రామయ్యగారు! సీనయ్యగారూ! పుల్లయ్యగారూ! రక్షించండీ బాబో చంపేస్తున్నాడు' అని అరిచింది.

ఇరుగుపొరుగు వాళ్లు ఏ దొంగో పడి, వెంకయ్యను చంపేస్తున్నా డనుకొని తలొక కర్రపుచ్చుకొని చీకటిలో తెలియక దూడను బాదు తున్న వెంకయ్యను నెత్తిమూడు ముక్కలయ్యేటట్లు తగిలించారు.

'చచ్చానురో బాబో' అంటూ వెంకయ్య గిలగిల కొట్టుకున్నాడు.

'చచ్చావా? చావు' అన్నది కోపంగా గిత్తదూడ. ఇరుగుపొరు గులు సంగతంతా తెలుసుకొని వెంక య్య దెబ్బలకు కట్లు కట్టారు.

దెబ్బలు తగ్గిన వెంటనే వెంకయ్య మళ్ళీ హిమాలయా పర్వతాల వైపుపరుగెత్తాడు. ★



"అయితే నేను దొంగరాముణ్ణి!!"

ఔదార్యం

ఆచంట గోపాలకృష్ణ

భారతదేశాన్నంతా ఏకచ్ఛత్రంగా పాలించాలనే తలంపుతో అక్బరు రాజపుత్రులపై దండయాత్రలు సాగించాడు. ప్రతాప్‌సింహుడు తప్ప మిగతా వారంతా అక్బర్‌కి సామంతులైనారు. ప్రతాప్‌సింహునికూడా ఎల్లాగయినా సామంతునిగా చేసుకోవాలని ప్రయత్నించి అక్బరు విఫలుడైనాడు. ప్రతాప్‌సింహుని నాయకత్వంక్రింద కొంతమంది రాజపుత్రులు అక్బర్ పై యుద్ధం ప్రకటించారు. అసంఖ్యాకమైన సేనలతో అక్బర్ యుద్ధభూమిలో ప్రవేశించాడు. రణధీరసింహుడు ప్రతాప్‌సింహునికి కుడిభుజం వంటివాడు. అంతకు నెల క్రితమే ప్రేమించి పెళ్లాడిన తారాదేవిచే రక్తచందనాన్ని దిద్దించుకొని అక్బర్ సేనలపై కురికాడు.

రణధీరునిపై కుప్పలుకుప్పలుగా వచ్చి పడ్డారు మొగలాయీల సైనికులు. అజేయుడైన రణధీరుడు ఉత్సాహంతో యుద్ధం చేస్తు

స్నాడు అతని గుఱ్ఱం చనిపోయే పరిస్థితిలో ఉన్నది యింతలో ఏమరుపాటుగా అతన్ని బంధించి అక్బరు వద్దకు హాజరుపరచారు సైనికులు రణధీర్ బంధితుడైనాడన్న వార్తవిని రాజపుత్రవీరులుఆవేశంతోచిందులు త్రొక్కారు తారాదేవి నిలువునా కూలిపోయింది అక్బర్ రాయభారిని పంపాడు "ప్రతాప్ సింహుడు సామంతుడైతే రణధీర్ విడుదలౌతాడు లేదా అతనికి మరణదండన తప్పదు" అని అక్బర్ సేనాని ప్రదీప్ తనగుడారంలో విచారంగా కూర్చుని ఆలోచిస్తున్నాడు భర్త ఆవిధంగా విచారంగా ఉండటం సలీమా గమనించింది

"మీరు ఎందుకు విచారపడుతున్నారో కారణం తెలుసుకోవచ్చునా?" అని అడిగింది సలీమా

"తెల్లవారితే రణధీర్ వధించబడతాడు ఇదివరకు ఒక యుద్ధంలో అతడు నా ప్రాణాలు కాపాడాడు అతడు నాప్రాణదాత అటువంటి రణధీర్ ని ఏవిధంగా కాపాడటమా అని ఆలోచిస్తున్నాను సలీమా! అతడు అలసిపోయి ఉన్న సమయంలో ఏమరుపాటుగా మన సైనికులు బంధించారు" అన్నాడు ప్రదీప్ విచారంగా

"జైలు తాళంచెవులు తమవద్దనే ఉన్నాయికదా, రెండోకంటివాడికి తెలియకుండా మీ స్నేహితుని విడుదల చెయ్యకూడదూ?" అన్నది సలీమా

"అది ధర్మంకాదు సలీమా! ప్రభువుకి ద్రోహం చెయ్యడమా? నేను ఎన్నటికీ అలా చేయలేను కాకపోతే రణధీర్ తోపాటు నా ప్రాణాన్ని అయినా విడుస్తాను కాని ప్రభువుకి ద్రోహం చెయ్యలేను" అన్నాడు ప్రదీప్ తెల్లవారగానే ప్రదీప్ గుడారంలోకి ఒకసైనికుడు వచ్చి "హుజూర్, రణధీర్ చెరసాల నుంచి తప్పించుకుపోయాడు తమర్ని ఉన్నపళంగా హాజరు కావలసిందిగా సర్కార్ ఆజ్ఞ" అని చెప్పాడు

ప్రదీప్ ఆలోచించసాగాడు తన బాధ చూసి సహించలేక సలీమా రణధీర్ ని విడిపించి ఉంటుంది లేకపోతే యింకెవరికీ ఈ సంగతి తెలియదే ఇది తప్పకుండా సలీమా పనే నని నిశ్చయించుకొని అక్బరువద్దకు వెళ్లాడు

అక్బర్ కోపంగా "రణధీర్ ఎలా తప్పించుకున్నాడు? చెరసాల తాళాలు నీ వద్దనేకదా ఉన్నవి?" అని ప్రశ్నించాడు ప్రదీప్ ని

"హుజూర్! క్షమించండి నేనే రణధీర్ ని విడుదల చేశాను మీ యిష్టంవచ్చిన శిక్ష విధించండి" అని సవినయంగా విన్నవించాడు ప్రదీప్ సలీమా వెంటనే పరుగెత్తుకొనివచ్చి "హుజూర్, నేనూ విడుదలచేసింది నేనూ ద్రోహిని" అన్నది

"నాసమక్షంలోనే అసత్యాలా? అల్లాసాక్షిగా నిజం చెప్పండి ఎవరు విడుదలచేశారో?" అన్నాడుఅక్బర్, ప్రదీప్, సలీమా ఇద్దరూ మాట్లాడలేకపోయినారు భర్త విడిపించి ఉంటాడనుకొని ఆయనకి శిక్ష తప్పించడానికి సలీమా అసత్యమాడింది నిజానికి ఆమె రణధీర్ ని విడిపించనేలేదు

రణధీర్ విడిపించలేదని, భార్యకు శిక్షపడకుండా ఆ నేరం తనపై పెట్టుకున్నాడని తెలిసిందే కదా! అప్పుడు అక్బరు చిరునవ్వు నవ్వుతూ చెప్పాడు "ప్రదీప్! రాత్రి నేను నీవు అన్నమాటలు విన్నాను నీసంతోషంకోసం రణధీర్ ని నేనే విడిచిపెట్టాను ఒకరిపై శిక్ష తప్పించటానికి మరొకరుగా మీరుచేసిన త్యాగం గొప్పది"

అక్బరు జరిగినదంతా సభికులకి చెప్పాడు అందరూ ఆదంపతులను ప్రశంసించారు ★

అలారం గడియారాలు తయారు చేసే కంపెనీ యజమాని ఇంట్లో రాత్రి రెండు గంటల వేళ టెలిఫోన్ మ్రోగింది ఆయన విసుక్కుంటూ లేచి రిసీవరు తీసి "ఎవరు?" అని అడిగాడు

"అలారం గడియారాలు తయారు చేసే కంపెనీ యజమానులు మీరేనా?"

"అవును ఏం కావాలి?"

"మరేమీలేదు మీ కంపెనీ గడియారం ఒకటి మా యింట్లో ఉన్నది అలారం చచ్చేటట్లు మోగుతున్నది నిద్రమేల్కొన రావటానికి మీ అలారం బాగా ఉపయోగిస్తుంది"

"ఈ సంగతి చెప్పటానికేనా రాత్రి రెండుగంటలకు నాకు ఫోన్ చేశారు?"

"రాత్రి రెండయిందంటారా! నేను అలారం అయిదుగంటలకు పెట్టాను ఇప్పుడు మోగితే ఒకవేళ అయిదు అయిందేమో అనుకున్నాను లెండి"

ఎ. ధనంజయపాత్రో, బరంపురం

★ కనకాంబరాలు ★

(34-వ పేజీ తరువాయి)

"సాయంత్రం అయిదుగంటలకి"

"యీలోగా నేను యింటిదగ్గర ఎన్ని ఆటలాడినా మీరు తెల్సుకోగలరా? మీరు వచ్చేముందే నేనెందుకు వాళ్లింటికి వెళ్లి మీ చేత చివాట్లుతినాలి?" మీదుగాల్లు దాటగానే అపరాధిని ఇక్కడికే రప్పించుకుని నాలుగు గంటలుగాకా ఇక్కడే ఉంచి పంపించలేనూ?

కుర్చీలోంచి నిలబడి రెండుచేతులతోటి తలగట్టిగా పట్టుకుని "సావిత్రీ చాలు! అబ్బ! తలపగిలిపోతున్నది" అని కేకేసేడు తరవాత మెల్లిగా కుర్చీలో చేరబడి కళ్లు మూసుకున్నాడు.

సావిత్రి మరొకకప్పు కాఫీయిస్తేతాగి ఆఫీసుకి వెళ్లేడు.

అప్పట్నుంచీ రాజారావు అనుమానం కొంత తగ్గింది. అనుమానం స్ఫురించేమాటలు మానేసేడు. అయినా మనసులోమాత్రం అనుమానంతో క్రుంగుతున్నాడని అప్పుడప్పుడు అతని చేష్టలు, ముఖభావాల్ని బట్టి గ్రహించేది సావిత్రి. ఇంతవరకూ కొంతతోవలో పడ్డాడుకదా! క్రమంగా అతనే రాజబాటని ప్రయాణంచేస్తారని సావిత్రి సంతృప్తిపడేది.

సావిత్రి సాయంత్రం వంటవండుతున్నది రాజారావు ఆఫీసునుంచివచ్చే వేళ కాలేదు: సావిత్రినీ, రాజారావునీ పండుక్కి పిలవడానికి, సావిత్రితమ్ముడు వచ్చేడు. తలుపు తట్టేడు. సావిత్రి వీధితలుపుతీసి, తమ్ముడిని అంతా కుశలమేనా అని అడిగింది. 'ఆ' అని సమాధానం ఇస్తూ అతను లోపలికి రాగానే వీధి తలుపుగడియవేసి, వంటింట్లోకి వెళ్లి తమ్ముడితో మాట్లాడుతున్నది. సావిత్రి మనిషి మనిషి పేరునా యోగక్షేమాలు అడుగుతూ కాఫీకలిపి తమ్ముడికిచ్చింది.

రాజారావు అప్పుడే ఆఫీసునుంచి వచ్చేడు వీధితలుపు వేసుంది. తలుపుతట్టేడు. బదులురాకపోవడంతో రెండుమూడుసార్లు పిలిచేడు.

సావిత్రి వంటింట్లో తమ్ముడితో మాట్లాడుతూ ఉండటాన్ని రాజారావు పిలుపు ఆమెకు వినిపించలేదు.

ఇన్నిసార్లు పిల్చినా సావిత్రి పలక్కపోవడమేమిటి? నేను వచ్చే వేళప్పుడుకూడా తలుపేందుకు గడియ వెయ్యాలి? రాజారావు మనసులో అనుమానం తలెత్తింది. ఏమీ తోచడంలేదు తీవ్రంగా ఆలోచిస్తూ నాలుగుసార్లు ఇటూ అటూ పచార్లుచేసేడు. అనుమానంవల్ల శరీరం దహించుకపోతున్నది.

తలుపుకి చెవి చేరువగాపెట్టి నిశ్చలంగా విన్నాడు, ఏమైనా వినిపిస్తుందేమోనని. సావిత్రి తమ్ముడితో మాట్లాడుతున్న మాటలూ, నవ్వులూ, అస్పష్టంగా వినిపిస్తున్నాయి.


సావిత్రి ఎవరితోనో మాట్లాడుతున్నది. ఏమిటో ఆ గుసగుసలు? తలుపు కన్నంలోనుంచి నిదానంగా చూసేడు. మసక మసకగా పురుషాకారం కనిపించింది వంటింట్లో! ఎవరోమాత్రం సరిగ్గా తెలియడంలేదు.

ఇంకేం అనుకున్నంత వరకూ వచ్చింది. రాజారావుకి తల తిరగడం ప్రారంభించింది. కాళ్ళక్రింద భూమి నడుస్తున్నట్టు, గోడ తనపైకి ఉరుకుతున్నట్టు తోచింది.

సావిత్రి తలుపేసుకుని లోపల ఏం చేస్తున్నట్టు? ఛీ...ఎంత సాహసం? ఆనాడు నాదగ్గర ఎన్నో నీతిశాస్త్రాలు వల్లించిందే! ఆడదానిని నమ్మకూడదు. రాజారావు మనస్సు 'స్టీరింగు' అర్థంలో లేని కారులాగ, పరిపరి విధాల పోతున్నది.

ఎలాగైనా వాడిని పట్టుకోవాలి. అలాగ పెరటివేపు నుంచి వెళితే......అవును. బాగుంది...కాని...పెరటివేపు వెళ్తే వీధి అదీ తలుపుతీసుకుని ఉడాయిస్తాడేమో! ఒక చిక్కు. రాజారావు బాగా ఆలోచించేడు.

వీధితలుపుకి పైన గడియవేసి, పెరటి త్రోవను వెళ్తే బాగుంటుంది. అప్పుడు వాడే దొరికిపోతాడు. బాగుంది ప్లాను. రాజారావు చప్పుడు కాకుండా వీధితలుపు గడియవేసేడు. గబగబ పెరటి గుమ్మందగ్గరికి వెళ్లి తలుపు గట్టిగా నాలుగైదుసార్లు తట్టేడు.



రాజమండ్రి శ్రీరామారావు ఆర్టు గ్యాలరీవారు జరిపిన చిత్రకళ పోటీలలో గెలుపొందిన వీరేశలింగ ఆస్తికోన్నత పాఠశాల బాలికలు, తదితరులు.

★ కనకాంబరాలు ★

ఇప్పుడు బయటపడుతుంది మన వాళ్ళ బండారం! రాజారావుకి 'ఎవరు వారు' అన్న సావిత్రి ప్రశ్న తలుపు తెరిచిన శబ్దం ఒక్కసారే వినిపించేయి!

రాజారావు కళ్లు తలుపు తెరిచిన సావిత్రిని తప్పించుకుని లోపల జనాన్ని వెతుకుతున్నాయ్!

"ఇలా వచ్చేరేమండీ వీధితోవనుండగా?" అన్న సావిత్రి మాటలు వినిపించుకోకుండానే లోపల కాలుపెట్టేడు.

ఎదురుగా పీటమీద కూర్చున్న బావమరదిని చూసి, నిశ్చేష్టుడై నిలబడిపోయేడు. కొండమీదనుంచి క్రిందికి తోసినట్లు ప్రాణాలు పైకెగిరిపోయేయి రాజారావుకి.

బావమరిదిని పలకరించాలన్న జ్ఞానం కూడా నశించిపోయి శిలావిగ్రహంలాగ నిలుచున్నాడు రాజారావు.

"పెరటి త్రోవ పట్టేరేమిటండోయ్ బావగారూ" అన్న బావమరది మాటలు అతనికి విన్పించనేలేదు.

కొంతసేపటికి ప్రాణాలు వాటి స్వస్థానం చేరుకున్నాయ్!

"ఎప్పుడొచ్చేవోయ్? అంతా కులాసాయేనా?" అన్న రెండు ప్రశ్నలూ అడిగి సమాధానం రాగానే తిన్నగా గదిలోకి వెళ్లిపోయేడు.

భర్త పెరటిత్రోవని రావడానికీ, తన తమ్ముడిని చూసి నిర్ఘాంతపోడానికీ, అతని అనుమానమే కారణమని గ్రహించింది సావిత్రి.

తమ్ముడిని స్నానం చెయ్యడానికి పంపించి, తను భర్తకి కాఫీ తీసుకుని వెళ్ళింది.

రాజారావు కాఫీ గ్లాసు బల్లాకే టేబిలుమీదుంచేడు.

"సావిత్రీ! నీమీద అనవసరంగా లేనిపోని అనుమానం పడ్డాను. ఇప్పుడొక గుణపాఠం నేర్చుకున్నాను. యీ అనుమానంతో నిన్నెన్నోసార్లు సూటిపోటు మాటలతో నొప్పించేను. ఇన్నాళ్ళబట్టీ నీ జీవితంగానూ సౌఖ్యం సంతోషం యివ్వలేకపోయేను. యీనాడు నా అనుమాన పిశాచాన్ని పాతాళహోమంచేసి విజయం సాధించేవ్! నా పొరపాట్లు క్షమిస్తావు కదూ" అంటూ గడ్డం పట్టుకుని ప్రాధేయపడ్డాడు.

అనుకోకుండా జరిగిన యీ సంఘటనకీ, రాజారావులో కలిగిన యీ మార్పుకీ సావిత్రి ఆనందం పరిమితి లేకుండా పరుగులెత్తింది.

'గతించినదాన్ని గురించి తలపోస్తే లాభమేమిటి?' అని భర్తను సమాధానపరిచి వంటింట్లోకి వెళ్లింది.

అంతకుముందు, తినేవాడు తిరిగేవాడుగాని, రాజారావు మనస్సు, సంతోషంగా ఉండేదికాదు. హృదయం బరువుగా కొట్టుకొనేది. ఇప్పుడు రాజారావు హృదయం తేలికపడింది.

లేచి వంటింట్లోకి వెళ్ళి "సావిత్రీ వంట వేగం పూర్తిచెయ్యి! యీలోగా మేము షికారు తిరిగి వస్తాం" అన్నాడు రాజారావు.

"వంటకి తొందరేమిటి?"

"యీరోజు సినీమాకి వెళ్దాం! మేము వచ్చేసరికి సింగారాలన్నీ పూర్తిచేసుకుని రెడీగా ఉండు! మొదటి ఆటకే వెళ్దాం!' చిరునవ్వుతో అన్నాడు రాజారావు.

"భోజనాలు చెయ్యకుండానే?

"సినీమానుంచి వచ్చేక భోజనం చేద్దాం!"

రాజారావు, అప్పుడే స్నానం చేసి బట్టలు వేసుకున్న బావమరదిని తీసుకుని వీధిలోకి వెళ్ళిపోయేడు.

సావిత్రి ఆనందం పట్టలేకపోయింది. వంటపని తొందరగా పూర్తిచేసి, మల్లెమొగ్గలూ, కనకాంబరాలూ ఏరి దండ గుచ్చింది.

స్నానంచేసి, కనకాంబరం చీర కట్టుకుని, వాల్జడవేసుకుని దండ తీసి తల్లో పెట్టుకున్నది. అద్దంముందు నిలబడి ప్రతిబింబం చూసుకుని తన అందానికి తనే మురిసిపోవడంలో, అప్రయత్నంగా "అందమె ఆనందం" అన్న పాట ఆమె నోటంట సన్నంగా జాలు వారింది.

భార్య [అప్పుడే ఆఫీసునించి వచ్చిన భర్తతో] ఏమండోయ్! ఈ సంగతి విన్నారూ? పక్కింటి సీతారామయ్యగారి అమ్మాయికి పెళ్లి నిశ్చయమైందట. మధురనించి నాగస్వరం వాయించే వాళ్ళను పిలిపిస్తారట. దిండివనంనించి వంటవాళ్ళను పిలిపిస్తారట. కుంభకోణంనించి డాన్సర్లను పిలిపిస్తారట.

భర్త: అలాగా! పెళ్లికొడుకు ఏవూరు?

భార్య: అయ్యో!—నా మతిమండిపోనూ ఆ సంగతి కనుక్కోవడమే మరిచానండీ.

జి వి జి కృష్ణ, మద్రాస్

రాజారావు బావమరదితో షికారు పూర్తిచేసి తిరిగి వచ్చేడు. సావిత్రి గాళ్ళ రాక గమనించకుండా పాటలో లీనమైపోయింది.

"సావిత్రీ! అక్కడే పొరబడుతున్నావ్. అందం ఆనందం కాదు. ఆనందమే అందం మానవలోకానికి" రాజారావు మాటలకి పాట ఆపి "ఎందుచేత అన్నట్టు రాజారావు వేపు చూసింది.

"అందం కన్నులకే విందుగాని, ఆనందం హృదయానికే విందు," లే! లే! రిక్షా వీధిలో కాసుకుకూర్చుంది" రాజారావు తొందరపెట్టేడు సావిత్రిని.

సావిత్రి రిక్షాలో కూర్చుంది. రాజారావు తలుపులుబిగించి తాళంవేసి ఎల్లల్ని జాగ్రత్తగా పట్టుకోమ్మని సావిత్రిని హెచ్చరించి బావమరదితో రెండవరిక్షాలోకి ఎక్కేడు.

ఇంటికి తాళంవేసి తనను హెచ్చరించే భర్తవేపుచూసి సావిత్రి చిరునవ్వు నవ్వింది. చిరునవ్వు చిందే ఆ ఎర్రని పెదవులు, కనకాంబరం చీరరంగులో లీనమైపోవడాన్ని రాజారావు కా చిరునవ్వు కన్పించలేదు. రాజారావుకా చిరునవ్వు కన్పించివుంటే, అందులో "ఎటువంటి హృదయంగల భర్తనైనా మార్చగలిగే శక్తీ, పాదదాసులుగా చేసుకోగలిగే శక్తీ, స్వర్గం చూపించే శక్తీ, కూడా ఆడదానిలోనే ఉన్నాయోయ్' అన్న భావం కన్పించి ఉండేది. ★

విచిత్రవ్యక్తి

మూలం: మార్క్‌ట్వేన్

అనువాదం: నండూరి రామమోహనరావు

వెల రూ 1-8-0

పోస్టు ఖర్చులు ప్రత్యేకం

ఆంధ్ర గ్రంథమాల, ★ మద్రాసు-1

ఆరుబయలు సినిమాలను ప్రభుత్వం ప్రోత్సహించాలి

రచన కాట్రగడ్డ నరసయ్య

ఆరుబయలు సినిమాలనుగురించి వివరించే ముందు వాటిని యీనాడు నిర్మించాల్సిన అవసరాలను పరిశీలించవలసివుంది

17 వేల గ్రామాలకు పైగా వున్న ఆంధ్ర దేశములో ప్రేక్షకులకు, వినోదాన్ని, విజ్ఞానాన్ని కలుగజేయాలంటే సినిమాకంటే వేరే సాధనము లేదు గ్రామప్రాంతములలో టూరింగు హాలులు ఏటేటా తగ్గిపోతున్నాయి సినిమాహాలులు ముఖ్యకేంద్రములలో కేంద్రీకృతం కావడం గమనించ తగ్గ విషయం 1950 లో 300 ప్రదర్శన కేంద్రాలుంటే, అవి 1955 కల్లా 160 కేంద్రములకు తగ్గిపోయాయి ప్రభుత్వానికి 52/53 సంవత్సరంలో 37 లక్షల రూ ల వినోదపు పన్ను ఆదాయముగా వస్తే 53/54 లో ఆదాయము బాగా తగ్గిపోయింది చాలమంది సినీ పనివారలు నిరుద్యోగులయ్యారు

పల్లెప్రాంతములలో ప్రదర్శనశాలల పెరుగుదలను ప్రోత్సహించాల్సిన బాధ్యత పరిశ్రమకు ఎంతవుందో ప్రభుత్వానికీ అంతే వుంది ఆర్థిక దుస్థితి కారణంగాను, ప్రభుత్వం పెట్టే "లైసెన్సు" బాధలవలనను, నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లు కోరే ఎక్కువ "రెంటేజి" కారణంగాను 1950 లో వచ్చిన అనేకమంది క్రొత్త ప్రదర్శకులు తీవ్రంగా నష్టపడ్డారు షుమారు 100 మంది వద్ద ప్రొజక్టరు, ఇతర పరికరాలు మూలపడి వున్నాయి పరికరాలు వున్నా టూరింగు హాళ్లను ప్రదర్శకులు నడపలేకపోతున్నారు టూరింగులను ఒక చోటనుండి మరొకచోటికి మార్చాలంటే షుమారు రూ 2000/ ఖర్చు అవుతుంది ఆదాయం పూర్వంకంటె తగ్గిపోయింది

టూరింగు హాళ్లను మార్చడానికీ, వాటి లైసెన్సులకూ, వాటిని 6 లేక 12 మాసములు నడపటానికీ, అయ్యే ఖర్చులు రెండవ తరగతి కేంద్రాలలో అయ్యే ఖర్చుకు సమానంగా ఉంటుంది టూరింగు హాలులకు పర్మనెంటు హాలులవారికి వుండే కిల్లీ సోడా కొట్లవలన వచ్చే అదనపు ఆదాయము లేదు దానికి తగినట్లుగానే ప్రభుత్వం ప్రకటించిన ఆర్డరుప్రకారము భద్రత దృష్ట్యా క్యాన్వాసుతోనే టూరింగు హాలు వేయాలి, కాని గడ్డితో వేయరాదు దీనిని అమలు జరిపితే ప్రస్తుతమున్న టూరింగు హాలులకు రూ 2000/ అదనంగా అవుతుంది గ్రామాల సంఖ్య అధికంగా వున్న ఆంధ్రదేశములో, తక్కువ పెట్టుబడులతో, వినోదాన్ని, విజ్ఞానాన్ని ప్రజలదగ్గరకు తీసుకపోవలసిన ఆవశ్యకతను వేరే వివరించనక్కరలేదు

కనుక 100 మంది వద్దనున్న ప్రొజక్టర్లు, ఇతర పరికరాలు, తక్కువ పెట్టుబడులతో పనిచేయాలంటే ఆరు బయలు సినిమాలను ప్రోత్సహించాలి ఆరుబయలు సినిమా మామూలు హాలులాగే వుంటుంది కాని పైన కప్పు వుండదు క్యాబిన్‌లో ప్రొజక్టరు, కొంత దూరంలో తెరవుంటుంది తెరపైన, ప్రక్కల, 6 అడుగుల వెడల్పున పందిరివలె తడిక కట్టబడి వుంటుంది చుట్టూ నల్లటి గుడ్డతో కప్పబడి, ఒక విధముగా తెరను బయటనుండి, గాలి వెలుతురునుండి రక్షణనిస్తుంది వెనుక మామూలుగా వుండే స్పీకర్లు వుంటాయి చుట్టూ 10, 15 అడుగుల ఎత్తుగా దడి కట్టబడి వుంటుంది

సినిమాహాలులో ఎన్నో సౌకర్యాలు, వసతులు కావాలని కోరుతున్న రోజులలో బహిరంగ ప్రదేశములో సినిమాలు చూపుతామనడం సబబుగాలేదని ప్రేక్షకులు భావించవచ్చు

1918 సం॥పు రోజుల బయస్కోపు పద్ధతిలో, ఈ 1955 లో సినిమాలు ప్రదర్శించి ప్రేక్షకులను ఆకర్షించలేమేమోనన్న అనుమానము పరిశ్రమాధిపతులకు కలుగవచ్చు పసిపిల్లలను వెంటబెట్టుకొని ఆరుబయట సినిమా చూడడానికి స్త్రీలు వస్తారా అని, చెట్లపైనుండి సినిమాను చూచే దుర్వాంఛను ఎట్లా ఆపడమా అని కొన్ని ప్రశ్నలు టూరింగుహాలు నడిపే ప్రదర్శకులను బాధించవచ్చు వెన్నెలరాత్రులలో సినిమా ఎట్లా కనపడుతుందని కొందరు భావించవచ్చు

కాని పైన వివరించిన అనుమానాలన్నీ ఆరుబయలు సినిమాలను గురించిన అనుభవం లేకపోవడంవలననేనని గుర్తించవచ్చును అంతర్జాతీయ చలనచిత్రోత్సవం జరిగినప్పటినుంచి యీ ఆరుబయలు సినిమాలను గురించి కొంతపరిశీలన జరిగింది కొద్దిరోజుల క్రితం మద్రాసులో జరిగిన కాంగ్రెసు ఎగ్జిబిషనులో ఏర్పాటుచేయబడిన ఆరుబయలు సినిమా (*Open air theatre*) చూచిన వారికి, యిలాంటి ప్రదర్శనశాలలను గురించి వేరే వివరించనవసరంలేదు మద్రాసు కార్పొరేషనువారు అలాంటి ప్రదర్శనశాలను నిర్మించి, చవుకలో ప్రేక్షకులకు సినిమాలను చూపాలని తీవ్రంగా కృషిచేస్తున్నారు

ఆంధ్రదేశపు వాతావరణ పరిస్థితులనుబట్టి ఆరుబయలు సినిమాను నవంబరునుండి మే ఆఖరువరకు 6 నెలలు తేలికగా నడుపవచ్చును ఈనాడు టూరింగుహాలులో ప్రదర్శన చూచిన అనుభవమున్న వారికి వర్షమునుండి, టూరింగుహాలులో రక్షణ చాల తక్కువగా వుంటుందని వేరే వివరించనవసరంలేదు ఆరుబయలు సినిమాలో సరియైన ప్రదర్శన ఏర్పాట్లు వుంటేను, మంచి చిత్రాలు వస్తేను, తప్పక వస్తారు వెన్నెల రాత్రులలో సినిమా సరిగ్గాకనపడదేమోనన్న భయమక్కరలేదు తెరచుట్టూవుండేపందిరిని జాగ్రత్తగా వేసి నల్లటిగుడ్డతో కప్పితే, చిత్రం బాగా వుంటుంది వెన్నెల "ప్రొజక్టరు" ఆర్కులాంపుకు ఒక రకపు లెన్సుగా పనిజేసి చిత్రాన్ని బాగా అగుపడేటట్లు చేస్తుంది ప్రేక్షకులు వెన్నెలలో కూర్చుండటానికి యిష్టపడతారు గ్రామాలలో ఆరుబయట సినిమాలుంటే, గల్లంతుగా వుంటుందనుకుంటే ప్రభుత్వము గ్రామానికి కొంత దూరాన వుండాలని నిర్ణయించితే చాలు ఎత్తైన తడికలు చుట్టూ వుండటమువలన, చాలవరకు ధ్వని బయటకు రావడము తగ్గిపోతుంది

ఆరుబయట సినిమాలంటె మనం బయస్కోపు రోజుల నాటికి పోతున్నామని భయపడనక్కరలేదు

అమెరికాలో యీనాడు ఆరుబయట సినిమాలున్నాయి వీనిని డ్రైవ్ యిన్ - థియేటర్లు (*Drivein theatres*) అంటారు "డ్రైవ్ యిన్" థియేటర్లలో తెర చాల పెద్దదిగా వుంటుంది ప్రొజక్టరు తక్కువ ఎత్తులోవుండి తెర ఎత్తుగా వుంటుంది చాల పెద ఆర్కులాంపు ప్రొజక్టర్లు వాడబడతాయి పట్టణాలకు 10, 15 మైళ్ళ దూరములో కారులలో కూర్చుని ప్రదర్శన చూడడానికి అనువుగా ఏర్పాట్లు వుంటాయి అమెరికను సంఘ నిర్మాణాన్ననుసరించి, ఆర్థిక స్థాయినిబట్టి ఈ థియేటర్లు అభివృద్ధి అయ్యాయి

సంధ్యా సమయము రాత్రిల్లు 9 గం॥ వరకు వుండే ప్రాంతాలలో 7 గం॥లకు ప్రదర్శన మొదలుపెట్టాల్సి వచ్చినప్పుడు



గోకుల్ వారి "వదినగారి గాజులు"లో అమర్‌నాథ్, అల్లు రామలింగయ్య.

ఆరుబయలు సినిమాలను ప్రభుత్వం ప్రోత్సహించాలి

కూడ "డే లైట్ డ్రైవ్ యిన్" (*Daylight Drive in theatres*) థియేటర్లు నిర్మించబడ్డాయి. దీనిలో ప్రొజక్టరు తెరవెనుక వుంటుంది.

మన ఆర్థికస్థాయినిబట్టి "డ్రైవ్ యిన్" థియేటర్ల అవసరం అప్పుడే రాలేదు. పట్టణాలనుంచి చాలా దూరంలో వుండడము వలననూ, పురజనులకు ప్రయాణ సౌకర్యాలు అమెరికాలో లాగున అభివృద్ధి కానందున మనకు "డ్రైవ్ యిన్" థియేటర్ల ఆవశ్యకత ఇప్పుడు లేదు. పట్టణాలలో ఎక్కువ ఎలాగూ ఆరుబయలు సినిమాలు ఏర్పాటుచేయడానికి వీలుండదు. కాని పల్లె ప్రాంతాలలో సినిమా కాలక్షేపానికి ఎంతో ముఖ్యస్థానము. కనుక మన దేశపరిస్థితులనుబట్టి ఆరుబయలు సినిమాలను పెంపొందించడం చాలా తేలిక. చలనచిత్రాలను గ్రామాలకు తీసుకపోవలసి ఆవశ్యకత విజ్ఞాన వ్యాప్తికి వుంది. పట్టణాలలో వివిధరకాలయిన వినోదాలకు వీలున్నవి. కాని పల్లెప్రాంతాలలో ప్రజల వినోదానికి సరియైన సాధనములు లేవు. ఒకసారి మన గ్రామజీవితములో ప్రదర్శనశాల ఏర్పడితే అప్పటి జీవిత పరిస్థితులపై చాల ప్రభావముంటుంది. ప్రభుత్వము "అ[illegible] ఫిలిమ్సు" ద్వారా ప్రచారము చేయడానికి, అప్పుడప్పుడు నాటకములు, ఇతర ప్రదర్శనలు ఏర్పాటు చేయడానికి చాలా తేలిక అవుతుంది. చాలా తక్కువ ఖర్చుతో ఒకగ్రామమునుంచి మరొక గ్రామానికి ప్రదర్శనశాలను తేలికగా మార్చుకొనవచ్చును!

ఆరుబయలు సినిమాల నిర్మాణానికి అనువైన మార్పులను ప్రభుత్వం సినిమటోగ్రాఫ్ రూల్సులో చేయాలి.

ఫిలిం విచారణ సంఘపు నివేదికలోని 588 వ పేరాలో ఆరుబయలు సినిమాలను ప్రోత్సహించాలన్న సూచనను కేంద్రప్రభుత్వం 1954 మే 19 వ తేదీ ప్రకటనలో అంగీకరించింది. రాష్ట్రప్రభుత్వం కూడ దీనిని వెంటనే అమలుపరచాలి.

న్యూస్‌రీల్సు, పబ్లిక్ ప్రదర్శనలకు ఆరుబయలు సినిమాలను నిర్మించుటకు సినిమాటోగ్రాఫ్ చట్టంలోని 57 వ రూలు అనుమతించుకోంది. కనుక ప్రదర్శకులకు కూడ ఆ కష్టము అనువర్తింపజేయాలి.

ప్రభుత్వము వెంటనే యీ సంవత్సరములోనే ఆరుబయలు సినిమాలకు లైసెన్సుల అనుమతి నివ్వాలి. పరిశ్రమ అభివృద్ధికి, గ్రామ ప్రేక్షకులకు వినోదం, విజ్ఞానం, అందజేసేటందుకు, ప్రభుత్వం వినోదపు పన్ను ఆదాయమును పెంచుకోవడానికి బహిరంగ ప్రదర్శనశాలలను ప్రోత్సహించాలి. ★



అంజలీ పిక్చర్స్‌వారి "అనార్కలీ"లో అంజలీదేవి నృత్యభంగిమ.

"రోజులు మారాయి"

సారథీ ఫిలిమ్స్ చిత్రం సమీక్ష


సారథీ ఫిలిమ్స్‌వారు నిర్మించిన "రోజులు మారాయి" చిత్రం ఆంధ్రదేశంలో విడుదల అయింది. దర్శకుడు తాపీ చాణక్య. కథ, సంభాషణలు కొండేపూడి లక్ష్మీనారాయణ. పాటలు కొసరాజు, తాపీ ధర్మారావు. సంగీతం వేణు. ఫొటోగ్రఫీ కమల్ ఘోష్. ఎ. నాగేశ్వరరావు, జానకి, రేలంగి, సి. ఎస్. ఆర్., అమ్మాజీ, నరసింహారావు, పెరుమాళ్లు, హేమలత, రమణారెడ్డి మున్నగువారు నటించారు.

బంజరుభూముల పంపకం సమస్య తీసుకుని ఈ చిత్రంలోని ఇతివృత్తం కల్పించారు. బంజరు భూమిలాంటి ఈ యితివృత్తంలోంచి దర్శకుడు, రచయిత కలిసి రసవంతమైన పంట పండించారు. పేదరైతుల సమస్యలమీద ఇదివరలో చాలా తెలుగు చిత్రాలు వచ్చాయిగాని అవి అసలు సమస్యను కళాత్మకంగా చిత్రించలేకపోయాయి. సారథీవారి చిత్రం యీ విషయంలో ఫలప్రదమైంది. దర్శకుడు తాపీ చాణక్య ప్రతిభ చూపించి చిత్రాన్ని రక్తికట్టించారు. వీరు డైరెక్టు చేసిన తొలిచిత్రం "అంతా మనవాళ్ళే" కథా బలంవల్ల రాణించింది. ఈ చిత్రంలో కథకు, మంచి దర్శకత్వంకూడా తోడైంది.


సాగరయ్యవద్ద కౌలుకు మానేసి కోటయ్య ఊరి కరణం అనుమతిమీద బంజరు భూమిని తీసుకుని సాగుచేసి పంట పండిస్తాడు. పంటను యింటికి తీసుకుపోయే సమయంలో పోలయ్య అనే రౌడీ కరణంతో సహా వచ్చి ఆ భూమి తన కిదివరకే ఇవ్వబడిందనీ, ఆ పంట తనకే రావాలని దబాయిస్తాడు. కరణం, సాగరయ్యల సహాయంతో పోలయ్య అమాయకుడైన కోటయ్యను వంచించి పంటలో కొంతభాగం రాబట్టుకుంటాడు. భూస్వామి సాగరయ్య ఊళ్లోవున్న బంజరు భూములన్నీ అక్రమంగా ఆక్రమించుకుని కౌలుకిచ్చి సేద్యం చేయిస్తూ వుంటాడు. ఈ అక్రమాలను బయటపెడుతూ కోటయ్య కొడుకు వేణు ఊళ్లోవారిని కూడగట్టి కలెక్టరుగారికి పిటీషను పెడతాడు. కలెక్టరుగారు స్వయంగా వచ్చి విచారణ జరిపి, సాగరయ్య అక్రమాలను కనుక్కొని బంజర్లను పేదరైతులకు పంచి పెట్టిస్తారు. వారు ఆ భూములు సాగు చేస్తారు. వారి సేద్యానికి ఆటంకాలు కల్పించాలని సాగరయ్య ఎన్ని ప్రతీకార ప్రయత్నాలు చేసినా రైతులు ఐకమత్యంతో పనిచేసి అతని ఆట కట్టిస్తారు. ఈలోగా కోటయ్య కొడుకు వేణు ఆ వూళ్లో వున్న రాధ అనే కులంలేని పిల్లను ప్రేమించి, తండ్రిని ఎదిరించి, పెళ్లాడుతాడు. కోటయ్య, వేణు యీ తగాదాతో వేరుపడిపోతారు. వేణు చెల్లెలు భారతి రావ గోపాలాన్ని ప్రేమిస్తుంది. గోపాలం తండ్రి మొదట అయిదువందల కట్నానికి ఒప్పుకుని తరవాత కరణం చెప్పుడుమాటలు విని ఆ సంబంధం యిష్టంలేక హెచ్చు కట్నం కోరుతాడు. చివరికి వేణు, రాధ కలిసి గోపాలాన్ని, అతని తండ్రిని కూడా ఒప్పించి సంబంధం నిశ్చయం చేయిస్తారు. పెళ్లివారు తరలి వస్తుండగా త్రోవలో సాగరయ్య తాలూకు రౌడీలు పెళ్లిబస్సుమీద పడతారు. ఈ సంగతి తెలిసి కోటయ్య మనుషులందరూ అక్కడికి వెళ్లి మగపెళ్లివారిని రక్షిస్తారు. ఈలోగా కరణం పెళ్ళిపందిరికి నిప్పంటించడానికి ప్రయత్నించి పట్టుపడతాడు. అందరూ తిరిగివచ్చి మళ్లీ పందిరివేసి పెళ్లి జరుపబోతుండగా సాగరయ్య రైతులు పండించిన పంటమీదికి కాలువనీళ్లు వదిలిపెడతాడు. మళ్లీ పెళ్లికి విఘ్నం కలుగుతుంది. రైతులందరూ పొలానికి పరుగెత్తుకుపోయి పంటను కాపాడుకుంటారు. సాగరయ్య దొరికిపోతాడు. అతన్ని పోలీసులకు అప్పజెబుతారు. భారతి, గోపాలముల పెళ్ళి పొలంలోనే ఆ ముహూర్తానికి జరిగిపోతుంది. అప్పటికే ప్రసవవేదనపడుతున్న వేణుభార్య రాధ పొలంలోనే మగపిల్లణ్ణి కంటుంది. అందరూ ఈ శుభ సంఘటనలకు ఆనందిస్తారు.

అవడి కాంగ్రెస్ మహాసభవారు సోషలిస్టు సమాజస్థాపనమే తమ లక్ష్యమని చేసిన తీర్మానానికి తమ చిత్రం దోహదం ఇవ్వగలదని నిర్మాతలు చిత్రం ఆరంభంలో ఒక ప్రకటన చేశారు. అంతేకాక ఇటీవలి ఎన్నికల్లో నియంతృత్వ శక్తులను ఓడించి, ప్రజాస్వామిక శక్తులను గెలిపించిన ఆంధ్రప్రజలకు యీ చిత్రాన్ని అంకితం చేస్తున్నామని ప్రకటించారు.

బంజరు భూములను పేదరైతులకు సక్రమంగా పంచిపెట్టడంవలన అధికోత్పత్తిని, ప్రజాశ్రేయస్సునూ సాధించవచ్చునని యీ చిత్రం సూచిస్తున్నది. కథలో భూస్వామికీ, మిగతా రైతులకూ జరిగే సంఘర్షణ చివరకు రైతులకే అనుకూలంగా ఫలిస్తుంది. దీనికి కారణం రైతాంగంలోని చైతన్యం, ఐకమత్యం అని చిత్రం చూస్తున్నంతసేపూ వ్యక్తమవుతుంది. చిత్రం పొడుగునా సాగరయ్య, పోలయ్య, కరణం మొదలైనవారు రైతులను వంచించడానికి ప్రయత్నాలు చెయ్యడం, ఎప్పటికప్పుడు ప్రయత్నాలు భగ్నం కావడం కనిపిస్తుంది. కష్టాల పరంపర



సారథి చిత్రం "రోజులు మారాయి"లో నాగేశ్వరరావు, రేలంగి.



యునైటెడ్ ఫిల్మ్ ఆర్ట్స్‌వారు జెమినీవారితో కలిసి నిర్మించిన “దో దుల్హే”లో వనజ, సజ్జన్, ఆగా.

బహుల విజయాల పరంపర చిత్రం అంతటా కనిపిస్తుంది. అయితే అది కేవల ప్రచారస్థాయికి దిగజారిపోకుండా వుండడం గమనించదగ్గ విశేషం. ఇందుకు దర్శకుడు, స్క్రిప్టు రచయిత కనబరచిన నేర్పు ఎంతైనా దోహదం చేసింది. వివిధ సన్నివేశాలను చిత్రించడంలోను, పేలవంగా ఉండే సన్నివేశాలను చమత్కార సంభాషణలతో రక్తి కట్టించడంలోను, ఎప్పటికప్పుడు కొత్త సమస్యను ముందుకు తీసుకువచ్చి ప్రేక్షకులకు కథమీద దృష్టి మళ్ళించడంలోను వీరు కలిసి కట్టుగా చేసిన కృషి జయప్రదమైంది. మొత్తం చిత్రం అంతటా అందరిలోనూ యీ "టీమ్‌వర్క్" కనిపిస్తుంది.

నటీనటులందరూ బాగానే నటించారు. కాని కథలో నటీనటులకు కాక, పాత్ర పోషణకూ, కథకూ గల ప్రాముఖ్యమే హెచ్చు. అందుచేతే జానకి ధరించిన రాధ పాత్ర, పెరుమాళ్లు కోటయ్య పాత్ర, హేమలత ధరించిన అతనిభార్య పాత్ర, మాజీ సిపాయి పాత్ర మొదలైనవి చాలా సజీవంగా కనబడతాయి. కాని సాగరయ్య, కరణం, పోలయ్యల పాత్రీకరణం మరీ మితి మీరినట్లు తోస్తుంది. వీరిని అంత రాక్షసంగా చిత్రించ నవసరంలేదు. అందులోనూ దుష్టుడైన పోలయ్య సాగరయ్యతో కయ్యం తెచ్చుకోవడం, అతడు హఠాత్తుగా మంచివాడైపోవడం అస్పష్టంగా పేలవంగా చిత్రించబడ్డాయి.

ఇలాటివే మరికొన్ని చిన్న చిన్న లోపాలు కనిపిస్తాయి. కలెక్టరుగారు బంజర్లు మంజూరు చేసిన తరువాత రైతులు సాగు చేసిన భూమి అంతమంది ఉమ్మడిగా పని చేయదగినంత విశాలంగా లేదు. ఆదృశ్యాలు మరికొంత శ్రద్ధగా చిత్రించి వుండవలసింది. కరణం మాటలు విని కోటయ్య సంబంధం మానుకోదలచిన గోపాలం తండ్రి మళ్ళీ ఎందుచేత ఆ సంబంధానికి ఒప్పుకుంటాడో స్పష్టంగా చెప్పించలేదు.

కొసరాజు, తాపీధర్మారావుగార్లు రచించిన పాటలు చాలా బాగున్నాయి. కాని వాటికి యివ్వబడిన సంగీతం మాత్రం నిరాశాకరంగా వున్నది. హిందీ పాటల అనుకరణలు కూడా వున్నాయి. అసలు కొన్ని పాటలు శుద్ధఅనవసరమనికూడా అనిపిస్తాయి. చిత్రం నిడివి కూడా పదిహేడు వేల అడుగులపైచిల్లర వున్నది. ఇంత నిడివి అనవసరం. ఇంకా కుదించివుంటే చిత్రానికి మంచి పుష్టి కలిగేది. చిత్రం మొదటి సగంలోనే కథలో ముఖ్యమైన భాగం అయిపోయింది. మిగతా కథలో కొంత భాగం చర్వితచర్వణం అయింది.

చిత్రంలో మెచ్చుకోదగిన అంశాలలో కొత్త నర్తకి వహీదా రెహమాన్ చేసిన నృత్యం ఒకటి. ఆమె నృత్యం గ్రామవాతావరణానికి సంబంధించిన నృత్యం కాకపోవచ్చు గాని, చాలా ఆహ్లాదదాయకంగా వున్నమాట నిజం.

ఈ చక్కని చిత్రం తయారుచేసిన నిర్మాతలు అభినందనీయులు. ఈ చిత్రాన్ని ప్రేక్షకలోకం ఆదరించగలదని విశ్వసిస్తున్నాము. ★



బిమల్ రాయ్ ప్రొ॥ వారి "అమానత్" చిత్రానికి ఔట్‌డోర్ షూటింగ్ జరుపుతున్న దృశ్యం: భారత్ భూషణ్, చాంద్ ఉస్మానీ, నిర్మాత బిమల్ రాయ్.

బొంబాయి సినిమా లేఖ

కోంకణ పర్వత ప్రాంతంలోని మహాబలేశ్వర్ చాలా అందమైన ప్రదేశం. ఈ నెల ఆరంభంలో అక్కడ ఔట్‌డోర్ దృశ్యాలు షూట్ చేయడానికి దేవ్ ఆనంద్, అతని భార్య కల్పనా వెళ్లారు. అక్కడ నేను వారిని కలుసుకోవడం తటస్థించింది. ఆ ప్రదేశం కృష్ణా, సరస్వతి, యమునా, వర్ని, కోయినా నదులకు జన్మస్థానం. 4500 అడుగుల ఎత్తున వుంటుంది. కోయినా నది లోయలో మహారాష్ట్రంలోకల్లా పెద్దదైన ప్రాజెక్టు వున్నది. అక్కడే దేవ్ ఆనంద్, కల్పనా నాకు కనిపించారు. వారి చిత్రానికి సంబంధించిన దృశ్యాలను షూట్ చేయడానికి బ్యాటరీలతో పనిచేసే పోర్టబుల్ కెమెరాను దర్శకుడు ఉపయోగిస్తున్నాడు. ఎక్కువభాగం షూటింగ్ యెన్నా సరస్సువద్ద జరిగింది. సరస్సును చూడగానే దేవ్ ఆనంద్ ఉత్సాహంతో నీళ్లలోకి దుమికి ఈదులాడాడు. నీళ్ళలోకి దిగడానికి భయపడుతున్న కల్పనాను కూడా హఠాత్తుగా నీళ్లలోకి తోశాడు. వారి చిత్రంలో బొంబే పాయింట్, వాటింగ్టన్ పాయింట్, కృష్ణ లోయ మొదలైన దృశ్యాలు చాలచోట్ల ఉపయోగించబడుతున్నాయి.

దేవ్ ఆనంద్ తన చిత్రంలోకి కావలసిన ఔట్‌డోర్ దృశ్యాలతో సహా ఎనిమిది రోజులపని వరసగా చేసి చిత్రాన్ని పూర్తి చేశాడు.

* * *

గృహిణి వేషాలు, దేవతాస్త్రీల వేషాలు ధరించడంలో అసమానురాలైన తార నిరూపారాయ్ త్వరలో దూరప్రాచ్యంలో పర్యటించబోతున్నది. బర్మా, థాయ్‌లెండ్, ఇండో చైనా, మలయా, ఇండోనేషియా దేశాల్లో ఆమె పర్యటిస్తుంది.

* * *

బొంబాయి ఫిలిం జర్నలిస్ట్ ఔరంగాబాద్‌కర్ ఇటీవల ఒక చిన్న సంచలనం కలిగించాడు. ఆయన ప్రకటించిన నర్గీస్ జీవిత చరిత్రపై ఆరోపణలు, ప్రత్యారోపణలు చాలా జరిగాయి. ప్రసిద్ధ తారలను తన వ్రాతలతో అగౌరవ పరుస్తున్నారని ఆయనపై ఆరోపించబడింది. ప్రభుత్వానికి కూడా ఫిర్యాదులు వెళ్ళాయి. ఔరంగాబాద్‌కర్ సమాధానమిస్తూ, తాను యథార్థం తప్ప మరేమీ వ్రాయడం లేదన్నారు. కొందరు సినిమా తారలు తమకు సంబంధించిన అసభ్య దృశ్యాలను సెల్యులాయిడ్ మీదికి ఎక్కించడానికి ఒప్పుకోవడం, ఆ ఫిలిమును రహస్యంగా అయిదు వందల రూపాయల రేటుకు ప్రదర్శించడం ఆయన తన వ్రాతల యథార్థతకు దృష్టాంతంగా పేర్కొన్నారు. అటువంటివారిని నీచులుగా వర్ణిస్తూ వ్రాయవలసిన అవసరం ఏముందని ఆయన ప్రశ్నించారు.

* * *

ప్రసిద్ధ దర్శకుడు, ప్రకాష్ పిక్చర్స్ అధినేత అయిన విజయభట్ "పత్రాని" అనే చిత్రం నిర్మిస్తున్నారు. గుజరాత్, కర్ణాటక ప్రాంతాల చరిత్రనుండి కొత్త ఇతివృత్తాన్ని సేకరించి ఆయన యీ చిత్రం తీస్తున్నారు. ఇది ఆయన తీసిన గొప్ప చిత్రాలన్నిటిలోకీ గొప్పచిత్రం అవుతుందని పలువురు చెబుతున్నారు. వైజయంతీమాల, ప్రదీప్‌కుమార్ నాయికా నాయకులుగా నటిస్తున్నారు. శశికళ, దుర్గాఖోటే, ఓంప్రకాష్ కూడా నటిస్తున్నారు. రామశంకర్ చౌధురి స్క్రిప్టు వ్రాశారు. శంకర్, జైకిషన్ వ్యయం సంగీతం కూర్చుతున్నారు. కళ కనూదేశాయ్, ఫొటోగ్రఫీ కపాడియా నిర్వహిస్తున్నారు.



మోహన్ ప్రొడక్షన్స్ తెలుగు చిత్రం "సతీ ధర్మం"లో ఒక దృశ్యం.

చలనచిత్ర నిర్మాణంలో భారతదేశానికి మూడోస్థానం

చాలకాలంవరకూ చిత్ర నిర్మాణంలో ద్వితీయస్థానం ఆక్రమించుకునివున్న భారత దేశం తృతీయస్థానంలో పడింది. యునెస్కో వారి "కొరియర్" ఏప్రిల్ పత్రికలో ఈ వివరా లివ్వబడినై: 1953 లో అమెరికా 360, జపాన్ 302, భారతదేశం 259, హాంకాంగ్ 200, ఇటలీ 150, బ్రిటన్ 138, ఫ్రాన్సు 111, పశ్చిమ జర్మనీ 101 చిత్రాలు నిర్మించాయి. చైనీస్ భాషా చిత్రాలకు గిరాకీ విపరీతంగా పెచ్చుడంవలన హాంకాంగ్ అకస్మాత్తుగా పెద్ద ఫిలింపరిశ్రమ కేంద్రాలలో ఒకటిగా తయారైంది.

జాపనీస్, ఇండియన్ చిత్రాలు ఇప్పుడు యూరపియన్ సినిమాలలో ప్రదర్శింపబడుతున్నాయి. జపాన్‌లో 3750, భారతదేశంలో 2000 సినిమా మందిరాలు ఉన్నాయని "కొరియర్" పత్రిక వ్రాసింది.

సినిమా వార్తలు

"చెరపకురా చెడెదవు"


భాస్కర్ ప్రొడక్షన్స్‌వారు తమ చిత్రానికి "చెరపకురా చెడెదవు" అని పేరు పెట్టారు. దాదాపు సగందాకా తయారైందని తెలుస్తోంది. నిర్మాత, దర్శకుడు కె. భాస్కరరావుగారు. ఈ చిత్రంలో ఎన్. టి. రామారావు, రేలంగి, అమరనాథ్, ఆర్. నాగేశ్వరరావు, జానకి, లక్ష్మీరాజ్యం, రాజసులోచన, పుష్పలత మున్నగువారు నటిస్తున్నారు. మాటలు, పాటలు సముద్రాల వ్రాశారు. సంగీతం ఘంటసాల వెంకటేశ్వరరావు సమకూరుస్తున్నారు.

* * *


మోహన్ ప్రొడక్షన్స్‌వారు "సతీ ధర్మం" అనే పేరుతో ఒక చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి మూలం ఒక మలయాళీ చిత్రం. నిర్మాత, దర్శకుడు కొటూరి మోహనరావు. రేవతీ స్టూడియోలో 'డబింగ్' జరుగుతోంది. మే నెలలో విడుదల కాగలదట.

* * *

ఇదివరలో "సాయిబాబా" చిత్రం తీసిన దర్శకుడు పట్టాభి హైదరాబాదు డిస్ట్రిబ్యూటర్ల సహకారంతో "జయ శేఖర" చిత్రం తెలుగులో నిర్మించబోతున్నారు. మాటలు, పాటలు పరశురాం, సంగీతం మల్లిక్, సంగీత పర్యవేక్షణ రాజేశ్వరరావు, ఫొటోగ్రఫీ శ్రీధర్ నిర్వహిస్తారట. సి. హెచ్. నారాయణరావు, జి. వరలక్ష్మి, రుక్మిణి, ముక్కామల, ఛాయాదేవి మున్నగువారు నటిస్తారు. నిర్మాణం రేవతీ స్టూడియోలో జరుగుతుంది. ★



"అనార్కలి"లో సలీం, అనార్కలీల ప్రణయ సన్నివేశం: నాగేశ్వరరావు, అంజలి దేవి.



★

డైరెక్టర్ బిమల్ రాయ్ పునః
తీస్తున్న "దేవదాసు" హిందీ
చిత్రం సెట్స్‌మీద చునీలాల్‌గా
నటిస్తున్న మోతీలాల్, మూడ
వచ్చిన చైనీస్ నటి చెంగ్ జూ ఫాంగ్,
బిమల్ రాయ్, దిలీప్ కుమార్.

★

Edited, Printed & Published by S. Sambbu Prasad at the Andhra Patrika Press, 7, Thambu Chetty St Madras